సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18+20 వెల: ₹5.00
సంపుటి: 10
సంచిక: 309
మంగళవారం 30-1-2018
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'అభివృద్ధి ఎంత ముఖ్యమో..
సంక్షేమమూ అంతే ముఖ్యం'


నూతనోత్సాహంతో...
మరో గ్రాండ్‌స్లామ్ గెలుపుతో రిటైర్మెంట్‌పై ఆలోచన లేదన్న ఫెదరర్
-స్పోర్ట్స్‌లో


భార్యాభర్తనాట్యం
-ఫ్యామిలీలో

ఆర్థిక సర్వే : 2017-18



'చమురు' వదులుతుందేమో!

దేశంలో తాజా పరిస్థితిని..
భవిష్యత్‌ను ఆవిష్కరించిన ఆర్థిక సర్వే

6.75% — 2017-18లో వృద్ధి రేటు
7-7.5% — 2018-19కి అంచనా

- నోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావాలు పోతున్నాయి
- కానీ పెరిగే చమురు ధరలతోనే చిక్కంతా
- దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదముంది
- పెరిగిపోయిన షేర్ల ధరలు కూడా పడిపోవచ్చు
- సమ్మిళిత వృద్ధికి గాను విద్య, ఆరోగ్యం వంటి సామాజిక రంగాలకు ప్రాధాన్యమివ్వాలి
- పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి జైట్లీ

- వివరాలు 14లో

రైతు ఆదాయం 25% తగ్గొచ్చు

- వాతావరణంలో మార్పుల కారణంగా రైతుల ఆదాయం రాబోయే కొన్నేళ్లలో 20 నుంచి 25 శాతం వరకు తగ్గొచ్చని ఆర్థిక సర్వే పేర్కొంది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సాంకేతికతను ఉపయోగించడం, సమర్థవంతమైన నీటిపారుదల వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఈ ప్రతికూల పరిస్థితిని కొంతవరకు అధిగమించొచ్చంది.


- 5లో

1000 కిలో మీటర్లు
ప్రజా సంకల్పం

వేలాది మంది ప్రజలు అడుగులో అడుగు వేస్తూ వెంట నడవగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం వద్ద సోమవారం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వెయ్యి కిలో మీటర్ల మైలు రాయిని అధిగమించారు. ఈ సందర్భంగా ఆయన అశేష ప్రజానీకం మధ్య పైలాన్‌ను ఆవిష్కరించారు.

6 లో






సోమవారం పార్లమెంటు సెంట్రల్‌హాల్‌లో ప్రసంగిస్తున్న కోవింద్

ఏకకాల ఎన్నికలే మేలు!

పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగంలో రాష్ట్రపతి

- ఖజనాపై భారం తగ్గుతుంది.. పార్టీలు దీనిపై చర్చించాలి
- ట్రిపుల్ తలాక్ చట్టంతోనే ముస్లిం మహిళలకు గౌరవం
- పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని వెల్లడి.. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు కృషి
- అంతర్జాతీయంగా భారత్‌కు గౌరవం పెరుగుతోంది

5 లో



ఉపాధికి ఊకొడతారా?

2 లో

36 మంది జలసమాధి

- కాలువలో పడిన ఆర్టీసీ బస్సు
- పశ్చిమ బెంగాల్‌లో ఘోర దుర్ఘటన

5 లో

గట్టిగా మాట్లాడితే జీతాలు ఇప్పించను



- కాంట్రాక్ట్ కార్మికులపై మంత్రి సోమిరెడ్డి కన్నెర్ర
- అనకాపల్లి కిసాన్‌మేళాకు హాజరైన మంత్రి
- 42 నెలల జీతాల బకాయిలపై విన్నవిస్తే మండిపాటు

అనకాపల్లి: 'ఏయ్ ఏంటి గట్టిగా మాట్లాడుతున్నారు.. గట్టిగా మాట్లాడితే జీతాలిప్పించను' అంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనకాపల్లిలో తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై మండిపడ్డారు. 42 నెలలుగా తమకు రావాల్సిన వేతన బకా యిల కోసం అడగడానికి వెళ్లిన కార్మికులపై మంత్రి విరుచుకుపడ డంతో వా రు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. సోమవారం విశాఖపట్నం జిల్లా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జరిగిన 59వ కిసాన్ మేళా సందర్భంగా ఈఘటన జరిగింది. ఈ మేళాకు మంత్రి సోమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదిక ఎక్కే ముందు కార్మికులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్మికులకు 42 నెలలుగా జీతాల్లేవని, ఇటీవల

మిగతా 2వ పేజీలో ▶



అధికారమే అండగా బొండాగిరి

- జీహుజూర్ అన్న రెవెన్యూ అధికారులు
- అండగా నిలిచిన పోలీసు అధికారి
- అడుగడుగునా సహకరించిన అధికార యంత్రాంగం
- తప్పుడు పత్రాలతో రూ.50 కోట్ల భూంఫట్
- జీపీఏ రద్దు పేరుతో కేసును నీరుగార్చే ఎత్తుగడ

2 లో

శ్రీవారి మెట్టు వద్ద పేలుడు పరికరాలు

కూంబింగ్‌లో స్వాధీనం చేసుకున్న పోలీసులు

3 లో

పేర్లు ఇవ్వకుంటే ఫుటేజీ తెప్పిస్తాం

కోడి పందేలు నిర్వహించిన ప్రజా ప్రతినిధులపై హైకోర్టు ఆగ్రహం

- బహిరంగంగా సవాళ్లు విసిరిన వారిని మేం టీవీల్లో చూశాం
- 809 మైదానాల్లో పందెం నిర్వాహకుల వివరాలివ్వండి
- ఆ తహసీల్దార్లు, ఎస్‌ఐలపై ఏం చర్యలు తీసుకున్నారు?
- తదుపరి విచారణ ఫిబ్రవరి 12కి వాయిదా

సాక్షి, హైదరాబాద్ : కోడి పందేలు జరగడానికి వీల్లేదంటూ తామిచ్చిన ఆదేశా లను ఉల్లంఘించి పందేలు నిర్వ హించిన ప్రజాప్రతినిధులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిం ది. కోడిపందేలు నిర్వహించి తీరుతామంటూ సవాళ్లు విసిరిన ప్రజా ప్రతినిధులను తాము టీవీల్లో చూశామని, వారి పేర్లను తమ ముందుంచాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఒకవేళ పేర్లు ఇవ్వకుంటే టీవీల నుంచి ఫుటేజీ తెప్పించుకుని వారిని ప్రతివాదులుగా చేరుస్తామని స్పష్టం చేసింది. పందేలు జరిపిన నిర్వాహకుల్లో ప్రజా ప్రతినిధులు ఎంత మంది ఉన్నారు? ఎంత మందిపై కేసులు పెట్టారో కూడా చెప్పాలంది. ప్రజా ప్రతినిధులు బాధ్యత

మిగతా 3వ పేజీలో ▶

@ysjagan

ప్రతి అడుగులో మీ ఆప్యాయత కనిపిస్తోంది

పాదయాత్ర వెయ్యి కి.మీ. పూర్తయిన సందర్భంగా వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: ''నేను వేసే ప్రతి అడుగులో మీ ఆప్యాయత, మద్దతు కనిపిస్తోంది. అడుగడుగునా మీరు చూపించే ఆత్మీయత, అభిమానంతోనే యాత్ర సాగిస్తున్నా. దివంగత మహానేత వైఎస్సార్‌పై మీరు చూపే అభిమానం నాకు బలాన్నిస్తోంది. ఆత్మ విశ్వాసాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి, అపనమ్మకం, మీ బాధలు నాకు తెలుస్తున్నాయి. మీ ఆశీర్వాదాలు.. నాకు కొండంత బలాన్ని, ధైర్యాన్ని ఇస్తున్నాయి'' అని వెయ్యి కి.మీ. పాదయాత్ర పూర్తయిన సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ట్వీట్ చేశారు.

YS Jagan Mohan Reddy @ysjagan · 4h
The 1000kms mark. Each step I take makes me aware of your affection and support. I have seen the love & respect for Dr.YSR, and felt your pain, anger and distrust towards the current Govt. Your blessings strengthen my resolve to continue with #PrajaSankalpaYatra

"నాపేరు వెంకటేశ్, మాది గుంటూరు జిల్లా పెదనందిపాడు. ఆర్థిక ఇబ్బందులున్నా కష్టపడి చదివి పీజీ పూర్తి చేశాను. పట్టా చేతికి వచ్చి నాలుగేళ్లు అయింది. అప్పటి నుంచి ఉద్యోగం ప్రయత్నాలు చేస్తున్నాను. కానీ రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇప్పటికీ నిరుద్యోగిగానే ఉన్నాను. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వడంలేదు. వాటిని భర్తీ చేసినా ఎంతోమందికి ఉపాధి లభించేది. ప్రత్యేక హోదా వచ్చి ఉంటే ఉద్యోగాలు వచ్చేవి. కానీ పాలకులు దానిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కానీ ఆయన హామీ నిలబెట్టుకోలేదు. భృతి ఇచ్చి ఉంటే కనీసం తల్లిదండ్రులకు భారంగా ఉండేవాడిని కాదు''. – సాక్షి, అమరావతి

ఉపాధికి ఊ కొడతారా?



అది ఒక్క వెంకటేశ్ ఆవేదనే కాదు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల పరిస్థితికి ప్రతిరూపం. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలోను, నిరుద్యోగ భృతి కల్పిస్తామన్న హామీని నెరవేర్చడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. నాలుగేళ్లయినా చదవుకున్న లక్షలాది యువతకు ఉపాధి దొరకడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లోనైనా ఉపాధి కల్పించేందుకు అవసరమైన పథకాలను, కార్యక్రమాలను ప్రవేశపెడతారనే ఆశతో రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. కేంద్ర పథకాల ద్వారానైనా ఉపాధి పొందాలని రాష్ట్ర నిరుద్యోగ యువత ఆశిస్తోంది. నైపుణ్య శిక్షణ కోసం పథకాలున్నప్పటికీ వాటి ద్వారా శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పిండంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సాధికార సర్వే ప్రకారం రాష్ట్రంలో 65 లక్షలమంది నిరుద్యోగులున్నట్లు వెల్లడైంది. ఇందులో 18 సంవత్సరాల నుంచి 35 ఏళ్లలోపు 45 శాతం మందికి ఉపాధి లేదని సర్వే పేర్కొంది. చదువులు పూర్తయ్యి ఖాళీగా ఉన్న యువత 20.19 లక్షలుగా పేర్కొంది. మధ్యలో చదువు ఆపేసి ఉపాధి లేని వారు 9.17 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది, రాష్ట్ర విభజన నాటికి రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీల సంఖ్య 1.42 లక్షలున్నట్లు తేల్చారు. ఈ ఖాళీలను భర్తీచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చింది. 2014 నుంచి పదవీ విరమణ చేయడంతో ఖాళీ అయిన ఉద్యోగుల సంఖ్య 1.80 లక్షలకు చేరింది.

ఉద్యోగాల భర్తీకి ఓకే చెప్పాలి..



ఏటా లక్షల సంఖ్యలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారు. వీరితో పాటు డిగ్రీ పట్టాలు పొందుతున్న వారూ అనేక మంది ఉంటున్నారు. అందరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి బడ్జెట్‌లో ఆమోదం తెలపాలి.

– మహేంద్ర, రాయలసీమ వర్సిటీ విద్యార్థి, కర్నూలు

పరిశ్రమల స్థాపనకు రుణం ఇవ్వాలి



నిరుద్యోగులకు స్వయంఉపాధికి చిన్న సన్నకారు పరిశ్రమల స్థాపనకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించాలి. దీనివల్ల వారు మరో పదిమందికి ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుంది. బడ్జెట్‌లో విద్యకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి.

– మానేపల్లి శ్రీనివాసరావు, ఎంప బీఈడీ, నిరుద్యోగి, వంగపల్లిపేట, చీపురుపల్లి

అధికారమే అండగా బొండాగిరి

జీహుజూర్ అన్న రెవెన్యూ అధికారులు ● అండగా నిలిచిన పోలీసు అధికారి

సాక్షి, అమరావతిబ్యూరో: బొండా ఉమామహేశ్వరరావు భూ దాహానికి అధికార యంత్రాంగం అడుగడుగునా అండగా నిలిచింది. రెవెన్యూ, పోలీసు శాఖలు శక్తివంచన లేకుండా సహకారం అందించినట్లు అనేక రుజువులు లభిస్తున్నాయి. వారి అండతోనే రికార్డులు తారుమారు చేసి స్వాతంత్ర్య సమరయోధునికి చెందిన రూ.50 కోట్లకు పైగా విలువైన 5.16 ఎకరాల భూమి గుప్పిట్లోకి తెచ్చుకున్నట్లు స్పష్టం అవుతోంది. 'బొండాగిరి'కి సంబంధించి పలు కొత్త కోణాలు 'సాక్షి' పరిశోధనలో వెలుగుచూశాయి.

రికార్డులు లేని కాలాన్ని ఆసరాగా చేసుకుని..


1971–88 మధ్య కాలంలో భూములు, ఆస్తుల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన విజయవాడ గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు ధ్వంసమయ్యాయి. దాన్నే ఎమ్మెల్యే బొండా ఉమా తమ భూదందాలకు అవకాశంగా మలచుకున్నారు. స్వాతంత్ర్యసమరయోధుడు సూర్యనారాయణ పెద్ద కుమారుడు వెంకటేశ్వరరావు ఆ భూమిని విజయవాడకు చెందిన అబ్దుల్‌మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావుకు 1988లో విక్రయించినట్లు 2016లో పత్రాలు సృష్టించారు. వాస్తవానికి వారిద్దరికీ కూడా ఆ విషయం తెలీదు. అబ్దుల్ మస్తాన్ చిన్నా చితకా పనులు చేస్తూ ఉంటారు. ఇక కోటేశ్వరరావు దిగువ మధ్యతరగతికి చెందిన లారీ డ్రైవర్. అంతటి విలువైన భూములను కొనుగోలు చేసే ఆర్థికస్తోమత వారిద్దరికీ లేదు. ఆ పత్రాలను చూపిస్తూ ఆ 5.16 ఎకరాలను అబ్దుల్ మస్తాన్, కోటేశ్వరరావు పేరిట మ్యుటేషన్ చేయాల్సిందిగా తహశీల్దార్‌కు 2016, జులై 31న దరఖాస్తు చేశారు. ఇక్కడే రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా ఎమ్మెల్యే బొండా కుటుంబానికి సహకరించింది. తహసిల్దార్ ఆ దరఖాస్తును ఓకే చేస్తూ కలెక్టర్‌కు పంపగా ఆయన ఐజీ(రిజిస్ట్రార్స్)కు నివేదించారు. ఇలా అన్ని స్థాయిల్లో సహకరించి ఆ భూములను 22ఎ నిబంధన కింద మ్యుటేషన్ చేసేయడం గమనార్హం. దరఖాస్తుదారులైన అబ్దుల్ మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావు తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లకున్నా బొండా కనుసైగతోనే అధికారులు మ్యుటేషన్ తతంగం పూర్తి చేసేశారు. అనంతరం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తరువాత అబ్దుల్ మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావు 2017 మార్చి 15న ఎమ్మెల్యే బొండా ఉమా భార్య సుజాతతోపాటు మరో అయిదుగిరికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) కింద రాసిచ్చినట్లు కథ నడిపించారు. అడంగళ్‌లోనూ పేర్లు మార్చేసి రూ.50కోట్ల విలువైన భూమి పూర్తిగా ఎమ్మెల్యే బొండా ఉమా సొంతం చేసుకున్నారు.



సోమవారం తమ భూమిలోకి ప్రవేశించలేక బయటే ఉండిపోయిన సూర్యనారాయణ కోడలు రాజరత్నమ్మ, పెద్ద మనవడు శ్రీనివాస్

బొండా భూబాగోతానికి పోలీసు అండ

తమ కుటుంబానికి చెందిన 5.16 ఎకరాలకు ప్రహరీ నిర్మించి ఆక్రమించుకున్న ఎమ్మెల్యే బొండా కుటుంబాన్ని ఇదేమిటని అడిగితే దౌర్జన్యానికి దిగారంటూ సూర్యనారాయణ మనవడు సురేష్ 2017, ఫిబ్రవరి 10న విజయవాడ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఏసీపీ స్థాయి అధికారి ఒకరు సురేష్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. (ఎమ్మెల్యే బొండా సిఫార్సుతోనే ఆ అధికారికి పోస్టింగు దక్కిందన్న విమర్శలు ఉన్నాయి.) భూ విషయమై ఎన్నిసార్లు పోలీసులను సంప్రదించినా ఆ అధికారి బెదిరించారు. ఫిర్యాదులో అంశాలన్నీ తప్పని, మరోసారి ఈ భూమి గురించి మాట్లాడితే తప్పుడు పత్రాలు సృష్టించినట్లు కేసు పెడతానని కూడా సురేష్‌బాబును బెదిరించారు. దాంతో తనకు పోలీసులు సహకరించరని అర్థం చేసుకున్న సురేష్ సీఐడీ అధికారులను ఆశ్రయించారు. దాంతో మొత్తం ఎమ్మెల్యే బొండా ఉమా కుటుంబం భూబాగోతం వెలుగులోకి వచ్చింది.



అక్టోబరు 23న బొండా ఉమా భార్య సుజాత, ఆయన అనుచరుల మీద సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్



డిసెంబర్ 4న ఎమ్మెల్యే బొండా ఉమా కుటుంబం ఆ భూమి మీద పవర్ ఆఫ్ అటార్నీని రద్దు చేసుకున్న పత్రాలు

మా తప్పిదమేమీ లేదు: రిజిస్ట్రార్ అధికారులు

ఎమ్మెల్యే బొండా కుటుంబం భూబాగోతంపై సీఐడీ కేసు నమోదు కావడంతో రిజిస్ట్రేషన్ శాఖ విచారణ చేపట్టింది. ఐజీ (రిజిస్ట్రేషన్లు) వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ప్రాథమిక నివేదిక సమర్పించారు. ఆ భూమిపై తహశీల్దార్ చేసిన మ్యుటేషన్ ఆధారంగానే రిజిస్ట్రేషన్ చేశామని, అందులో రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల తప్పేమి లేదని నివేదించినట్లు తెలుస్తోంది.

కేసు నమోదుతో జీపీఏ రద్దు నాటకం

కేసు నమోదు కావడం, కోటేశ్వరరావు అప్రూవల్‌గా మారడంతో సీఐడీ అధికారుల కళ్లుగప్పి ఆ కేసు నుంచి బయటపడేందుకు బొండా ఉమా కుటుంబం మరో ఎత్తుగడ వేసింది. గత అక్టోబర్‌లో కేసు నమోదు కాగా డిసెంబర్ 4న జీపీఏ రద్దు చేసుకుంటున్నట్లు పత్రాలు సృష్టించారు. అంటే సీఐడీ కేసు నమోదు చేసిన తరువాతే ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారన్నది స్పష్టమవుతోంది. సీఐడీ విచారణ నుంచి తప్పించుకునేందుకే ఎమ్మెల్యే బొండా ఉమా కుటుంబం ఈ ఎత్తుగడను ఎంచుకున్నారు. మరోవైపు అప్రూవర్‌గా మారిన కోటేశ్వరరావును బెదిరించి తమకు అనుకూలంగా మలచుకోవాలన్నది వ్యూహం. తద్వారా సీఐడీ కేసును నీరుగార్చాలని పథకం వేశారు. అయితే ఈ చర్యతో ఆ భూమిని పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా పొందడం అక్రమమని వారే సమ్మతించినట్లవుతోంది. జీపీఏ నెల క్రితమే రద్దు చేసుకున్నట్లు చెబుతున్నా అధికారదర్పంతో భూమిని మాత్రం ఇప్పటికీ తమ గుప్పిట్లోనే పెట్టుకున్నారు. ఆ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి తమ మనుషులను కాపలా పెట్టారు. సూర్యనారాయణ కుటుంబ సభ్యులను అక్కడకు రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. సూర్యనారాయణ కోడలు జోగరత్నమ్మ, పెద్ద మనవడు శ్రీనివాస్ సోమవారం కూడా ఆ భూమి వద్దకు వెళితే కాపలాదారులు అడ్డుకున్నారు. సీఐడీ కేసు నీరుగార్చేవరకు నిరీక్షించి తర్వాత భూమిపై పట్టు సాధించాలన్నది ఎమ్మెల్యే కుటుంబ లక్ష్యంగా ఉంది.

గట్టిగా మాట్లాడితే జీతాలు ఇవ్వనియ్యను

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్ఎంఆర్ కార్మికులను తొలగిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, రైతులకు తాము భరోసా ఇస్తామని చెప్పి ప్రసంగం ముగించారు. మంత్రి ప్రసంగం పూర్తయిన వెంటనే కార్మికుల సమస్యలపై మాట్లాడాలంటూ సీపీఎం నేత బాలకృష్ణ, ప్రజా రాజకీయ ఐక్య వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేశ్‌బాబు, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత కొణతాల హరనాథబాబులు నినాదాలు చేశారు. సమస్యలను ప్రస్తావిస్తానంటూనే మంత్రి వేదిక దిగి వెళ్లిపోయారు. మంత్రి తమ గురించి మాట్లాడతారని ఎదురుచూసిన ఎస్ఎంఆర్ కార్మికులు నిరాశ చెంది నినాదాలు చేశారు. స్పందించిన మంత్రి సోమిరెడ్డి ఎస్ఎంఆర్ కార్మిక నేత నర్సింగరావును పిలిచి ఏం అరుస్తున్నావ్ అని అడిగారు. తమ కష్టాల గురించి స్పందించలేదంటూ నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేస్తూనే.. జీతాలను ఇప్పించాలని కోరారు. దీంతో గట్టిగా అరిస్తే జీతాలు రానీయకుండా చేస్తాననడంతో కార్మికులు అసంతృప్తికి గురయ్యారు. కార్మికులకు భరోసా ఇచ్చేలా మాట్లాడకుండా మంత్రి వ్యవహరించడం దారుణమని ప్రజా సంఘాల నేతలు అన్నారు.



కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సోమిరెడ్డి

'బొండాగిరి'పై ఇంటెలిజెన్స్ ఆరా..!

సాక్షి, అమరావతి: అధికార టీడీపీకి బొప్పికట్టించిన 'బొండాగిరి' వ్యవహారంపై ఇంటెలిజెన్స్ ఆరా తీసింది. రాజధాని ప్రాంతంలోని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమాపై ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఎమ్మెల్యే కాక ముందు నుంచి ఇప్పటి వరకు బొండా వ్యవహారాల చిట్టాను సేకరించినట్టు సమాచారం. నగరంలో సాధారణ వ్యక్తిగా మొదలైన ప్రస్థానం, చిత్తూరు జిల్లాలో అజ్ఞాతవాసం, ఆపై రాజకీయంగా సాగిస్తున్న దందాల వరకు అన్ని వివరాలనూ సేకరించారు. ఎమ్మెల్యే అయిన తొలినాళ్లలో ఆయన తనయుడు గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో కార్ రేస్, యువకుడి మృతి రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఎమ్మెల్యే కుటుంబసభ్యులు, అనుచరుల ప్రమేయమున్న పలు వ్యవహారాలపై కూడా ఆరా తీశారు. బ్రాహ్మణ సమాఖ్య నిర్వహణలో ఉన్న సత్యనారాయణపురం సీతారామ కళ్యాణమండపానికి తాళం వేయడం నుంచి మాదంశెట్టి సుమశ్రీకి చెందిన ప్లాట్‌ను ఆక్రమించుకోవడం (వైద్యం అందక ఆమె 13 ఏళ్ల కుమార్తె సాయిశ్రీ మృత్యువాత పడడం), విజయవాడ శివారు కండ్రికలో కార్పొరేషన్ భూమిని బొండా సోదరుడు పెన్సింగ్ వేసి ఆక్రమించడం, సింగ్‌నగర్, పాయకాపురం బర్మాకాలనీల్లో ఎమ్మెల్యే అనుచరులు ఇల్లు, ప్లాట్లు ఆక్రమించడం ఇలా అన్ని విషయాలపై ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టి పెట్టారని సమాచారం. తాజాగా స్వాతంత్ర్య సమరయోధుడికి చెందిన రూ.50 కోట్ల విలువైన భూమి కబ్జా కేసులో ఎమ్మెల్యే సతీమణి సుజాత, ఆయన ప్రధాన అనుచరుడు మాగంటి రాంబాబు మరో ఆరుగురు ఉండటం సంచలనం రేపింది. ఈ అన్ని సంఘటనల వివరాలతో ప్రాథమికంగా నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది.

బొండా ఉమాపై అనర్హత వేటువేయండి

విజయవాడ సిటీ: టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా భూకబ్జాలు, దందాలపై చంద్రబాబు వెంటనే స్పందించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో పార్టీ నేతలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. బొండా అనుచరులు గతంలో సుమశ్రీ అపార్ట్‌మెంట్‌ను ఆక్రమించుకోవడం, సెటిల్‌మెంట్లతో నిస్సహాయులను బెదిరించడం ఇలా ఎన్నో దారుణాలు వెలుగుచూసినా చంద్రబాబు పట్టించుకోవడంలేదన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్‌పై ఫిర్యాదు

హైదరాబాద్: అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ అరాచకాలు నియోజకవర్గంలో పెరిగిపోతున్నాయని ఏపీ బీసీ సంఘం మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. మహబూబ్ బాషా సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ముస్లింలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని, లొంగని వారిపై ఎమ్మెల్యే అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన కమిషన్.. దీనిపై సమగ్ర నివేదికను ఏప్రిల్ 17 నాటికి అందజేయాలని అనంతపురం ఎస్పీకి నోటీసులు జారీ చేసింది.

భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని..

'అనంత' కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

అనంతపురం న్యూసిటీ: భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని ఓ మహిళ అనంతపురం కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులను ఆశ్రయించినా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేసింది. వివరాలు.. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన ఎం.కిశోర్‌తో పామిడికి చెందిన హరితకు 2010లో వివాహమైంది. వీరికి మూడేళ్ల రితికతో పాటు ఆరు నెలల పాప ఉంది. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టడంతో.. కిశోర్ కుటుంబసభ్యులు 5 నెలల కిందట మరొకరితో అతనికి పెళ్లి చేశారు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ హరిత.. ఎస్ఐతో పాటు జిల్లా ఎస్పీ, కలెక్టర్ తదితరులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ గార్లదిన్నె ఎస్ఐని ఆదేశించారు. కానీ ఎస్ఐ మాత్రం.. కిశోర్ కుటుంబసభ్యులకు అనుకూలంగా కేసు నమోదు చేశారు. దీంతో హరిత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమానికి హాజరై మరోసారి ఫిర్యాదు చేసింది. అయినా కూడా తనకు న్యాయం జరిగేలా లేదని భావించిన ఆమె.. కలెక్టర్ కార్యాలయం నుంచి బయటకు వచ్చాక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. అనంతపురం డీఎస్పీ వెంకట్రావ్ మాట్లాడుతూ.. హరిత ఫిర్యాదు మేరకు ఈ నెల 26న కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న హరిత

ఆడ పిల్లగా పుట్టడమే పాపమా?

ఆడపిల్లగా పుట్టడమే నేను చేసుకున్న పాపం. నాకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టడం మహాపాపం. చచ్చిపోవాలంటూ నాపై ఒత్తిడి చేస్తున్న అత్తింటివారిపై చర్యలు తీసుకోవాలి. – హరిత

ఇదండీ సంగతి



ప్రభుత్వాస్పత్రులకు నాసిరకం 'మాత్రలు'

వెనక్కు పంపించాలని ఏపీఎంఎస్ఐడీసీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రులకు సరఫరా అయ్యే విటమిన్ బీ కాంప్లెక్స్ మాత్రలు (బ్యాచ్ నం.బీసీ 17017) నాసిరకమని నిర్ధారణైంది. వీటిని ల్యాబొరేటరీకి పంపించగా 'నాట్ స్టాండర్డ్ క్వాలిటీ' (ఎన్ఎస్క్యూ) అని తేలింది. దీంతో ఇప్పటికే సరఫరా అయిన మాత్రలను వెనక్కు పంపించాలని రాష్ట్ర మౌలిక వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఆదేశాలిచ్చింది. నిబంధనల ప్రకారం ముందుగా సదరు బ్యాచ్‌కు చెందిన మాత్రలకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు నాణ్యతా పరీక్షలు నిర్వహించిన తరువాతనే వాటిని ఆస్ప త్రులకు సరఫరా చేయాలి. కానీ ఆస్పత్రులకు పంపించాక వాటికి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. ఈ మాత్రలను రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది పేదలు వాడుతున్నారు. ఇవి నాసిరకం అని నిర్ధారణ అయ్యే సరికే వివిధ ఆస్పత్రుల్లో మాత్రలు వినియోగమైనట్టు వైద్యులు తెలిపారు. ఈ మాత్రలను గ్రీన్‌ల్యాండ్స్ ఆర్గానిక్ సంస్థ సరఫరా చేసినట్టు అధికారులు వెల్లడించారు.

ఆయుష్ అడ్మిషన్లూ నీట్ పరిధిలోకే

2018–19 విద్యా సంవత్సరం నుంచే అమలు

సాక్షి, అమరావతి/విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): ఆయుర్వేద, యునాని, న్యాచురోపతి, హోమియో ఆయుష్ కోర్సుల్లో అడ్మిషన్లను నీట్ పరిధిలోకి తీసుకొస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2018–19 విద్యా సంవత్సరం నుంచే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీకి సోమవారం లేఖ రాసింది. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆయుష్ కళాశాలల్లో ఉన్న సీట్లను నీట్ ర్యాంకుల ద్వారానే భర్తీ చేయాలని పేర్కొంది. కాగా, ఈ సీట్లు జాతీయ పూల్‌లోనే ఉంటాయని అధికార వర్గాలు తెలిపాయి. దీనిపై ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఆయుష్ కోర్సుల్లో అడ్మిషన్లకు తప్పని సరిగా నీట్‌లో అర్హత సాధించాలన్నారు.

సీఏ- ఐపీసీసీ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్‌కు 8 ర్యాంకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆదివారం ప్రకటించిన సీఏ–ఐపీసీసీ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ఎనిమిది ర్యాంకులను కైవసం చేసుకున్నారని ఆ సంస్థ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గుంటూరులోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో విడుదల చేసిన టాప్–50 ర్యాంకుల్లో తమ విద్యార్థులు 29, 30, 36, 39, 43, 44, 44, 50వ ర్యాంకులు సాధించారని తెలిపారు. మొత్తం ఫలితాల్లో తమ విద్యార్థులు 1,400 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

పేర్లు ఇవ్వకుంటే ఫుటేజీ తెప్పిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

మర్చిపోయి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం ఎంత మాత్రం సబబు కాదంది.

ఒత్తిడికి తలొగ్గినట్లుంది..

కోడిపందేలు జరిగిన తీరు చూస్తుంటే వారి ఒత్తిడికి అధికారులు తలొగ్గినట్లు కనిపిస్తోందని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఉభయ గోదావరి జిల్లాల్లోని 809 మైదానాల్లో కోడి పందేలు నిర్వహించిన నిర్వాహకుల పేర్లు, చిరునామాలను అందచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోడి పందేలపై గత ఏడాది తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన 43 మంది తహసీల్దార్లు, 48 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లపై ఏం చర్యలు తీసుకున్నారో కూడా వివరించాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది కూడా తమ ఆదేశాలను అమలు చేయని తహసీల్దార్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లపై ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలంది. తాము కోరిన వివరాలతో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టు ముందు హాజరైన సీఎస్

సంక్రాంతి సందర్భంగా కోడి పందేల మాటున అశ్లీల నృత్యాలు, జూదం, వ్యభిచారం జరగకుండా అధికారులను ఆదేశించాలని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయటం తెలిసిందే. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశాల మేరకు సీఎస్ దినేష్‌కుమార్ సోమవారం స్వయంగా హాజరయ్యారు. తదుపరి విచారణల నుంచి సీఎస్‌కు ధర్మాసనం మినహాయింపునిచ్చింది. సీఎస్, డీజీపీలు సిద్ధం చేసిన నివేదికలను అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ ధర్మాసనం ముందుంచారు.

గతేడాది చర్యలు తీసుకోకపోవటంతో పునరావృతం...

కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా పందేలు నిర్వహించిన వారిపై కేసులు పెట్టడమే కాకుండా అరెస్టులు కూడా చేసినట్లు ఏజీ నివేదించారు. దీనిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ప్రజా ప్రతినిధుల ప్రస్తావన తెచ్చింది. 'మా ఆదేశాలకు విరుద్ధంగా ప్రజా ప్రతినిధులే కోడి పందేలు నిర్వహిస్తామని బహిరంగంగా ప్రకటించటం జాతీయ టీవీల్లో కూడా ప్రస్తారమైంది. దీన్ని మేం కూడా చూశాం. 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు ఉన్నా పందేలు ఎలా జరిగాయి? కోళ్లకు కత్తులు కట్టి ప్రజాప్రతినిధులు దగ్గరుండి పందేలు నిర్వహించిన ఘటనలు మేం చూశాం. వారు మీకు (ప్రభుత్వానికి) కనిపించకపోయినా మాకు కనిపించారు. మేం వద్దని ఆదేశాలిచ్చిన తరువాత కూడా పందేలు నిర్వహించిన ప్రజా ప్రతినిధులు ఎవరో చెప్పండి. మీరు చెప్పకపోతే టీవీల నుంచి ఫుటేజీ తెప్పిస్తాం' అని ధర్మాసనం తేల్చి చెప్పింది. గత ఏడాది కూడా ఇలాగే జరిగిందని, అప్పుడు చర్యలు తీసుకోలేదు కాబట్టే పునరావృత్తమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సీసీఎల్ఏకి అభియోగాల డ్రాఫ్ట్

గత ఏడాది హైకోర్టు ఆదేశాలను అమలు చేయని తహసీల్దార్లపై కలెక్టర్లు అభియోగాల డ్రాఫ్ట్ సిద్ధం చేసి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కి పంపారని ఏజీ నివేదించారు. సబ్ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకునే అంశం హోంశాఖ పరిశీలనలో ఉందన్నారు.


ఈ ఏడాది పందేలు తగ్గాయి...

తాము ఎన్ని చర్యలు తీసుకున్నా సాంస్కృతిక క్రీడలు అంటూ కొందరు కోడి పందేలు నిర్వహించారని, మహిళలు, పిల్లలు ఇందులో పాల్గొనడంతో పోలీసు బలగాలను ప్రయోగించటం సాధ్యం కాలేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ తన నివేదికలో వివరించారు. ముగ్గులు, గాలిపటాల పేరుతో మైదానాలు సిద్ధం చేసి కోడి పందేలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు తీసుకున్న చర్యల వల్ల గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కోడి పందేలు తగ్గాయని తెలిపారు.

నివేదికలో సీఎస్ ఇంకా ఏం చెప్పారంటే..

- తూర్పు గోదావరిలో 136 మైదానాల్లో కోడి పందేలు నిర్వహించిన వారిపై సెక్షన్ 110 కింద 485 కేసులు, 144 సెక్షన్ కింద 771 కేసుల నమోదు.
- 1885 మంది అరెస్ట్. 738 కోడి పుంజులు, 882 కత్తులు, రూ.18.67 లక్షల స్వాధీనం.
- జిల్లాలో కోడి పందేలకు వ్యతిరేకంగా 136 అవగాహన కార్యక్రమాల నిర్వహణ.
- పశ్చిమ గోదావరిలో 673 మైదానాల్లో కోడి పందేలు జరిగాయి. సెక్షన్ 110 కింద 1723 కేసులు, 144 సెక్షన్ కింద 634 కేసుల నమోదు.
- 2182 మంది అరెస్ట్. రూ.17.74 లక్షల నగదు, 1191 కోడి పుంజులు, 2382 కత్తుల స్వాధీనం.
- జిల్లాలో 565 అవగాహన కార్యక్రమాల నిర్వహణ.
- కృష్ణా జిల్లాలో 1,319 కేసులు నమోదు. 1,090 మంది అరెస్ట్. రూ.3.51 లక్షల నగదు స్వాధీనం. 1,116 కోడి పుంజులు, 1,425 కత్తుల స్వాధీనం.
- కృష్ణా జిల్లాలో 1,900 అవగాహన కార్యక్రమాల నిర్వహణ.

తిరుపతిలో పేలుడు పరికరాల స్వాధీనం



శ్రీవారిమెట్టు సమీపంలో స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలు

చంద్రగిరి : చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం శేషాచల అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులకు సోమవారం రాత్రి పేలుడు పరికరాలు లభ్యమవ్వడం కలకలం సృష్టించింది. అధికారుల కథనం మేరకు.. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టడంలో భాగంగా తిరుపతి శ్రీవారి మెట్టు వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు కూంబింగ్ నిర్వహిస్తుండగా ఒక బ్యాగును గుర్తించారు. బ్యాగులో పేలుడుకు ఉపయోగించే సర్క్యూట్ బోర్డులు, సెల్‌ఫోను, వాక్‌మెన్, రెసిస్టర్లు, కెపాసిటర్లు, కండెన్సర్లు ఇతర పరికరాలను అధికారులు గుర్తించారు. దీంతో వెంటనే ఆర్ఎస్సై వాసు ఐజీ కాంతారావుకు సమాచారం అందించారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పేలుడుకు ఉపయోగించే పరికరాలుగా నిర్ధారించారు. అనంతరం కాంతారావు బాంబు స్క్వాడ్‌కు సమాచారం అందించారు. వారూ ఘటనా స్థలానికి చేరుకుని వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఐజీ కాంతారావు మీడియాతో మాట్లాడుతూ, ఇవి పేలుళ్లు సృష్టించడానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అడవిలో ఎవరూ లేనిచోటుకు గుర్తుతెలియని వ్యక్తులు తీసుకొచ్చి వాటిని సిద్ధంచేసినట్లు తెలుస్తోందన్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులతో పాటు ఇతర వీఐపీలు శ్రీవారి మెట్టు మార్గం ద్వారా తిరుమలకు వెళ్తుంటారని, అయితే.. ఎవరిని టార్గెట్ చేసి వీటిని తయారుచేశారు, ఎందుకు చేయాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలుతుందని కాంతారావు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సంచీపై తమిళనాడు తిరుచ్చికి చెందిన చిరునామా ఉందని.. లభ్యమైన ఆధారాలకు అనుగుణంగా కేసును దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జూన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలు

జలవనరుల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి : భూగర్భ జలాలు పెంచడం ద్వారా వ్యవసాయ విద్యుత్ వినియోగంలో మిగులు సాధించామని సీఎం చంద్రబాబు చెప్పారు. కాలువలు, చెరువులు పటిష్టపర్చడంతో పాటు చెక్‌డ్యాంల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయిన వెంటనే జూన్‌లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహి స్తామన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం జలవనరుల శాఖపై ఆయన సమీక్షించారు. భవిష్యత్‌లో రాజధాని తాగునీటి అవసరాల దృష్ట్యా కృష్ణానదిపై వైకుంఠాపురం వద్ద బ్యారేజ్ నిర్మిస్తామన్నారు. దీనిపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఫిబ్రవరి 5 నాటికి అందించాలని ఆదేశించారు. పోలవరంపై వర్చువల్ రివ్యూలో.. గత వారం రోజుల్లో 1.90 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం పనులు, 3,826 క్యూబిక్ మీటర్ల మేర స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని, డయా ఫ్రమ్ వాల్ 19.6 మీటర్ల వరకు నిర్మాణం జరిగిందని అధికారులు సీఎంకు వివరించారు. స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులను నవయుగకు అప్పగించామని దానితో సమన్వయం చేసుకోవాలని ట్రాన్స్‌ట్రాయ్‌ను ఆదేశించారు.



సచివాలయంలో ఇటాలియన్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన సీఎం చంద్రబాబు

ఇటలీ కంపెనీతో చర్చలు..

రాజధాని నిర్మాణ పనులపై ఇటలీకి చెందిన నిర్మాణ సంస్థ అనస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో సీఎం సోమవారం సమావేశమయ్యారు. అమరావతిలో నిర్మించే రోడ్డు ప్రాజెక్టుల్లో భాగస్వాములమవుతామని, ఐకానిక్ వారధి నిర్మాణానికి అవకాశమివ్వాలని కోరారు. జన్మభూమిలోని వినతులన్నింటినీ ఈనెల 31లోపు పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీఎంను కలిసి రాజధానికి రూ.లక్ష విరాళమిచ్చిన ముదినేపల్లికి చెందిన తొమ్మిదో తరగతి బాలిక అంబుల వైష్ణవిని అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం నియమించారు. సీఏలో ఆలిండియా నాలుగో ర్యాంకు సాధించిన ఎం. ఫణీష్ రెడ్డిని సీఎం అభినందించి రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.


సాక్షి
మంగళవారం, జనవరి, 30

ఆశావహ స్వరం

ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థలూ పదేళ్ల తర్వాత మళ్లీ పుంజుకుంటున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్న వేళ కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ 2018–19 ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ప్రధాన బడ్జెట్‌కు ముందు ఏటా లాంఛనంగా ప్రవేశపెట్టే ఈ సర్వే దేశ ఆర్థిక స్థితిగతులెలా ఉన్నాయో, వివిధ రంగాల పనితీరు ఎలా ఉన్నదో చెబుతుంది. ఎలా ఉండబోతున్నదో అంచనా వేస్తుంది. అందులో ఆశావహం కలిగించేవీ ఉంటాయి. బెంబేలెత్తించేవీ ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలు, అది తీసుకున్న వివిధ చర్యలు ఎలాంటి ఫలితాలిచ్చాయో సర్వే గణాంకాలు సమగ్రంగా వెల్లడిస్తాయి. దేశ సాంఘికార్థిక పరిస్థితుల గురించి కూడా ఆర్థిక సర్వే ఏకరువు పెడుతుంది. సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది జరగాల్సి ఉన్నా అవి ఇంకా ముందే ఉండొచ్చునని ఊహాగానాలు వెలువడుతున్నాయి. అందువల్లే కావొచ్చు... ఆర్థిక సర్వే మరీ నిరాశాపూరిత అంచనాల జోలికి పోలేదు. కొన్ని రంగాల్లో పరిస్థితులు సక్రమంగా లేవని చెప్పినా వాటిని అధిగమించడానికి అవకాశాలున్నాయని ధ్వనించింది. ముఖ్యంగా 2018–19 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7–7.5 శాతం మధ్య ఉండొచ్చునని అది చెప్పిన మాట మార్కెట్‌లో ఉత్సాహం నింపింది.

గత ఆర్థిక సంవత్సరం కేంద్రం తీసుకున్న పెద్దనోట్ల రద్దు నిర్ణయం, ఇప్పుడు ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలో సరుకులు, సేవల పన్ను(జీఎస్‌టీ) అమలు నిర్ణయం అత్యంత కీలకమైనవి. ఈ రెండూ దేశ ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేయడానికి ఉద్దేశించిన చర్యలు. అయితే ప్రపంచమంతా ఆర్థిక వ్యవస్థలు మెరుగవుతున్న సూచనలు కనిపిస్తుండగా, మనం మాత్రమే వెనకబడి ఉండటానికి కారణం ఈ రెండు నిర్ణయాల ప్రభావమేనన్న మాట వాస్తవం. ఈ సర్వే పెద్ద నోట్ల రద్దు ప్రభావం గురించి నేరుగా ప్రస్తావించలేదు. జీఎస్‌టీ అమలు సాహసోపేతమైన నిర్ణయమని, అది విజయవంతంగా అమలవుతున్నదని చెప్పినా... స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)పైనా, ఉపాధి కల్పనపైనా దాని ప్రభావమేమిటో వివరించలేకపోయింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల అదనంగా 18 లక్షలమంది పన్ను చెల్లింపుదారులు వచ్చిచేరినా వారిలో అత్యధికులు తక్కువ స్లాబ్‌లో ఉన్నవారే. కాబట్టి వీరి వల్ల ఇప్పట్లోతైతే సర్కారుకు ఆదాయం పెద్దగా పెరిగే అవకాశం లేదు. వీరి వార్షికాదాయం రాగల సంవత్సరాల్లో పెరగాలంటే ఆరోగ్యవంతమైన ఆర్థిక వ్యవస్థ అవసరమవుతుంది. మెరుగైన ప్రభుత్వ విధానాలు మాత్రమే అలాంటి ఆర్థిక వ్యవస్థకు దోహదపడతాయి. నిరుటి ఆర్థిక సర్వే పెద్ద నోట్ల రద్దు వల్ల జీడీపీపై 0.5 శాతం కోత పడి 6.5 శాతంగా ఉన్నదని చెప్పింది. 2017–18లో తిరిగి సాధారణ స్థితి ఏర్పడి జీడీపీ 7.5 శాతానికి ఎగబాకుతుందని జోస్యం చెప్పింది. ఈ తడవ రెండేళ్లలో 8 నుంచి 10 శాతం వరకూ తీసుకెళ్తామని కూడా భరోసా ఇచ్చింది. కానీ జరిగిందేమిటి? అది 6.75 ఉండొచ్చునని ప్రస్తుత ఆర్థిక సర్వే భావిస్తోంది. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం పర్యవసానాలను సరిగా గుర్తించలేదని నిరుటి ఆర్థిక సర్వేపై అప్పట్లో ఆర్థిక నిపుణులు విమర్శించారు. ఈ నేపథ్యంలో రాబోయే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7–7.5 శాతం మధ్య ఉండొచ్చునంటున్న అంచనాలు ఏమేరకు సాకారమవుతాయో వేచిచూడాలి. మొత్తానికి దేశ ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేయడానికి ఉద్దేశించిన రెండు నిర్ణయాలూ అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేదని సర్వే చూస్తే అర్థమవుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతూ పోతున్న చమురు ధరలు దేశ ఆర్థిక వ్యవస్థపై చూపబోయే ప్రభావాన్ని గురించి ఈ ఆర్థిక సర్వే పలుమార్లు ప్రస్తావించిన సంగతిని మరిచిపోకూడదు. ఒక బ్యారెల్ చమురు ధర 10 డాలర్లు పెరిగితే వృద్ధిని అది 0.2 నుంచి 0.3 శాతం వరకూ తగ్గిస్తుందని సర్వే వివరిస్తోంది. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలో చమురు ధరలు సగటున 14 శాతం పెరిగాయని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆ పెరుగుదల 10–15 శాతం వరకూ ఉండొచ్చునని అంటున్నది. ఈ సవాళ్లను సర్కారు ఎలా అధిగమిస్తుందో చూడాలి.

అయితే ఆర్థిక సర్వే వ్యవసాయ రంగానికి సంబంధించి నిరాశాజనకమైన అంచనాలే ఇస్తోంది. వాతావరణ మార్పుల పర్యవసానంగా ఆ రంగంలో వార్షిక ఆదాయం సగటున 15 నుంచి 18 శాతం వరకూ పడిపోవచ్చునని లెక్కేస్తోంది. నీటిపారుదల సౌకర్యం సక్రమంగా లేని ప్రాంతాల్లో ఇది 20 నుంచి 25 శాతం మధ్య ఉండొచ్చునని కూడా చెబుతోంది. కష్టాల సేద్యం చేస్తున్న రైతాంగానికి ఇది దుర్వార్తే. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సరిగా పండకపోవడం ఒకపక్క కనబడుతుంటే పంటలు పండిన సందర్భాల్లో సరైన గిట్టుబాటు ధరలు లభించకపోవడం మరోపక్క ఉంటుంది. ఈమధ్యకాలంలో ఉల్లిపాయలు, ఆలుగడ్డలు, టమోటాల వగైరా ధరలు భారీగా పడిపోయాయి. ఇలాంటి పరిస్థితులు రైతాంగాన్ని రుణ ఊబిలోకి నెడుతున్నాయి. విత్తనాలు మొదలుకొని ఎరువులు, పురుగుమందుల వరకూ అన్నిటి ధరలూ ఆకాశాన్నంటడంతో సాగు వ్యయం అపరిమితంగా పెరిగింది. దిగుబడుల ధరలు మాత్రం దిగజారుతున్నాయి. దిగుబడికైన వ్యయానికి 50 శాతాన్ని జోడించి గిట్టుబాటు ధరను నిర్ణయించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సును పాలకులు మరిచారు. చిత్రంగా ఆర్థిక సర్వే దాని ఊసే లేకుండా విద్యుత్, ఎరువులు సబ్సిడీలను ఎత్తేసి నగదు బదిలీ ప్రవేశపెట్టమని చెబుతోంది. బిందుసేద్యం, తుంపర సేద్యంవంటివాటికి ప్రాధాన్యం ఇవ్వాలంటున్నది. ఇవి అమలు చేస్తే 2022నాటికి సాగు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చెబుతోంది. సాగు రంగానికొచ్చేసరికి మన విధాన నిర్ణేతలు ఎప్పుడూ బోర్లాపడుతుంటారు. సర్వేలో ప్రస్తావించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఆలోచనలేమిటో, ఆర్థికరంగ జవసత్వాలకు అది తీసుకోబోయే చర్యలేమిటో మరో మూడురోజుల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ తేటతెల్లం చేస్తుంది.




సమాజ వాస్తవాన్ని ప్రతిబింబించే గణాంకాలు మాత్రమే ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటివి.

– సిమోన్ స్టర్న్ స్కీ
అమెరికన్ సంపాదకుడు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి శు.చతుర్దశి రా.10.04 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం పునర్వసు సా.6.36 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం ఉ.9.00 నుంచి 10.29 వరకు, తిరిగి రా.3.39 నుంచి 5.09 వరకు, దుర్ముహూర్తం ఉ.8.50 నుంచి 9.34 వరకు, తదుపరి రా.10.55 నుంచి 11.46 వరకు, అమృతఘడియలు సా.5.56 నుంచి 7.10 వరకు.


సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం : 5.45
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 5.34
జొహర్ : 12.29
అసర్ : 4.34
మగ్రీబ్ : 6.10
ఇషా : 7.25

మహాత్ముడిలో విప్లవం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'ప్రజాయుద్ధం' (పీపుల్స్‌వార్) నినాదాన్ని చేపట్టిన కమ్యూనిస్టులను స్వాతంత్ర్య పోరాటానికి శత్రువులుగా చిత్రిస్తూ జాతీయ కాంగ్రెస్ గాంధీజీ చెవులు కొరికింది. కమ్యూనిస్టు నాయకులపైన విష ప్రచారానికి సిద్ధమైంది. అప్పుడు గాంధీజీ 'ఇది నిజమేనా?' అంటూ ఆనాటి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పి.సి. జోషీకి లేఖ రాశారు. జోషీ అంశాల వారీగా వివరణ ఇస్తూ లేఖ రాశారు. గాంధీజీ కృతజ్ఞత తెలుపుతూ ప్రత్యుత్తరం కూడా రాశారు. ఉద్యమ నిర్వహణలో తన తప్పిదాలకు పలుమార్లు క్షమాపణ చెప్పారు.

రెండో మాట



'గాంధీజీ ఒక రాజకీయ నాయకుడే కాదు, ఒక రాజనీతిజ్ఞుడే కాదు, ఆయనొక ప్రవక్త. ప్రవక్త తన కాలంలో తరచూ విఫలమవుతూ ఉంటాడు. కానీ ఆయన వైఫల్యాల నుంచీ ఆయన త్యాగాల నుంచీ మానవాళి చిరంతనమైన విలువను సంతరించుకుంటుంది. అనితర సాధ్యమైన ఆ విలువే ప్రవక్త జీవితాన్ని ప్రకాశవంతం చేస్తుంది. అది మానవజాతికి కాలావధులు లేని విశ్వజనీన పాత్రమై సేవ చేస్తుంది.''కమ్యూనిస్టు మార్క్సిస్టు సిద్ధాంతాల వెలుగులో కూడా భారత కమ్యూనిస్టులు గాంధీజీని విశ్లేషించడంలో ఘోర తప్పిదం చేశారు.'

– 'రివల్యూషనరీ గాంధీ'(2012) గ్రంథంలో పన్నాలాల్‌దాస్ గుప్తా (1948 వరకు అవిభక్త భారత రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి)

'ప్రపంచ ప్రజలు ముందడుగు వేస్తున్న కొద్దీ, భూప్రపంచం శాంతి కోసం తపన పడుతున్న కొద్దీ, ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణం వెల్లివిరుస్తున్న కొద్దీ గాంధీజీ వాణి ఎప్పటి కన్నా ఎక్కువగా, విస్పష్టంగా ధ్వనిస్తుంటుంది. ఆయన భావాలపైన ఎలాంటి పేరు, ఇంటి చిరునామా తెలిపే చీటీ అంటించనక్కర్లేదు– ఒక్క మానవతావాదమనే సువిశాల ముద్ర తప్ప!'

– 'గాంధీజీ' (పే.209) గ్రంథంలో ప్రొ. హిరేన్ ముఖర్జీ (సుప్రసిద్ధ కమ్యూనిస్టు నేత. ఎంపీ. చరిత్రకారుడు.)

జాతిపిత గాంధీజీని మతోన్మాద హిందుత్వ శక్తి నాథూరామ్ గాడ్సే హత్య చేసిన రోజు ఇదే (జనవరి 30, 1948). విభిన్న జాతులు, మతాలు, భాషా మైనారిటీలు, భిన్న తెగలు, దళిత బహుజనుల సమాహారంగా ఉన్న భారతావనిని స్వేచ్ఛ కోసం ఒక్క తాటిపై నడిపించినవారు గాంధీజీ. అలాంటి గాంధీజీని ఏ మిషతో గాడ్సే, అతడి 'హిందూరాష్ట్ర'వాదులు కొందరు హత్య చేశారో కొంత ఆలస్యంగానే వెలుగులోకి వచ్చింది. 'గాంధీని నేనెందుకు హత్య చేశాను?' పేరుతో గాడ్సే కోర్టు వాంగ్మూలం పుస్తకరూపంలో వెలువడింది. గాంధీ హత్య కేసును విచారించిన ప్రత్యేక కోర్టులో గాడ్సే ఇచ్చిన వాంగ్మూలమది. మొదట దీనిని నిషేధించారు. 1968లో బొంబాయి హైకోర్టు ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. 2014 తరువాత బీజేపీ–పరివార్ ప్రభుత్వం ఆవిర్భవించిన తరువాత ఇది మరోసారి వెలువరించారు. గాంధీజీని హత్య చేయడానికి 'హిందూరాష్ట్ర'కు దొరికిన కారణాన్ని అందులో (పేజీ: 45) ప్రకటించారు: దేశ విభజన తరువాత పాకిస్తాన్‌కు రూ. 55 కోట్లు పరిహారం ఇవ్వాలని ఇండియాను ఒత్తిడి చేస్తూ గాంధీ నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించుకున్నారన్న వార్త అన్ని దేశ భాషా వార్తా మాధ్యమాలలో ప్రసారమవుతున్న ఘడియలవి. ఆ సమయంలో నాథూరామ్ వినాయక్ గాడ్సే, నారాయణ ఆప్టే (మరాఠీ దిన పత్రిక 'హిందూ'రాష్ట్ర పత్రిక సంపాదక, మేనేజర్లు) తమ కార్యాలయంలో కూర్చుని టెలిప్రింటర్ మీద వస్తున్న ఆ వార్తను చదువుతు 'గాంధీని చంపేయాలని ఆకస్మికంగా నిర్ణయించుకున్నారు'. అంటే అప్పటి నుంచి నేటిదాకా ఈ పరివార్ కూట రాజకీయాలకు ఉప్పు అందిస్తున్నది ఈ మత విద్వేషమేననీ ఇది దేశానికి నిరంతర చెరుపు అనీ స్పష్టం చేయడానికే ఇది చెప్పడం.

రివల్యూషనరీ గాంధీ

దేశ విభజనతో శాశ్వత కల్లోలానికి అంకురార్పణ చేసిన కాంగ్రెస్ నాయకత్వాన్ని సహితం ఎదిరించి పరువు నిలిపిన వారు గాంధీ. ఎన్ని రకాల ఆటుపోట్లను ఎదుర్కొని ఆయన తుది శ్వాస వరకు జాతీయోద్యమాన్ని సాగించారో వివరించే మరో గ్రంథం 'రివల్యూషనరీ గాంధీ'. పన్నాలాల్‌దాస్ గుప్తా ఈ చారిత్రక గ్రంథాన్ని రచించారు. అవిభక్త బెంగాల్ రివల్యూషనరీ భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా 1948 వరకు ఆయన పనిచేశారు. తరువాత పార్టీ నుంచి విడిపోయారు. జాతీయోద్యమ సమయంలో ఆవిర్భవించిన పార్టీలు ఎన్నో! ఎందరో ఉద్యమకారులు పనిచేశారు. అలాంటి దశలో అనుసరించవలసిన వ్యూహాలు, ఎత్తుగడల విషయంలో వ్యత్యాసాలు, వైరుధ్యాలు సహజం. అనేక దేశాల జాతీయోద్యమాలను ఇలాంటి పరిణామాలే ప్రభావితం చేశాయి.

అంతా పన్నాబాబు అని ప్రేమగా పిలుచుకునే పన్నాలాల్‌దాస్ గుప్తా వేలు విడిచిన విప్లవకారునిగా, మార్క్సిస్టు మేధావిగా గాంధీజీ (విప్లవ గాంధీ)కి అర్పించిన అక్షర నివాళే ఆ రచన. ఉద్యమ అనుభవాలు ఇచ్చిన పూర్వరంగంతో చేసిన చారిత్రక విశ్లేషణ. అహింసా మార్గంలో స్వాతంత్ర్యం సాధించాలన్న గాంధీజీ పంథాను శంకించే వ్యాఖ్యను పన్నాబాబు ఆమోదించలేదు. అలాంటి వ్యాఖ్యను ఏ సహ రాజకీయ పక్షం చేసినా ఎదుర్కొన్నారు. అదే సమయంలో భారత జాతీయ కాంగ్రెస్‌తో పాటు, కమ్యూనిస్టు పార్టీల కొన్ని నిర్ణయాలను విశ్లేషించారు. గాంధీజీ ప్రారంభించిన సత్యాగ్రహ విధానాలనూ, ఆయన తీసుకున్న ఆకస్మిక నిర్ణయాలతో ఉద్యమానికి కలిగిన దుష్ఫలితాలనూ పన్నాబాబు తర్కించారు.

భారత జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్ వగైరా సంస్థలన్నీ జాతీయోద్యమంలో తమ వంతు పాత్రను నిర్వహించినవే. కానీ ఇవన్నీ ఒకే మూసలో నుంచి వచ్చినవి కావు. కమ్యూనిస్టులు, సోషలిస్టులే కాదు, కొందరు వ్యక్తులు, ఇతర ఉద్యమకారులు కూడా పలు సందర్భాలలో గాంధీతో విభేదించినవారే. అదే సమయంలో గాంధీ దేశ విభజనను వ్యతిరేకించినప్పుడూ, కాంగ్రెస్ నాయకత్వం విభజనను భుజాన వేసుకున్నప్పుడూ సీఎస్‌పీ, కమ్యూనిస్టులు, సోషలిస్టులు గాంధీజీకి అండగా నిలిచారు. 'హింస' ప్రధాన ఆయుధం కాదనీ, హింసాయుత విప్లవమే ఆదర్శమనీ కూడా నాడు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించుకోలేదు. అహింస ద్వారానే సాతంత్ర్యం సిద్ధిస్తుందనీ నమ్మలేదు. కానీ అహింసా ప్రయోగాన్నీ తప్పుగా అంచనా వేసి, గాంధీని ధనికవర్గ ప్రతినిధిగా, బూర్జువా వర్గ ప్రతినిధిగా ప్రచారం చేయడాన్ని పన్నాలాల్ విమర్శించారు. అందుకే రజనీ పామీదత్ (బ్రిటిష్ కమ్యూనిస్టు నేతలలో ఒకరు), ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్‌ల వైఖరిని, కొంతమేరకు ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ లాంటి కమ్యూనిస్టు నాయకులు గాంధీ గురించి వేసిన అంచనాలను ఖండించారు. సత్యాగ్రహోద్యమంతో, అహింసా సిద్ధాంతం ప్రాతిపదికగా నిరక్షరాస్యులైన అసంఖ్యాకులను కనీస కార్యక్రమం ఆధారంగా మాత్రమే సమీకరించగలమే గానీ, స్వాతంత్ర్య పోరుకు ఉద్యుక్తుల్ని చేయగలంగానీ ఒక్కసారే సమూల మార్పునకూ హింసాత్మక విప్లవానికీ సన్నద్ధులను చేయలేమని గాంధీ విశ్వసించారు.

నిరక్షరాస్యుల్ని కదిలించడానికీ, వారికి బతుకుబాట చూపగల కనీస కార్యక్రమాల వైపు ఆకర్షించేందుకూ గాంధీ వ్యూహ రచన చేశారు. వాటిలో ప్రధానమైంది– '15 అంశాల'తో కూడిన తక్షణాచరణ నిర్మాణ కార్యక్రమం: అవి హిందూ–ముస్లిం ఐక్యత, హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ, ఆదివాసీల ఉద్ధరణ, మహిళోద్ధరణ, మద్యనిషేధం, ఖాదీ కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం, ప్రాథమిక మౌలిక విద్య, ప్రజారోగ్యం, హిందీ తదితర ప్రాంతీయ భాషల అభివృద్ధి, కార్మికోద్ధరణ, వయోజన విద్య, విద్యార్థి సంఘాల నిర్మాణం, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం వగైరా కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడం. అయితే కొన్ని మార్క్స్ విప్లవ సిద్ధాంతాలకూ, గాంధీ సిద్ధాంతానికి మౌలిక సూత్రీకరణల్లో పెద్ద తేడా కనిపించదని పన్నాలాల్ భావన. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో శ్రమజీవులు పరాయీకరణకు లోనవుతారని మార్క్స్–గాంధీలు ఏకీభవిస్తారు. దోపిడీని నిరసిస్తారు. దాని నిర్మూలనకు అనుసరించాల్సిన మార్గాలలోనే ఉభయుల సిద్ధాంతాలు విభేదిస్తాయి. అంతమాత్రాన నాయకత్వ స్థాయిలో ఉన్న త్యాగ పురుషులకు ఉద్దేశాలు అంటకట్టకూడదన్నదే పన్నాలాల్ ఉద్దేశం. అందుకే 'పోరాటాల ద్వారా తప్ప ప్రజా బాహుళ్యాన్ని ఉద్యమింపచేయలేమన్న వామపక్షాల నమ్మకం ఒక భ్రమ' అని పన్నాలాల్ విశ్వసించారు. కానీ రాజకీయ సంస్థలకు, వ్యవస్థలకు దేశ, సమాజ ఆర్థిక పరిస్థితులే మూలమన్న సత్యాన్ని మనం మరవరాదు. కమ్యూనిస్టులదే కాదు, ఉద్యమ గమనంలో గాంధీజీని అనుసరించి నెహ్రూతో పాటు, కాంగ్రెస్‌లోనే జిన్నా, సుభాష్ చంద్రబోస్‌ల స్వాతంత్ర్య సాధన గమ్యం వేరైంది.

మరో పోరాటం అవసరం ఉంది

పన్నాలాల్ గుర్తించినట్టు స్వాతంత్ర్యోద్యమంలో వామపక్షాలు సహనం కోల్పోతూ వచ్చాయి. సుభాష్ బోస్ పరిస్థితీ అంతే. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను వ్యతిరేకిస్తున్న శక్తులనుంచి సహాయం పొంది దేశాన్ని విముక్తి చేయాలన్న నిర్ణయానికి వచ్చాడు సుభాష్. ఆ ఊపులో బోస్ చేసిన ఘోర తప్పిదం– ఫాసిస్టు, జర్మనీ, జపనీస్‌లను కలిసి, సహాయం కోరడం (1940–42). రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్‌ను ఎదుర్కొనేందుకు అగ్రరాజ్య మిత్రమండలిలో అమెరికా, బ్రిటన్, సోషలిస్టు సోవియెట్ యూనియన్‌లు భాగస్వాములైన తరువాత భారతదేశ స్వాతంత్ర్య సమరంలో భాగస్వామి అయిన కమ్యూనిస్టు పార్టీ ఆకస్మికంగా ఈ ప్రపంచ యుద్ధ స్వభావాన్ని (సోవియెట్ రష్యా పాల్గొనడంతో) 'ప్రజాయుద్ధం'గా ప్రకటించింది. అప్పటిదాకా స్వాతంత్ర్యం కోసం అజ్ఞాతవాసంలో పోరాటాన్ని సాగిస్తున్న కమ్యూనిస్టు పార్టీపై తన స్వార్థం కోసం బ్రిటిష్ పాలకులు నిషేధాజ్ఞలు సడలించారు. ఈ సమయంలోనే 'ప్రజాయుద్ధం' (పీపుల్స్‌వార్) నినాదాన్ని చేపట్టిన కమ్యూనిస్టులను స్వాతంత్ర్య పోరాటానికి శత్రువులుగా చిత్రిస్తూ జాతీయ కాంగ్రెస్ గాంధీజీ చెవులు కొరికింది. కమ్యూనిస్టు నాయకులపైన విష ప్రచారానికి సిద్ధమైంది. అప్పుడు గాంధీజీ 'ఇది నిజమేనా?' అంటూ ఆనాటి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పి.సి. జోషీకి లేఖ రాశారు. జోషీ అంశాల వారీగా వివరణ ఇస్తూ సుదీర్ఘ లేఖ రాశారు. గాంధీజీ కృతజ్ఞత తెలుపుతూ ప్రత్యుత్తరం కూడా రాశారు. నిర్మలమైన మనస్సున్నవాడు కాబట్టి గాంధీజీ ఉద్యమ నిర్వహణలో తన తప్పిదాలకు పలుమార్లు క్షమాపణ చెప్పారు.

అన్నింటికన్నా పెద్ద ఒప్పుకోలు– 'కాంగ్రెస్ హిమాలయ పర్వతమంత తప్పులు చేసింద'న్న ప్రకటన. బహుశా అందుకే పన్నాలాల్ కూడా స్టాలిన్ మాటల్ని ఉదహరించాల్సి వచ్చింది: 'ఒక చారిత్రక పరిస్థితికి ఫలానా పంథా సరైన మార్గమనుకున్నది మరొక చారిత్రక సందర్భానికి తగిన మార్గం కాకపోవచ్చు'. బహుశా ఈ దృక్పథం నుంచే భారతీయ ప్రొఫెసర్ శ్రీమతి అనన్య వాజ్‌పేయి (కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ: 2.10.2017) నేటి గాంధీ భారతానికి జోడించిన వ్యాఖ్య వర్తిస్తుందేమో చూడండి: 'ఇండియా వలస పాలనా గుదిబండను వదిలించుకుంది. కానీ, స్వాతంత్ర్యం తర్వాత, గాంధీజీ హత్యానంతరం మరొకసారి 70 ఏళ్ల తర్వాత స్వేచ్ఛా భారతం కోసం మరొక పోరాటాన్ని చేయక తప్పదనిపిస్తోంది'!

(నేడు గాంధీజీ వర్ధంతి)

abkprasad2006@yahoo.co.in

మన నగరాలపై కుక్కకాటు

1993లో సీరియల్ బాంబు దాడుల్లో, 2008లో కసబ్ తదితరులు చేసిన ఉగ్రదాడిలో కంటే కూడా ముంబైలో కుక్క కాట్లతోనే అనేకమంది చనిపోయారు. కానీ దీనిపై పురపాలక సంస్థ ఎలాంటి యుద్ధం తలపెట్టలేదు.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

ఈ వ్యాసం రెండు రకాల శునక ప్రేమికులకు నచ్చదు. శునకాలను గారాబంగా పెంచుకునేవారు, పెంచుకున్నా వీధికుక్కలకు తిండి పెట్టేవారు. మొదటి విభాగంలో మళ్లీ రెండు రకాల వాళ్లున్నారు. పురపాలక సంస్థలనుంచి శునకాలకు లైసెన్స్ తీసుకునేవారు (వీరి సంఖ్య చాలా తక్కువ). అసలు అలాంటి ఆలోచనే చేయనివారు. ఏ పురపాలక సంస్థ అయినా సరే పెంపుడు జంతువులు లేదా వీధికుక్కలు లేక రెండింటి జనాభాను తన పరిధిలో అదుపులోకి తీసుకోగలదు అంటే నమ్మశక్యం కాదు. ఏరకంగా తీసుకున్నా సమాజంలో పెంపుడు కుక్కల కంటే వీధికుక్కల జనాభానే ఎక్కువ. పైగా వీధుల్లో కుక్కలకు తిండిపెట్టడాన్ని వ్యతిరేకించడం అనేది పెద్ద నేరం కిందే లెక్క. అలా చేస్తే జంతువులపై క్రూరత్వ నివారణ సమితి మీపై చర్య తీసుకునే అవకాశం కూడా ఉంది.

నేను శునక ప్రేమికుడిని కాదు. కానీ పెంపుడు కుక్కల యజమానులు, వీధుల్లో కుక్కలకు తిండి పెట్టే వారి హక్కులను నేను గుర్తిస్తాను. కానీ వారు కొంచెం బాధ్యతతో వ్యవహరించాలన్నది పలువురి అభిప్రాయం. మీ పెంపుడు కుక్క మీ ముఖం నాకుతూ, మీ పరుపుమీదే పడుకుంటూ ఉన్నప్పుడు మల విసర్జనకు దాన్ని బయటకు ఎందుకు తీసుకెళ్లాలి? తమ కుక్కలు వీధుల్లో మలవిసర్జన చేయడం కోసం కొంతమంది రోజువారీగా కొందరికి డబ్బులిస్తుంటారు.

వీధుల్లో కుక్కలకు తిండి పెట్టేవారు ఆ చర్యను ఎవరైనా వ్యతిరేకిస్తే మూకుమ్మడిగా వచ్చి మాట్లాడుతుంటారు. సాధారణంగా ఇలాంటివారు ఒకేచోట కుక్కలకు తిండిపెడుతుంటారు కాబట్టి వీధికుక్కల ప్రేమికులకు, ఆ వీధికుక్కలకు కూడా అక్కడే తామేదో శాశ్వత నివాసముంటున్నట్లుగా తిష్టవేయడం పరిపాటిగా అవుతోంది.



ఇలాంటి ప్రాంతాలే కుక్క కాట్లకు నెలవులుగా ఉంటాయి.

వీధుల్లో కుక్కలకు తిండిపెడుతున్నవారిని ఆ కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయిస్తుంటారా అని అడిగి చూడండి చాలు. ఏ ఒక్కరూ దీనికి నేరుగా సమాధానం ఇవ్వరు. పైగా ఎవరినైనా ఏ కుక్క అయినా కరిచిందా, దానివల్ల ఎవరైనా బాధపడ్డారా అంటూ వాదిస్తుంటారు, ఎదురుప్రశ్నలు వేస్తుంటారు. పైగా కుక్కల జనాభా వృద్ధిని నిలిపేందుకు తగు చర్యలు తీసుకోవడంలో పురపాలక సంస్థకు సహకరించే పని కూడా చేయరు.

పురపాలక సంస్థలు కుక్కలను నపుంసకంగా మార్చడంలో ఘోరంగా విఫలమవుతుండటం మరొక విషయం. కానీ శునక ప్రేమికులు కొంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంది. వీరికి రోడ్డుపైన లేక పక్కన కుక్కలు మలవిసర్జన చేయడం అభ్యంతరం అనిపించదు. కానీ ఆ పక్కనే నడిచి వెళ్లేవారికి ఇది మహా ఇబ్బంది కలిగిస్తుంటుంది. కుక్క విసర్జితాన్ని తీసివేసేందుకు ఏ ఒక్కరైనా గెరిటలాంటిది తీసుకెళతారా అని నాకు ఆశ్చర్యం వేస్తుంటుంది. మనదేశంలో మనుషులు బహిరంగ మల విసర్జన చేయకుండా నివారించడం అలవిగాని పని అని మనకు తెలుసు.

స్వచ్ఛభారత్ సర్‌చార్జి ద్వారా ప్రభుత్వ ప్రచారానికి మనం డబ్బు చెల్లిస్తున్నందున ఈ లక్ష్యం మనపై భారం వేస్తోంది కూడా. కానీ కుక్కలను, ప్రత్యేకించి వీధికుక్కలను ప్రేమించడం అనేది కొద్దిమేరకు పౌర బాధ్యతకు కూడా హామీ ఇవ్వాల్సి ఉంది. ఎందుకంటే గత రెండు దశాబ్దాలుగా ముంబైలో కుక్క కాటు వల్ల రేబిస్‌కు గురై చాలామంది చనిపోయారు. కుక్కకాటు మరణాల సంఖ్య భీతిగొలిపేదిగా ఉంది. 1993లో సీరియల్ బాంబు దాడుల్లో, 2008లో కసబ్ తదితరులు చేసిన ఉగ్రదాడిలో కంటే కూడా ముంబైలో కుక్క కాట్లతోనే అనేకమంది చనిపోయారు. కానీ దీనిపై పురపాలక సంస్థ ఎలాంటి యుద్ధం తలపెట్టలేదు. దీంతో వీధికుక్కలపై మనమే యుద్ధం చేయాల్సి వస్తోంది.

ఈ నేపథ్యంలో సోమవారం ది హిందూ పత్రికలో వచ్చిన వార్త నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. కేరళలో కుక్క కాటుకు గురి అయిన వారికి చెల్లిస్తున్న పరిహారం మితిమీరుతోందని, కొన్ని ప్రత్యేక కేసుల్లో అయితే రూ.20 లక్షల రూపాయల దాకా చెల్లించాల్సి వస్తోందని కేరళ ప్రభుత్వం సమీక్షించింది. కుక్కకాటు బాధితులకు ఉచిత వైద్య సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. మునిసిపాలిటీలే వీటిని చెల్లిస్తున్నందున వీటిపై మరింత బాధ్యత పెట్టే అవకాశం లేదని తేల్చేసింది. కానీ మనం చూడాల్సింది కుక్కకాటు చెల్లింపులు మితిమిరిపోయాయా అని కాదు. తమ బాధ్యతలను నిర్వహించడంలో విఫలమవుతున్న వారిని కఠినంగా శిక్షించాలి.

ఇది చిన్న విషయం కాదు. మన దేశంలో దాదాపు మూడు కోట్ల వీధికుక్కలున్నాయి. 20 వేలమంది ప్రతి సంవత్సరం రేబిస్‌తో మరణిస్తున్నారు. ఒక్క ముంబై నగరంలోనే, మనుషులు నడవడానికి చోటు లేదు కానీ, 1994–2015 మధ్య కాలంలో 13 లక్షల కుక్క కాట్లు నగరంలో నమోదయ్యాయి. దేశంలోని ప్రతి నగరం, పట్టణం కూడా కుక్కకాట్లకు సంబంధించి సంతోషం కలిగించని గణాంకాలను కలిగిఉంటున్నాయి. ఉదాహరణకు భివండీలో రెండవ తరగతి విద్యార్థి ధీరజ్ యాదవ్ ఉదంతం భయం గొలుపుతుంది. చెత్త నిల్వ కేంద్రంలో ఆడుకుంటున్న ధీరజ్ అనుకోకుండా కుక్కపై పడ్డాడు. తోడుగా ఉన్న తొమ్మిది ఇతర కుక్కలతోపాటు ఆ కుక్క అతడిని ఎంతగా కరిచిందంటే స్థానిక ఆసుపత్రి అతడిని పెద్దాసుపత్రికి తరలించాల్సిందిగా సిఫార్సుచేసింది. చివరకు ధీరజ్ మరణించాడు. కొన్నేళ్ల క్రితం తొమ్మిదేళ్ల షాహిద్ నసీమ్ సయ్యద్ ముఖం, చేతులు, వక్షంపై 100 కుక్కకాట్లు పడ్డాయి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

శ్రీ కంధరుడు



శ్రీ కంధరుడు అంటే శ్రీ కంఠుడు. అంటే శివుడు. శ్రీ అనే పదానికి చాలా అర్థాలున్నాయి. వాటిలో 'విషం' అనే అర్థం ఒకటి ఉంది. విషాన్ని కంఠంలో ధరించిన వాడు కనుక ఆయన శ్రీకంఠుడు, శ్రీ కంధరుడు. శివుడి నీల కంఠత్వం ఆయన తత్వానికి సంగ్రహంగా సరిగ్గా తెలియజెప్పే బహు చక్కని ప్రతీక.

ఈ నీల కంఠత్వం ఆయనకు క్షీర సాగర మథన సమయంలో హాలాహల భక్షణంవల్ల సంక్రమించిన లక్షణం. క్షీర సముద్రాన్ని మథిస్తే అమృతం లభిస్తుందన్న ఆశ, బద్ధశత్రువులైన దేవతలనూ, రాక్షసులనూ ఒక తాటిమీదికి తెచ్చింది. ఆ బృహత్కార్యానికి ఇరు పక్షాలూ తమ శక్తియుక్తులూ వనరులూ కలబోసుకుని ధారపోశారు. ఎన్నో విఘ్నాలు అధిగమిస్తూ చెమటోడ్చారు. పాపం ఇంతా చేస్తే, అమృతం మాట దేవుడెరుగు, ముందు ప్రాణాంతకమైన మహా భయంకరమైన హాలాహలం పుట్టుకొచ్చింది. కోలాహలంగా అమృతం తాగి మరణాన్ని జయించేసి, ఇక అన్ని



యుద్ధాలూ గెలిచేద్దాం, అన్ని లోకాలూ వశపరచుకుందాం గదా అనుకుంటే మొదటికే మోసం వచ్చింది. ఒక్క దెబ్బతో దేవా సుర జాతులే కాదు, చరాచర ప్రాణికోటి అంతా సర్వ నాశనం అయ్యే పరిస్థితి ఎదురైంది. మీదికి దూకుతున్న ఆ విషాగ్ని జ్వాలలు చూసి, దేవాసురులు బెంబేలెత్తిపోయారు. తమను రక్షించే దొరలతో సహా, రక్షించేవారు లేక, సదాశివుడి శరణు కోసం పరుగులు పెట్టారు.

'పరులమీద దయచూపే వారిని చూసి శ్రీహరి ప్రసన్నుడౌతాడు. ఆయన ప్రసన్నుడైతే, నాకూ ప్రసన్నత. అందువల్ల, ఈ విషాన్ని నేను భుజిస్తాను. నా ప్రజలకు శుభమగుగాక!' అంటూ హరహర మహాదేవుడు హాలాహలాన్ని అరచేతిలో ముద్ద చేసుకొని గుటుక్కున మింగాడు. సముద్ర జలం నుంచి కల్మషంలా పుట్టుకొచ్చిన ఆ విషం ఆయనమీద కూడా తన ప్రభావాన్ని చూపకుండా వదలలేదు. ఆయన గొంతును మాడ్చి, గొంతుమీద నల్లటి చుక్కని మిగిల్చింది. అయితేనేమి, అలాంటి మచ్చగూడా సాధువులకు అలంకారమే అంటుంది భాగవతం.

ఈ వృత్తాంతం తెలియజెప్పే ముఖ్యమైన నీతి పరమేశ్వరుడు కూడా పరోపకారం పరమధర్మమని భావిస్తాడనీ, ఆ ధర్మాన్ని ఆచరించటం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతాడనీ. పరుల కష్టాలనూ, వేదనలనూ తమవిగా భావించి సాయపడటం సాధువులకూ, సజ్జనులకూ సహజ లక్షణమని. పరోపకారం చేసే సందర్భంలో తనకేదయినా కొంత హాని జరిగినా అది సాధువులకు అలంకారప్రాయంగానే భాసిల్లుతుంది అనే.

– ఎం. మారుతి శాస్త్రి

సూర్య నమస్కారం–చంద్ర నమస్కారం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం అందరినీ సూర్య నమస్కారం చెయ్యమన్నారు. తాను మాత్రం అదనంగా మరో నమస్కారం చేశారు. కేవలం సూర్య నమస్కారం చేసి వదిలేస్తే ఎటూ సూర్యుడి చూపు కమలం మీదే కాబట్టి, ఆ పుణ్య ఫలమేదో కమలం ఖాతాలోకే పోవచ్చని ఆయన అనుమానమేమో మరి. అందుకనే అదనంగా ఇది. బహుశా అది చంద్ర నమస్కారం కావొచ్చు. చంద్ర కిరణాల సోయి నచ్చకపోతే కమల దళాలు నిరభ్యంతరంగా ముడుచుకుపోవచ్చు, నేనో నమస్కారం పడేస్తానంటూ ముఖ్యమంత్రి బాణం విసిరారు. తాను మిత్రధర్మం పాటిస్తుంటే, కమలం బిత్తిరి ధర్మం పాటిస్తుందట. బిత్తిరి ధర్మం అంటే మరేం లేదు.. మిత్రునిగా ఉంటూనే అవకాశం ఉన్న చోట కత్తెర వెయ్యడమని విజ్ఞుల ఉవాచ. అయినా ఎవరి ఊహలు, వ్యూహాలు వారివి. అమరావతి శంకుస్థాపనకు పిడికెడు మట్టి, చెంబెడు యమునా నీళ్లు తెస్తూ ప్రధాని చెప్పకనే చెప్పారు... మీ స్కెచ్‌కి నా స్కెచ్‌కి గీతలు కుదరడం లేదని. ఇన్నాళ్లకు, ఎన్నికల పవనాలు వీస్తున్న వేళ ఇక తప్పదు మరి. తమ మధ్యన ఉన్నది మమకారమో, కొరివికారమో తేల్చుకొనే నమస్కారాల సందర్భమిది.

– డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

ఇన్ బాక్స్

బడ్జెట్‌పై ఉద్యోగుల ఆశలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు, టీచర్లలకు ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని కనీసం 5 లక్షలకు పెంచాలి. ఉద్యోగులు మాత్రమే ప్రతి ఏడాది ఆదాయ పన్నును ప్రభుత్వాలకు కచ్చితంగా చెల్లిస్తున్నారు. అలాంటి వారికి ఇస్తున్న జీతభత్యాలపై అధికంగా పన్ను విధించడం వలన తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. నోట్లరద్దు తర్వాత దేశంలో అన్ని వస్తువుల ధరలు మధ్యతరగతి ఉద్యోగులకు అందనంత దూరంలో ఉన్నాయి. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలపై వేతన జీవులు అధిక శాతం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా ద్రవ్యోల్బణం తాకిడికి ఎక్కువగా గురయ్యేది కూడా వీరే. కనుక కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఉద్యోగ, టీచర్లకు కాస్త ఉపశమనం కలిగేలా పన్ను రాయితీలను ప్రకటించాలని కోరుతున్నాను.

– సామల సింహాచలం,
అమరావతి

ఏకకాల ఎన్నికలతే మేలు



పార్లమెంటు సెంట్రల్ హాల్‌కు వెళ్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్, ఉప రాష్ట్రపతి వెంకయ్య, లోక్‌సభ స్పీకర్ మహాజన్, ప్రధాని మోదీ

ఖజానాపై భారం తగ్గుతుంది.. అన్ని పార్టీలు దీనిపై చర్చించాలి

- ట్రిపుల్ తలాక్ చట్టం ద్వారానే ముస్లిం మహిళలకు గౌరవం
- పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని వెల్లడి
- 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు కృషి
- అంతర్జాతీయంగా భారత్‌కు గౌరవం పెరుగుతోంది
- పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ: ఖజానాపై భారాన్ని తగ్గించేందుకు దేశవ్యాప్తంగా ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరముందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభిప్రాయపడ్డారు. రోజూ ఏదోచోట ఎన్నికలు జరుగుతున్న కారణంగా దేశాభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని.. అందువల్ల ఈ విషయంపై అన్ని పార్టీలూ కలిసి చర్చించాలని ఆయన సోమవారం సూచించారు. పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి తొలిసారి ప్రసంగించిన రాష్ట్రపతి.. ఖజానాపై భారాన్ని తగ్గించేందుకు ఏకకాల ఎన్నికల నిర్వహణ అంశాన్ని ప్రస్తావించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు వివిధ పథకాలను కేంద్రం అందుబాటులోకి తెచ్చిందన్నారు. అందరికీ ఇళ్లు, నిరంతర విద్యుత్, పేదలకు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ల వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును కూడా రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర మంత్రులు, బీజేపీ చీఫ్ అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్థిక భారం.. అభివృద్ధికి ఆటంకం

తరచుగా దేశంలో ఎన్నికలు జరుగుతున్నందున ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని.. ఆర్థిక వ్యవస్థపై, దేశాభివృద్ధిపై దీని ప్రభావం ప్రతికూలంగా ఉంటోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'ఎప్పుడూ ఎన్నికలు జరగటం వల్ల ఆర్థికంగా, మానవ వనరులపై భారం పడుతోంది. దేశవ్యాప్తంగా ఎప్పుడూ ఒక చోట ఎన్నికల కారణంగా నియమావళి అమల్లో ఉండటంతో అభివృద్ధి ప్రక్రియకూ ఇది విఘాతం కలిగిస్తోంది. అందుకే జమిలి ఎన్నికల నిర్వహణపై సమగ్రమైన చర్చ జరగాలి. అన్ని రాజకీయ పక్షాలు దీనిపై ఏకాభిప్రాయానికి రావాలి. నవభారత నిర్మాణం ఒకపార్టీకో ఒక సంస్థకో సంబంధించిన అంశం కాదు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు అన్ని పార్టీలు చిత్తశుద్ధితో కలిసి పనిచేయాలి' అని రామ్‌నాథ్ కోవింద్ వెల్లడించారు.

ముస్లిం చెల్లెళ్ల ఆత్మగౌరవ సమస్య

ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిందని.. ఈ బిల్లు త్వరలోనే చట్టరూపం దాల్చుతుందని ఆశిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. 'దశాబ్దాలుగా రాజకీయ లబ్ధికోసం ముస్లిం మహిళల ఆత్మగౌరవం అంశం మరుగున పడింది. ఇలాంటి దుస్సంప్రదాయాన్ని పారద్రోలే గొప్ప అవకాశం ఇప్పుడు దేశానికి కలిగింది. ఒకవేళ ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. ముస్లిం సోదరీమణులు, కూతుళ్లకు జీవితాన్ని అందించిన వారవుతాం. గర్వంగా బతికే అవకాశాన్నిచ్చిన వాళ్లవుతాం' అని రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ప్రభుత్వం మైనారిటీలను బుజ్జగించాలని అనుకోవటం లేదని వారికి ఆర్థిక, సామాజిక, విద్యా రంగాల్లో సాధికారత కల్పించాలనే పట్టుదలతో ఉందని తెలిపారు. సీఖో ఔర్ కమావో, ఉస్తాద్, గరీబ్ నవాజ్ కౌశల్ వికాస్ యోజన, నయీ రోష్నీ వంటి పథకాల ద్వారా ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు ఇలా అన్ని వర్గాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికోసం

వెనుకబడిన వర్గాలు, పేదల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా ముందుకెళ్తోందన్నారు. వ్యవసాయోత్పత్తులకు జరుగుతున్న నష్టాన్ని నివారించటం, సరైన నిల్వ, 2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటం, యూరియా ఉత్పాదన పెంచటం వంటి వివిధ ప్రభుత్వ పథకాలనూ రాష్ట్రపతి ప్రస్తావించారు. ఈ–నామ్ వంటి ఆన్‌లైన్ వ్యవసాయ మార్కెట్‌ను ప్రోత్సహించటం, పాడిఉత్పత్తిని పెంచేలా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దేశంలోని అన్ని గ్రామాలను రోడ్లతో అనుసంధానించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తోందన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితి మందగమనంలో ఉన్నప్పటికీ భారత్ మంచి వృద్ధిరేటుతోనే ముందుకెళ్తోందన్నారు. 2016–17 తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు స్వల్పంగా తగ్గినా.. 2017–18 రెండో త్రైమాసికానికల్లా పురోగతి బాట పట్టిందన్నారు. దేశంలో ఆర్థిక సమగ్రతకోసం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రూపంలో అతిపెద్ద ఆర్థిక సంస్కరణ తీసుకొచ్చిందన్నారు. రూ. 2లక్షల కోట్లను పబ్లిక్ సెక్టార్ బ్యాంకింగ్‌లోకి ప్రవేశపెట్టడం ద్వారా వ్యవస్థ పునరుత్తేజం చేసిందన్నారు. అవినీతిపై పోరాటంలో భాగంగా 3.5 లక్షల అనుమానాస్పద కంపెనీలను రద్దుచేశామని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఆర్మీ, పారామిలటరీ బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు సమన్వయం కారణంగా జమ్మూకశ్మీర్‌లో ఆందోళనలను తగ్గాయన్నారు.

విద్యావ్యవస్థ ఆధునికీకరణ

దేశ భవిష్యత్తుకు పునాది వేసే ఉన్నత విద్యావ్యవస్థ, పాఠశాలలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం పరీక్షలను నిర్వహించేలా 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' పేరుతో ఓ స్వతంత్రవ్యవస్థను ఏర్పాటుచేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. మూడున్నరేళ్లలో 93 లక్షల ఇళ్లను కేంద్రం నిర్మించి ఇచ్చిందని ఆయన తెలిపారు. 2022కల్లా దేశంలో ప్రతి ఒక్కరికీ ఇళ్లుండాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశంలోని ప్రతి ఇంటికీ విద్యుత్, నీరు, మరుగుదొడ్డి వసతులుండాలనేదే కేంద్రం ఉద్దేశమన్నారు. ఉడాన్ పథకం ద్వారా తక్కువ ధరకే సామాన్యులకూ విమానయానాన్ని అందుబాటులోకి తీసుకొస్తోందన్నారు. కొంతకాలంగా అంతర్జాతీయంగా భారత్‌కు గొప్ప గౌరవం దక్కుతోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.



రాష్ట్రపతి ప్రసంగం సందర్భంగా పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో సభ్యులు

తొలి వరుసలో రాహుల్

పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సోమవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తొలి వరుసలో ఆశీనులయ్యారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాహుల్‌కు ఆరో వరుసలో సీటును కేటాయించడంతో బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు చేయడం తెలిసిందే.

- సెంట్రల్ హాల్‌లో రాహుల్ తన తల్లి సోనియా గాంధీ, కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున్ ఖర్గేలతో ఎక్కువసేపు మాట్లాడుతూ కనిపించారు. సోనియా కూడా తొలి వరుసలోనే, బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీ పక్కన కూర్చున్నారు. ఈ సందర్భంలో అడ్వాణీతో సోనియా మాట కలిపారు.
- విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే కూడా సోనియా గాంధీని పలకరించారు.
- సమాచార, ప్రసారాల శాఖ మంత్రి స్మృతీ ఇరానీ కేవలం అడ్వాణీని మాత్రమే పలకరించి సోనియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.
- ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీ తదితరులు కూడా తొలివరుసలో కూర్చున్నారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ రెండో వరసలో, బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి తదితరులు మూడో వరుసలో కూర్చున్నారు.
- ప్రసంగం అనంతరం తొలి వరుసలో కూర్చున్న పురుష ఎంపీలందరితోనూ కరచాలనం చేసిన రాష్ట్రపతి, మహిళా ఎంపీలకు రెండు చేతులతో నమస్కరించారు.

అఫ్గాన్‌లో మరో ఉగ్రదాడి..11 మంది మృతి

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో ఉగ్రవాదులు మరోసారి దారుణానికి తెగబడ్డారు. సోమవారం తెల్లవారుజామున ఓ సైనిక శిక్షణా కేంద్రానికి కాపలాగా ఉన్నవారిపై దాడి చేసి 11 మంది భద్రతా సిబ్బందిని పొట్టనబెట్టుకున్నారు. మరో 16 మంది గాయపడ్డారు. ఈ దాడి చేసింది తామేనని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. మొత్తం ఐదుగురు ఉగ్రవాదులు ఈ దాడిలో పాల్గొన్నారు. వారిలో ఇద్దరు ఆత్మాహుతి చేసుకోగా మరో ఇద్దరిని భద్రతా బలగాలు హతమార్చాయి. ఒక ఉగ్రవాదిని సజీవంగా పట్టుకున్నామని అఫ్గాన్ రక్షణ శాఖ అధికార ప్రతినిధి చెప్పారు.


అప్పుడప్పుడూ పడుకునే ట్వీట్లు: ట్రంప్

వాషింగ్టన్: రోజంతా బిజీ ఉండడం వల్ల కొన్నిసార్లు మంచంపై నుంచే ట్వీట్లు చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. బ్రిటిష్ న్యూస్ చానల్‌కు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇస్తూ.. తప్పుడు వార్తల యుగంలో తన విధానాల్ని సమర్థించుకునేందుకు సోషల్ మీడియా లాంటివి ఎంతో అవసరమని పేర్కొన్నారు. 'ప్రస్తుతం చాలా వార్తలు కల్పితాలు, అసత్యాలే. సోషల్ మీడియా వంటి సమాచార వ్యవస్థ లేకపోతే నా విధానాల్ని సమర్థించుకోలేను. రోజంతా నేను చాలా బిజీ. అందువల్ల కొన్నిసార్లు మంచంపై నుంచి, అల్పాహారం తింటూ, మధ్యాహ్న భోజనం చేస్తూ ట్వీట్లు చేస్తాను' అని ట్రంప్ వెల్లడించారు.

'హాల్ ఆఫ్ ఫేమ్'లో ఇద్దరు భారతీయులు



పాల్‌రాజ్



సుమితా మిత్రా

వాషింగ్టన్: అమెరికా పేటెంట్ అండ్ ట్రేడ్ మార్క్ ఆఫీస్ (యూఎస్‌పీటీఓ) ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్వెస్టర్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో భారత్‌కు చెందిన ప్రొఫెసర్ ఆరోగ్యస్వామి జోసెఫ్ పాల్‌రాజ్, సుమితా మిత్రాలకు చోటు దక్కింది. అత్యంత వేగంగా డేటాను ట్రాన్స్‌మిట్ చేయడంతో పాటు స్వీకరించేలా వైర్‌లెస్ టెక్నాలజీని రూపొందించినందుకు పాల్‌రాజ్ ఈ ఘనత సాధించారు. నానో కాంపోజిట్ డెంటల్ మెటీరియల్ అభివృద్ధికి కృషి చేసినందుకు సుమితా మిత్రాకు ఈ గౌరవం లభించింది. మే 3న వాషింగ్టన్‌లో ఈ అవార్డును పాల్‌రాజ్, సుమితాలకు అందిస్తారు.

డివిజన్ బెంచ్‌కు ఆప్ పిటిషన్

న్యూఢిల్లీ: తమపై అనర్హత వేటును రద్దు చేయాలని ఆప్ మాజీ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్‌కు ఢిల్లీ హైకోర్టు బదిలీ చేసింది. ఆ మేరకు జస్టిస్ విభు బఖ్రుతో కూడిన ఏకసభ్య ధర్మాసనం పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ముందుంచింది. కేసును విచారించేందుకు కొత్త ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలా? లేక ఇప్పటికే ఉన్న డివిజన్ బెంచ్‌కు బదిలీ చేయాలా? అన్నది మంగళవారం ప్రధాన న్యాయమూర్తి తేల్చనున్నారు. 20 మంది ఎమ్మెల్యేల అనర్హతతో ఖాళీ అయిన నియోజకవర్గాల్లో ఎన్నికల కోసం ఎలాంటి నోటిఫికేషన్లు జారీచేయవద్దని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది.

'గౌరీ హత్యను లక్ష గొంతులు ప్రశ్నించాయి'

సాక్షి, బెంగళూరు: 'ఎవరైనా మరణిస్తే శ్రద్ధాంజలి ఘటించి వదిలేస్తాం. కానీ గౌరి లంకేశ్ హత్యకు గురైతే.. ఆ దారుణాన్ని లక్ష గొంతులు ప్రశ్నించాయి' అని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. ప్రముఖ జర్నలిస్టు గౌరి లంకేశ్ 56వ జయంతి సందర్భంగా సోమవారం జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు 'గౌరి డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. 'రోహిత్ వేముల మరణం, గౌరి లంకేశ్ హత్యను నిరసిస్తూ అనేక మంది రోడ్లపైకి వచ్చారు. దేశంలో జరుగుతున్న దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తున్నారు' అని తెలిపారు. గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ, విద్యార్థి సంఘం నేత కన్హయ్య కుమార్ మాట్లాడుతూ.. లంకేశ్ హత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. కేసులో సీబీఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టును ఆశ్రయిస్తానని గౌరీ సోదరుడు ఇంద్రజిత్ వెల్లడించారు.

'తలాక్'పై రాజకీయాలొద్దు

- ఏకకాల ఎన్నికలపై చర్చ జరపండి
- ఎన్డీఏ పక్ష నేతల భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ



పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న మోదీ.

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్ బిల్లు వీలైనంత త్వరగా ఆమోదం పొందటం ద్వారా ముస్లిం మహిళలకు స్వేచ్ఛా జీవితాన్ని ఇవ్వగలుగుతామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ అంశంపై రాజకీయాలు చేయకూడదని అన్ని పక్షాలను ఆయన కోరారు. సోమవారం పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. ట్రిపుల్ తలాక్ బిల్లు ఈ సమావేశాల్లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2018 నూతన సంవత్సర కానుకగా ముస్లిం సోదరీమణులకు ఈ బిల్లును కానుకగా ఇవ్వాలన్నారు. అంతకుముందు జరిగిన ఎన్డీఏ పక్షాల భేటీలో మోదీ మాట్లాడుతూ.. ఏకకాల ఎన్నికలకు అనుకూల వాతావరణాన్ని నిర్మాణం చేయటంలో కృషిచేయాలని కోరారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా చర్చను ప్రారంభించాలని సూచించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎన్డీయే పక్షాల సభ్యుల పూర్తిస్థాయిలో హాజరవ్వాలని మోదీ కోరారు. ట్రిపుల్ తలాక్ బిల్లు, ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లులను ఆమోదింపజేసుకోవటం కీలకమన్నారు. ముఖ్యమైన అంశాలపై ఈసారి సమావేశంలో చర్చించనున్నందున హాజరు శాతం ఎక్కువగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరం, ఆసియాన్ సదస్సుల్లో మోదీ ప్రసంగాన్ని అభినందిస్తూ తీర్మానం చేశారు. కాగా సోమవారం ముగ్గురు ఆప్ ఎంపీలు, ఒక బీజేపీ సభ్యుడు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు.

రైతు ఆదాయం 25% తగ్గొచ్చు

- వాతావరణ మార్పులే కారణం
- వ్యవసాయంపై ఆర్థిక సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: వాతావరణంలో మార్పుల కారణంగా రైతుల ఆదాయం రాబోయే కొన్నేళ్లలో 20 నుంచి 25 శాతం వరకు తగ్గొచ్చని ఆర్థిక సర్వే పేర్కొంది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సాంకేతికతను ఉపయోగించడం, సమర్థవంతమైన నీటిపారుదల వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఈ ప్రతికూల పరిస్థితిని కొంతవరకు అధిగమించొచ్చంది. ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలంటే వ్యవసాయ, సర్కారీ విధానాల్లో సమూల మార్పులు అవసరమని సర్వే పేర్కొంది. వ్యవసాయదారుల రాబడిని పెంచడంతోపాటు, ఆ రంగంలో సంస్కరణలు తీసుకురావడం కోసం జీఎస్టీ మండలి తరహాలో ఓ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సర్వే సూచించింది. ఎరువులు, విద్యుత్తుపై రైతులకు ఇస్తున్న రాయితీని కూడా ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో అందజేయాలని సూచించింది. ప్రస్తుతం దేశంలో 45 శాతం పంట భూమికే సాగునీటి వసతి ఉండగా, ఈ విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందంది. మధ్యప్రదేశ్, గుజరాత్‌లు మినహా మిగతా రాష్ట్రాల్లో చెప్పుకోదగ్గ రీతిలో సాగునీటి వసతి ఉన్న భూమి అంతంత మాత్రంగానే ఉందని సర్వే పేర్కొంది. సాగునీటి వసతిని మెరుగుపరిచేందుకు అధిక నిధులను కేటాయించాలని ఆర్థిక సర్వే సిఫారసు చేసింది. రైతులు నష్టపోకుండా ఉండేందుకు మరింత ప్రభావ వంతమైన, సమర్థవంతమైన పంట బీమా సదుపాయాలను తీసుకురావాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే గుర్తుచేసింది. రైతులు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా, అనుబంధ రంగాలైన పాడి, మత్స్య పరిశ్రమలవైపు కూడా వెళ్లేలా వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరింత ఆకర్షవంతమైన విధానాలు రూపొందించాలంది. వ్యవసాయ రంగంలో ఇప్పటికే స్త్రీలు కీలక భూమిక పోషిస్తున్నప్పటికీ వారి పాత్ర మరింత పెరగాలనీ, మహిళా రైతులకు రుణాలు, భూమి, విత్తనాలు సులభంగా లభించేలా విధానాలు ఉండాలని ఆర్థిక సర్వే పేర్కొంది.

36 మంది జలసమాధి

- కాలువలో పడిన ఆర్టీసీ బస్సు
- పశ్చిమ బెంగాల్‌లో ఘోర దుర్ఘటన



బస్సును క్రేన్ల సాయంతో పైకి లాగుతున్న దృశ్యం

బహరాంపూర్: పశ్చిమ బెంగాల్‌లో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సు వంతెన పై నుంచి కాలువలోకి పడిపోవడంతో పది మంది మహిళలు సహా మొత్తం 36 మంది దుర్మరణం చెందారు. బస్సు నదియా జిల్లాలోని శికార్‌పూర్ నుంచి మాల్దాకు వెళ్తుండగా ముర్షీదాబాద్ జిల్లాలోని దౌల్తాబాద్ పరిధిలో ఆరు గంటలకు ప్రమాదం జరిగింది. సహాయక చర్యలు అందించేందుకు పోలీసులు ఆలస్యంగా వచ్చారంటూ స్థానికులు నిరసన చేపట్టి, ఓ పోలీస్ వాహనానికి నిప్పంటించారు. ఆ మంటలను ఆర్పడానికి వచ్చిన అగ్నిమాపక యంత్రంపైనా వారు దాడి చేశారు. కాలువలోని బస్సును గుర్తించి క్రేన్ల సాయంతో బయటకు తీయడానికి ఎనిమిది గంటలు పట్టిందని అధికారులు చెప్పారు. 32 మృతదేహాలను సిబ్బంది వెలికితీయగా, మరో రెండు నీటిలో కొట్టుకుపోయాయి. ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. సీఎం మమతా బెనర్జీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పొగమంచు లేదా డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే దుర్ఘటన జరిగి ఉండొచ్చని ఆమె అన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ. 1 లక్ష, స్వల్ప గాయాలైన వారికి రూ. 50 వేల నష్టపరిహారాన్ని ఆమె ప్రకటించారు.

రేపు ఖగోళ వింత!

ఒకేసారి సూపర్, బ్లూ, బ్లడ్‌మూన్‌లు



న్యూఢిల్లీ: ఆకాశంలో రేపు అత్యంత అరుదైన ఖగోళ అద్భుతం చోటుచేసుకోనుంది. ఈ నెల 31న సూపర్‌మూన్‌గా మారే చంద్రుడు బ్లూమూన్, బ్లడ్‌మూన్‌గానూ దర్శనమివ్వనున్నాడు. దాదాపు 150 ఏళ్ల తర్వాత ఈ అద్భుతం జరగనుందనీ, మరో పదేళ్ల తర్వాత కానీ ఇలాంటి అవకాశం రాదని శాస్త్రవేత్తలు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు ఈ ఖగోళ వింతను కెమెరాల్లో బంధించడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా చంద్రుడు భూమికి అత్యంత దగ్గరగా వచ్చినప్పుడు 14 శాతం పెద్దగా, 30 శాతం ప్రకాశవంతంగా కన్పిస్తాడు. దీన్నే సూపర్‌మూన్‌గా వ్యవహరిస్తారు. ఓ నెలలో రెండో పౌర్ణమి రోజున చంద్రుడు భూమికి దగ్గరగా వస్తే దాన్ని బ్లూమూన్‌గా పిలుస్తారు. ఇక చంద్రగ్రహణం సమయంలో చంద్రుడు భూమి నీడలోకి చేరినప్పుడు.. భూమి వాతావరణంలోకి వచ్చిన సూర్యకాంతి పరావర్తనం చెంది చంద్రుడిపైకి ప్రసరిస్తుంది. ఎక్కువ తరంగదైర్ఘ్యమున్న ఎరుపు రంగు కిరణాలు చంద్రుడ్ని చేరడంతో చందమామ రుధిర వర్ణంలో ప్రకాశిస్తాడు. దీన్నే బ్లడ్‌మూన్‌గా వ్యవహరిస్తారు. 1866 తర్వాత ఈ మూడు ఖగోళ అద్భుతాలు ఒకేసారి సంభవించడం ఇదే తొలిసారి. భారత్‌లో బుధవారం సాయంత్రం 4.21 గంటల సమయంలో పాక్షికంగా చంద్ర గ్రహణం మొదలు కానుంది. సాయంత్రం 6.21 గంటల నుంచి 7.37 గంటల వరకూ బ్లూ, బ్లడ్‌మూన్ చూడొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ గ్రహణం 76 నిమిషాల పాటు కొనసాగనుంది.

రథమెక్కిన పెళ్లి కూతురు..!



జైపూర్: సాధారణంగా వివాహాల్లో పెళ్లి కొడుకు గుర్రం లేదా గుర్రపు బగ్గీపై ఊరేగుతాడు. అందుకు పూర్తి విరుద్ధంగా రాజస్తాన్‌లోని ఝుంఝునూ జిల్లా చిరావా పట్టణంలో పెళ్లి 'బారాత్' (ఊరేగింపు)ను తలపాగాతో గుర్రపు బండిపై కూర్చున్న పెళ్లికూతురు ముందుకు నడిపింది. అమ్మాయిలు అబ్బాయిల కంటే ఎందులోనూ తక్కువకాదని తెలిపేందుకే ఈ బారాత్‌ను సాధనంగా ఎంచుకున్నట్లు పెళ్లి కుమార్తె గార్గీ తెలిపారు. ఈ యాత్రలో భాగంగా జైపూర్ చుట్టుపక్కలా 150 కి.మీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించినట్లు ఆమె వెల్లడించారు.

'ముందస్తు'పైనే చర్చ!

మోదీని ఎదుర్కొనేందుకు విపక్షాల ఏకీకరణ

- వందరోజుల్లో సార్వత్రిక ఎన్నికలంటూ వదంతులు
- శరద్ పవార్ నివాసంలో కాంగ్రెస్ నేతల భేటీ
- సోనియా నేతృత్వంలో మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయం





సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: పార్లమెంటుకు ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తున్నారంటూ జరుగుతున్న చర్చ ఒక్కసారిగా రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. దేశవ్యాప్తంగా రాజకీయ వాతావరణంపై చర్చించటంతోపాటుగా అన్ని విపక్షపార్టీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రతిపక్ష పార్టీలు తమ ప్రయత్నాలను ప్రారంభించాయి. ఇందుకోసం వచ్చేవారం 18 విపక్ష పార్టీలతో సమావేశం కావాలని కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ నిర్ణయించారు. దీంట్లో భాగంగా కేంద్ర మాజీ మంత్రి, ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ ఢిల్లీ నివాసంలో సోమవారం సాయంత్రం విపక్ష పార్టీల భేటీ జరిగింది.

రాష్ట్రపతి ప్రసంగం తర్వాత..

పార్లమెంటు సెంట్రల్ హాల్లో సోమవారం నాటి రాష్ట్రపతి ప్రసంగం తర్వాత సోనియా గాంధీతో శరద్ పవార్ ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం సీపీఐ నేత డి. రాజా కూడా వీరితో కలసి మాట్లాడారు. దీంట్లో విపక్షాలను ఏకం చేసే పనిని శరద్ పవార్ ప్రారంభించాలని నిర్ణయించారు. దీంట్లో భాగంగానే కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాంనబీ ఆజాద్, ఆనంద్ శర్మలతో సహా పలువురు విపక్ష నేతలు సాయంత్రం పవార్ నివాసంలో సమావేశమయ్యారు. వచ్చేవారం సోనియా నేతృత్వంలో విపక్షపార్టీల భేటీ నిర్వహించనున్నారు. 2004 ఎన్నికలకు ముందు బీజేపీయేతర పక్షాలను ఏకం చేసి యూపీఏను ఏర్పాటుచేయటంలో సోనియా క్రియాశీలకంగా వ్యవహరించారు. పదేళ్లపాటు ఈ సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని నడిపేలా అందరినీ ఒకతాటిపై నిలబెట్టిన సంగతి తెలిసిందే.

బీజేపీ అసంతృప్త నేతల భేటీ

గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు, రైతుల అసంతృప్తి వంటి అంశాలపై చర్చించేందుకు వివిధ వర్గాలు, నిపుణులతో ఏర్పాటైన 'రాష్ట్రీయ మంచ్' మంగళవారం ఢిల్లీలో భేటీ కానుంది. బీజేపీ అసంతృప్త నేతలైన యశ్వంత్‌సిన్హా, శతృఘ్న సిన్హా సహా పలువురు తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలపై మోదీ దృష్టిపెట్టలేదని.. మూడున్నరేళ్లలో గ్రామాలు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయనే అంశాలను ఈ భేటీలో చర్చించనున్నారని సమాచారం. ఇటీవలి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ.. కాంగ్రెస్‌తో కాకుండా ఒంటరిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఇది కొంతమేర కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మోదీ వ్యూహమేంటో?

అయితే ప్రధాని మోదీ ఎలా ముందుకెళ్తారనే అంశంపై ఎలాంటి స్పష్టత లేనప్పటికీ.. ఏకకాల ఎన్నికలను ముందస్తుగా నిర్వహించాలని ఆయన భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ముందస్తు ఎన్నికలకు వెళ్లటం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తపడాలని, విపక్షపార్టీలన్నీ ఏకమయ్యేందుకు అవసరమైన సమయం ఇవ్వకూడదనేది మోదీ వ్యూహంగా భావిస్తున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. వచ్చే 100 రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు మోదీ ఆలోచిస్తున్నారని.. ఇందుకోసం ఎన్నికల ప్రచార నిర్వహణ బృందంతో చర్చిస్తున్నారనే వార్తలూ వినబడుతున్నాయి. ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగం కూడా ఇన్నాళ్లూ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను చెప్పటంతోపాటు ఎన్నికల మేనిఫెస్టోలాగా ఉందని విశ్లేషకులంటున్నారు. ఇద్దరు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులను ఈ అంశంపై సాక్షి ప్రతినిధి సంప్రదించగా.. ఒకరు 'ముందస్తు'పై స్పందించేందుకు నిరాకరించారు. మరొకరు 'కొట్టిపారేయలే'మని.. రాజకీయాల్లో ఒక వారం కూడా కీలకం అని తెలిపారు.

ప్రజాసంకల్ప యాత్ర

0 పులివెందుల నియోజకవర్గం ఇడుపులపాయ
100 ఆళ్లగడ్డ నియోజకవర్గం చాగలమర్రి సమీపం
200 డోన్ నియోజకవర్గం ముద్దవరం
300 ఎమ్మిగనూరు నియోజకవర్గం కారుమంచి
400 శింగనమల నియోజకవర్గం గుమ్మేపల్లి
500 ధర్మవరం నియోజకవర్గం గొట్లూరు
600 కదిరి నియోజకవర్గం కటారుపల్లి క్రాస్ రోడ్స్
700 పీలేరు నియోజకవర్గం చింతపర్తి శివారు
800 గంగాధర నెల్లూరు నియోజకవర్గం నల్లవెంగనపల్లి
900 శ్రీకాళహస్తి నియోజకవర్గం చెర్లోపల్లి హరిజనవాడ





1000 కిలో మీటర్లు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం

సైదాపురంలోని పైలాన్ వద్దకు తరలివచ్చిన అశేష ప్రజానీకం





సైదాపురం సమీపంలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

ఇది మా అదృష్టం..

జన నేత పాదయాత్ర వెయ్యి కిలోమీటర్ల మైలు రాయి తమ గ్రామం వద్ద ఉండటం.. అక్కడ జగన్ విజయ సంకల్ప స్థూపాన్ని ఆవిష్కరించడంతో సైదాపురం ప్రజల్లో నూతనోత్సాహం కనిపించింది. 'ఇది మా గ్రామం చేసుకున్న అదృష్టం. మా గ్రామం జననేతకు గుర్తుండిపోతుంది. భవిష్యత్తులో మా గ్రామ సమస్యలు తీరుతాయని నమ్ముతున్నాం' అని బీటెక్ విద్యార్థి శ్రీనివాసులు అన్నాడు. 'గర్వంగా ఉందన్నా...' అని ఆ గ్రామ గృహిణి మాలతి చెప్పింది. ఆ గ్రామ సర్పంచి బండి వెంకట్‌రెడ్డిలో పట్టరాని ఆనందం కన్పించింది. 'నా జీవితంలో మరిచిపోలేను' అంటూ ఆయన వ్యాఖ్యానించాడు. 'అన్న అధికారంలోకి వస్తాడు.. మా అందరికీ మంచి జరుగుతుంది' అని ఊరు ఊరంతా అంది. పైలాన్ ఆవిష్కరణ తర్వాత జగన్ సైదాపురం దాటే వరకూ ఆ ఊళ్లోని చిన్నా పెద్ద.. అంతా ఆయన అడుగులో అడుగులేశారు. పూలబాట పరచి అడుగడుగునా హారతి పట్టారు.

జననేత వెయ్యి కిలోమీటర్ల దిగ్విజయ యాత్రను పురస్కరించుకుని సైదాపురం ఆయన అభిమానులతో కిక్కిరిసిపోయింది. ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.. కిలోమీటర్ల కొద్దీ వందలాది వాహనాలు బారులు తీరాయి.. వేలాది మంది క్యూ కట్టారు.. జనం ఈలలు, కేకలు, కరతాళధ్వనుల నడుమ జగన్ ఫైలాన్‌ను ఆవిష్కరించారు.. ఆ ప్రాంతమంతా బాణాసంచా పేలుళ్లతో మార్మోగింది.. జగన్ నినాదాలు మిన్నుముట్టాయి.. దుర్మార్గపు సర్కారును సాగనంపే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని విజయ సంకల్ప స్థూపం సాక్షిగా జనం ప్రతినబూనారు.. నవరత్నాలతోనే తమ బతుకుల్లో వెలుగు వస్తుందని ఆకాంక్షించారు.



సైదాపురం వద్ద విజయ సంకల్ప స్థూపాన్ని రిమోట్‌తో ఆవిష్కరించి ముందుకు సాగుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్, చిత్రంలో ఎంపీలు మేకపాటి, వరప్రసాద్, పార్టీ నేతలు

దుర్మార్గపు సర్కారుపై శంఖారావం

- వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని అధిగమించిన ప్రజాసంకల్ప యాత్ర
- విజయ సంకల్ప స్థూపం ఆవిష్కరించిన జననేత జగన్
- తండోపతండాలుగా తరలి వచ్చిన జనం
- హర్షధ్వానాలు.. ఆనందోత్సాహాలు
- ప్రతిధ్వనించిన జగన్నినాదం
- మా మద్దతు మీకేనంటూ కలిసి నడిచిన అభిమానులు

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: జన ప్రవాహంతో సైదాపురం జాతరలా మారింది.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై సమరభేరీ మోగిస్తూ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న ప్రజా సంకల్ప యాత్ర 74వ రోజు సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం వద్ద వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని దాటింది. ఈ అరుదైన ఘట్టం చిరకాలం గుర్తుండేలా అభిమానులు అక్కడ ఏర్పాటు చేసిన విజయ సంకల్ప స్థూపాన్ని జగన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఉదయం నుంచే వాళ్లంతా జననేత అడుగులో అడుగులేశారు. పైలాన్ ఆవిష్కరణ సందర్భంగా జనంలో పట్టరాని ఆనందం కన్పించింది. వెయ్యి కిలోమీటర్ల దిగ్విజయ యాత్రను పురస్కరించుకుని అభిమానులు వెయ్యి కొబ్బరికాయలు కొట్టారు. విజయ సంకల్ప స్థూపావిష్కరణను చూసేందుకు జనం పోటీ పడ్డారు. చెట్లెక్కిన వాళ్లు.. ట్రాక్టర్లు, లారీలపై నుంచి చూసే వాళ్లతో ఆ ప్రాంతం అంతా ఇసుక వేస్తే రాలనంతగా మారిపోయింది. కొంత మంది సెల్ ఫోన్‌లో లైవ్ చానల్‌ను ఆన్ చేసుకుని కార్యక్రమాన్ని తిలకించారు. ఒక్క ఫోన్ అలా కనెక్టయి ఉంటే అక్కడ పదుల సంఖ్యలో జనం గుమిగూడారు. 'కార్యక్రమం ఎలా జరుగుతోంది? జగన్ స్థూపం దగ్గరకు వచ్చాడా?' అంటూ కింద ఉన్న వాళ్లు ట్రాక్టర్లు, లారీలపై నుంచి చూస్తున్న వారిని ఆతృతగా అడగడం కనిపించింది. స్థూపావిష్కరణ అనంతరం అశేష ప్రజానీకానికి జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ప్రజలు స్థూపాన్ని సందర్శించి జగన్ వెంట నడిచారు.

వెయ్యి కిలోమీటర్లు.. వేల సమస్యలు

ఇడుపులపాయ నుంచి గత ఏడాది నవంబర్ 6న ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించిన వైఎస్ జగన్.. వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలో పాదయాత్ర పూర్తి చేసి, ప్రస్తుతం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ముందుకు సాగుతున్నారు. ప్రతీ వంద కిలోమీటర్లకు గుర్తుగా ఓ మొక్కను నాటారు. ఈ వెయ్యి కిలోమీటర్ల ప్రయాణంలో జననేతను వేలాది మంది కలిశారు. వీళ్లలో అభాగ్యులు, అన్నార్తులు, విధివంచితులున్నారు. ప్రభుత్వ వైఖరితో విసిగి వేసారిపోయిన వాళ్లూ జగన్‌కు తమ గోడు చెప్పుకున్నారు. బడుగు బలహీన వర్గాలు, ముస్లిం మైనార్టీలు.. ఆర్థికంగా చితికిపోయిన వాళ్లు, ఉద్యోగులూ.. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వర్గాల వారూ అభిమాన నేత ముందు బాధలు చెప్పుకున్నారు. అందరి కష్టాలను ఓపికగా వింటూ.. ధైర్యం చెబుతూ మంచి రోజులొస్తాయనే భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.



పాదయాత్ర వెయ్యి కిలో మీటర్లు అధిగమించిన సందర్భంగా సైదాపురం వద్ద వెయ్యి కొబ్బరి కాయలు కొడుతున్న అభిమానులు

74వ రోజు

29-01-2018, సోమవారం
సైదాపురం,
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా



నేనెంతో ప్రేమించే ప్రజలు తోడుగా నడుస్తుంటే దూరమైనా, కాలమైనా బలాదూరే

ఇడుపులపాయలో మొదలైన ప్రజా సంకల్ప యాత్ర ఈ రోజు వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని దాటింది. వెయ్యి కిలోమీటర్లు నడిచినా.. నడిచినట్లే లేదు. ఇష్టమైన వారు తోడుంటే కాలమూ తెలియదు, కష్టమూ తెలియదు. నన్నెంతో అభిమానించేవారు, నేనెంతో ప్రేమించే ప్రజలు తోడుగా నడుస్తుంటే.. దూరమైనా, కాలమైనా బలాదూరే. ఇప్పటి వరకూ నేను వేసిన ప్రతి అడుగులో జనాభిమానం వెన్నంటే ఉంది. ప్రజల ప్రేమ, ఆప్యాయతలనే కాదు.. పేద జనం కష్టాలు, కన్నీళ్లను మరింత దగ్గరగా చూశాను. బడుగు బలహీనులు గుండె గొంతుకలు విప్పారు. చిన్నారుల చిరునవ్వులు, అవ్వాతాతల దీవెనలు, అక్కచెల్లెమ్మల ఆప్యాయతలు, అన్నాతమ్ముళ్ల అభిమానం.. ఇవన్నీ నాలో బాధ్యతను మరింత పెంచాయి. అడుగడుగునా జనం నాన్నగారి పాలనను కోరుకుంటున్నారు.

ఈ రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలని, రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని.. హైదరాబాద్‌లో చేపట్టిన యాగం ఇప్పటికీ కొనసాగుతోంది. పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు దాటుతున్న నేపథ్యంలో వేద పండితులు యాగ ప్రసాదాలు తీసుకొచ్చి ఆశీర్వదించారు. కష్టాల కడలిలో ఉన్న జనానికి మంచి జరిగేలా ఈ రాష్ట్ర పగ్గాలు చేపట్టాలని దీవించారు. ఈ వెయ్యి కిలోమీటర్ల ప్రయాణంలో ప్రతి అడుగులో జనం కడగండ్లు చూశాక నాలో పట్టుదల ఇంకా పెరిగింది. జనం కోసమే కదలాలని.. జనం కోసమే బతకాలని.. జనం గుండెల్లో నిలవాలన్న స్ఫూర్తితోనే నా యాత్ర సాగుతోంది.

తల్లిదండ్రుల పేదరికం ఓ చిట్టితల్లి జీవితానికి శాపమైన దీనగాథ నా గుండెను బరువెక్కించింది. చెన్నూరు హరిజనవాడకు చెందిన సునీతకు 12 ఏళ్ల వయసులోనే 45 సంవత్సరాల వ్యక్తితో రెండో వివాహం చేశారట. అప్పటికే అతనికి అనారోగ్యం కారణంగా ఓ కాలు తీసేశారట. పెళ్లయిన మూడేళ్లకే ఆయన పక్షవాతంతో మంచానపడి ఈ మధ్యనే మరణించాడట. ఆమె కొడుక్కి పుట్టుకతోనే అంగవైకల్యం. ఆ కాళ్లకు ఆపరేషన్ చేయించిందట. ఆ బాబు కోసమే బతుకు వెళ్లదీస్తోందట. బాల్య వివాహంతో బతుకు శాపమై, 22 ఏళ్లకే కొన్ని జన్మల కష్టాన్ని అనుభవించిన ఆ చిట్టి చెల్లిని చూసి మనసు కలత చెందింది.

విజయలక్ష్మి అనే సోదరిది మరో కష్టాల కథ. ఆడపిల్ల పుట్టిందని ఆమె భర్త వదిలేసి పోయాడట. అన్నీ తానై ఆ బిడ్డను పెంచుతోందట. బాగా చదివించాలని కోరికట. తల్లిగా, చెల్లిగా, భార్యగా మన జీవితాల్లో వెలుగులు నింపే ఆడబిడ్డపై ఎందుకీ వివక్ష? ఆ తండ్రిది ఎంత దుర్మార్గం? సమాజంలో ఇలాంటివి ఇంకా జరుగుతుండటం సిగ్గుచేటైన విషయం. ఈ రెండు ఘటనలు చూశాక మనం ఏ యుగంలో ఉన్నామా.. అని అనిపించింది.

వెయ్యి కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా సైదాపురంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప స్థూపాన్ని అశేష జనసంద్రం మధ్య నాతో ఆవిష్కరింపజేశారు. ఆ సందర్భంగా అమ్మ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. 'ఎన్ని కిలోమీటర్లు నడిచామనేది పెద్ద ప్రాతిపదిక కాదు. ఎన్ని లక్షల మందిని కలిశాం.. ఎంతమందికి విశ్వాసం కలిగించాం.. ఎంతమందికి ధైర్యం కల్గించగలుగుతున్నామనే అంశాలనే ప్రాతిపదికగా తీసుకోవాలి..'

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. రోజూ ఎంతోమంది పేదలు ఆరోగ్యశ్రీ గురించి ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. ఎన్నో రకాల జబ్బులు ఆరోగ్యశ్రీ పరిధిలో లేవు. ఉన్నవాటిలో చాలావాటి చికిత్సకు మన రాష్ట్రంలో వసతులు, సౌకర్యాలు లేవు. పోనీ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి పొరుగు రాష్ట్రాల్లో చేయించుకుందామంటే.. అక్కడ మన ఆరోగ్యశ్రీ వర్తించదు. మరి జబ్బునపడ్డ పేదవాడి పరిస్థితేంటి? వారి ప్రాణాలు గాలిలో దీపాలేనా?

వైఎస్. జగన్.

ప్రజాసంకల్ప యాత్ర 74వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1005 కి.మీ

74వ రోజు నడిచిన దూరం
12.5 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8 గంటలకు గూడూరు కోర్టు సెంటర్

ముగింపు: సా. 5 గంటలకు వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం

ముఖ్యాంశాలు

- గూడూరు నియోజకవర్గ పరిధిలోని గోగినేనిపురం, చెన్నూరు, వెంకటగిరి క్రాస్ రోడ్డు, వెంకటగిరి నియోజకవర్గం పరిధిలోని సైదాపురం మండలం తూర్పుపూండ్ల క్రాస్, సైదాపురంలో ప్రజలతో మమేకం.
- 1,000 కిలోమీటర్ల మైలు రాయిని అధిగమించిన పాదయాత్ర
- సైదాపురంలో 25 అడుగుల విజయ సంకల్ప స్థూపం ఆవిష్కరణ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు సైదాపురం

ముఖ్యాంశాలు

- సైదాపురం, సిద్దలయ్యకోన, పోకందుల క్రాస్, ఊటుకూరు, గిద్దలూరు క్రాస్, తురిమెర్లలో ప్రజలతో మమేకం
- కలిచేడులో చేనేతల ఆత్మీయ సమ్మేళనం

బాబు మోసాలను ఎండగట్టండి..

మహిళా లోకానికి జననేత పిలుపు

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'ముఖ్యమంత్రి చంద్రబాబుతో యుద్ధం చేస్తున్నాం. ఆయన ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేరిందా? ఆయన మోసాలను ఎండగట్టండి' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళాలోకానికి పిలుపునిచ్చారు. చెన్నూరు శివార్లలోని కట్టాలమ్మ అమ్మవారిగుడి వద్ద సోమవారం తనకు ఘన స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలతో ఆయన సంభాషణ వారికి అర్థమయ్యే రీతిలో ఇలా సాగింది..

- **జగన్:** ఏమ్మా.. అందరూ బాగున్నారా? నాకు స్వాగతం పలికేందుకు వచ్చిన మీ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

మహిళలు: బాగున్నామన్నా..

- **జగన్:** మీ అందరి ఆశీస్సులతో, దేవుని దయ వల్ల రేపు మనందరి ప్రభుత్వం వచ్చాక మనం ఏమి చేయబోతున్నామో చెప్పండి?

మహిళలు: పిల్లలను బాగా చదివిస్తానన్నారు.. ఖర్చు ఎంతైనా భరిస్తామన్నారు..

- **జగన్:** బాగా చెప్పారు. ఇంకా తెలియని వాళ్లకు కూడా తెలియాలి కాబట్టి మళ్లీ చెబుతున్నా.. రేపు మనందరి ప్రభుత్వం వచ్చాక మన చిట్టిపిల్లల్ని బడికి పంపిస్తే.. తల్లికి ఏటా 15 వేలు ఇస్తాం. బాగా వినండి.. ఏంటికో తెలుసా? ఈ పిల్లలు రేపొద్దున డాక్టర్లు, ఇంజినీర్లు అయినప్పుడే మన బతుకులు మారతాయి. కాబట్టి కచ్చితంగా మన పిల్లల్ని బడికి పంపించమని అన్న చెప్పాడని అందరికీ చెప్పండి..

మహిళలు: సరేన్నా, సరే..

- **జగన్:** అవ్వా.. ఓ అవ్వా.. మీ మనవడు చెప్పినాడని అందరికీ చెప్పాల.. (ఇంతలో నలుగురైదుగురు అవ్వలు ముందుకు వెళ్లి జగన్‌తో కరచాలనం చేయడానికి ప్రయత్నించినప్పుడు) అవ్వలూ.. మీరు కూడా అందరికీ చెప్పాల.. ఏమనంటే? మన ప్రభుత్వం వస్తానే పెన్షన్ రూ.2 వేలు ఇస్తారని చెప్పాల. అందరికీ పెన్షన్ ఇవ్వడమే కాకుండా పెన్షన్ వయస్సు 45 ఏళ్లకే తగ్గిస్తాం అని కూడా అందరికీ చెప్పాల. (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు).

మహిళలు: చెప్తాం, చెప్తాం (చప్పట్లు, కేరింతలు)

- **జగన్:** మీరందరూ పొదుపు సంఘాలలో ఉన్నారా? లేరా?

మహిళలు: అందరం సంఘాల్లో ఉన్నామన్నా.. రుణ మాఫీ చేస్తామని చంద్రబాబు మోసం చేశాడన్నా..

- **జగన్:** అయితే వినండి మరి.. బాబు మోసాలను అందరికీ చెప్పడమే కాకుండా ఎన్నికల నాటి దాకా పొదుపు సంఘాలలో ఎవరైతే ఉన్నారో వారికి అప్పటి దాకా ఎంత అప్పు ఉంటుందో అంత మొత్తాన్ని నాలుగు దఫాలుగా నేరుగా మీ చేతికే ఇస్తాం. ఈ విషయాన్ని మీరు అందరికీ చెప్పాలి.

మహిళలు: సరేనన్నా.. (జగనన్న జిందాబాద్ అంటూ నినాదాలు)

- **జగన్:** అట్లనే.. సున్నా వడ్డీ కావాల్నా? వద్దా? అది ఏంటికి రావడం లేదో కారణం తెలుసా? చంద్రబాబు ముఖ్యమంత్రి అయినాక మన తరఫున బ్యాంకులకు వడ్డీ లెక్కలు కట్టడం మానేసినాడు. కాబట్టి మనకు గానీ, రైతులకు గానీ ఎవ్వరికీ కూడా బ్యాంకులు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదు. మన ప్రభుత్వం వచ్చినాక మీకు ఇచ్చేది కాకుండా సెపరేట్‌గా వడ్డీ లెక్కలు కూడా బ్యాంకులకు కడతాం. అప్పుడు బ్యాంకులు మీకు వడ్డీ లేని రుణాలు ఇస్తాయి. అర్థమైందా..

మహిళలు: అర్థమైందన్నా.. ఈ విషయం అందరికీ చెబుతామన్నా..

- **జగన్:** ఇవన్నీ అందరికీ చెప్పడమే కాకుండా దేవునికి గట్టిగా మొక్కాల.. రెండు టెంకాలు ఎక్కువగా కొట్టాల.. దువా చేసే వాళ్లు రెండు సార్లు ఎక్కువ చేయాల.. చంద్రబాబుతో యుద్ధం చేస్తున్నాం.. మనకు దేవుని దయ దండిగా కావాల.

మహిళలు: అవునన్నా.. దేవునిడి రెండు కాదు.. పది టెంకాయలు కొడతామన్నా..



గోగినేనిపురం వద్ద జగన్‌తో కలసి నడుస్తున్న అక్కచెల్లెమ్మలు



జగన్‌తో కరచాలనం కోసం చెన్నూరులో పోటీ పడుతున్న అక్కచెల్లెమ్మలు

ప్రజా సంకల్ప యాత్ర
మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం, 30-1-2018


శాంత, ధనుంజయన్ : : భరతనాట్య కళాకారులు

యాభై ఏళ్ల భార్యాభర్తల బంధం!
అబ్బ.. ఎంత ముచ్చటగా ఉంది!
ప్రేమ కలిపింది.
నాట్యం నిలిపింది.
ఎ బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ!

నాట్యంతో మమేకమై జీవిస్తున్న దంపతులు అనగానే మనకు ఇక్కడ రాధారెడ్డి, రాజారెడ్డి గుర్తుకువస్తారు. ఆ దంపతులు కూచిపూడిని విశ్వవ్యాప్తం చేస్తుంటే, ఈ దంపతులు భరతనాట్యానికి మువ్వలుగా సందడి చేస్తున్నారు.

భార్యాభర్తనాట్యం

‘‘నేను శాంతను తొలిసారి చూసింది ‘కళాక్షేత్ర’లోని థియోసాఫికల్ గార్డెన్‌లో. అసలు కళాక్షేత్రలో నేను కలిసిన అమ్మాయి తనే. నాకు తమిళ్ రాకపోవడంతో ఆమె ప్రత్యేకమైన శ్రద్ధతో నన్ను గైడ్ చేస్తుండేది. శాంతలో నాకు నచ్చిన లక్షణాలు చాలా ఉన్నాయి. తానెప్పుడూ ఏదో ఒక పనిలో ఉండేది. అయినా ముఖం మీద చిరునవ్వు చెరిగేది కాదు’’

78 ఏళ్ల ధనుంజయన్ 74 ఏళ్ల శాంత గురించి చెప్పిన మాటలివి. వారిది అన్యోన్యమైన దాంపత్యం. వారి ప్రేమ అపూర్వం. వారి నాట్యరీతులు అమోఘం. యాభై ఏళ్లుగా వారిద్దరూ భరతనాట్యంలో ప్రదర్శనలిస్తూనే ఉన్నారు. దేశవిదేశాల్లో దశాబ్దాలుగా వారి పాదాలు నర్తిస్తూనే ఉన్నాయి.

ధనుంజయన్‌ది కేరళలోని కన్నూరు జిల్లాలో పయ్యనూర్. తండ్రి స్కూల్ టీచర్. అసలే పేద కుటుంబం, ఎనిమిది మంది సంతానాన్ని పోషించడానికి ఆయన జీతం సరిపోయేది కాదు. రెండు మూడేళ్లకోసారి బదిలీ. ఒక చోట కుదురుగా లేని బాల్యం ధనుంజయన్‌ది.

శాంతది మలేసియాలో స్థిరపడిన మలయాళీ కుటుంబం. నాట్యంలో, గానంలో చురుగ్గా ఉండేది. భరత నాట్యమంటే ఆమెకు చెప్పలేనంత ఇష్టం. ఎనిమిదేళ్ల వయసులో డాన్స్ ప్రాక్టీస్ మొదలుపెట్టింది.

వీళ్లిద్దరినీ కలిపింది తమిళనాడులోని కళాక్షేత్ర నాట్యకేంద్రం. ధనుంజయన్‌కి భరతనాట్యం మీద ఉన్న ఆసక్తిని గమనించిన నాట్యగురువు కళాక్షేత్రకు రికమండ్ చేసి స్కాలర్‌షిప్‌తో సీటిప్పించారు. అలా ధనుంజయన్ పద్నాలుగేళ్ల వయసులో కళాక్షేత్రలో అడుగుపెట్టారు. అప్పటికి ఓ ఏడాది ముందే శాంత.. కళాక్షేత్రలో చేరింది.

నాట్య బంధం!

నాట్య గురువులు చందు పణిక్కర్, రుక్మిణీదేవిల శిక్షణలో ధనుంజయన్, శాంతలు రాముడు –సీత అయ్యారు, అనిరుద్ధ–చంద్రలేఖలయ్యారు. ‘‘మా తొలి ప్రదర్శన సీతా స్వయంవరం. 1956లో కోయంబత్తూరులో ఇచ్చాం’’ అని ధనుంజయన్ గుర్తు చేసుకున్నారు. ‘ఆ నాట్యప్రదర్శన కోసం రిహార్సల్స్ చేస్తున్నప్పుడు ఒక చిన్న స్టూల్ మీద చాలా సన్నిహితంగా కూర్చోవాల్సి వచ్చేది. అప్పుడు చాలా ఎంబరాసింగ్‌గా ఫీలయ్యాను. ఆ తర్వాత అదే స్టూల్‌ని ఇష్టంగా వాడేవాళ్లం’ అని గుర్తు చేసుకున్నారు శాంత.

పేదరికం ప్రేమను చంపేస్తుందా?

ధనుంజయన్, శాంత ఇద్దరూ భరతనాట్యం, కథాకళిలో డిస్టింక్షన్‌లో పాసయ్యి 1962లో గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు. వీటితోపాటు ఆమె కర్ణాటక సంగీతం కూడా నేర్చుకున్నారు. శాంత కోర్సు పూర్తయిన తర్వాత మలేసియాకు వెళ్లిపోయారు. ధనుంజయన్‌కి మిగిలింది సస్పెన్సే. అప్పటికీ ఆయన తన ఫీలింగ్స్‌ని బయట పెట్టనేలేదు. తనలో మొగ్గతొడిగిన ప్రేమ.. ప్రేయసికి తెలియజేయకుండానే వడలిపోతుందా అని బెంగ. పేదరికం తన ప్రేమను చంపేస్తుందేమోనని ఆందోళన. ఇక్కడ ఇలా ఉంటే... మలేసియాలో శాంతకు తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు! ధనుంజయన్‌ని తప్ప ఎవరినీ తన జీవితంలోకి ఆహ్వానించడానికి సిద్ధంగాలేదామె. పెళ్లి చూపులు వద్దంటూ ఉండడంతో ఆమె పేరెంట్స్ అర్థం చేసుకుని ఇండియాకు వచ్చారు. కేరళలోని గురువాయూర్ ఆలయంలో 1966లో ధనుంజయన్‌కు, శాంతకు పెళ్లి చేశారు. శాంత.. భర్తతో కేరళలోనే ఉండిపోయింది, తల్లిదండ్రులు మలేసియాకి వెళ్లిపోయారు.

పెళ్లి సరే... బతికేదెలా?!

చేతిలో డాన్స్‌తోపాటు ఎకనమిక్స్‌లో పట్టా ఉంది. ఓ చిన్న కంపెనీలో క్లర్కు ఉద్యోగం వచ్చింది. అమ్మానాన్నలకు పంపించడానికి, తన ఇంటిని నడిపించడానికి ఒక భరోసా వచ్చింది. కానీ సంపన్న కుటుంబంలో పుట్టిన భార్యకు కనీస వసతులు కల్పించాలంటే ఆ జీతం ఏ మాత్రం సరిపోదు. అందుకే ఆఫీస్ నుంచి వచ్చిన తర్వాత డాన్సు క్లాసులు తీసుకునేవారు ధనుంజయన్. తాటాకు కప్పుతో చిన్న పాకలో ఆయన నాట్యగురువుగా ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. క్రమంగా తమిళనాడుకు షిఫ్ట్ అయ్యారు. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో వారి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ ‘భారత కళాంజలి’కి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.



ఆ రోజుల్లోకి వెళ్లిపోతూ, ‘‘శాంతను సంతోషంగా ఉంచడం మీదనే నా దృష్టి అంతా. వాళ్ల తల్లిదండ్రులది ఆర్థికంగా బాగా స్థిరపడిన కుటుంబం. సౌకర్యవంతమైన జీవితాన్ని వదిలి నా కోసం వచ్చింది. ఆమె మాత్రం ఎటువంటి సౌకర్యాలనూ అడిగేది కాదు. అయినా ఆర్థిక వెసులుబాటు లేని కారణంగా ఎదురయ్యే ఇబ్బందులు శాంతకు రాకుండా చూడడం నా బాధ్యత అన్నట్లు శక్తివంచన లేకుండా ప్రయత్నించేవాడిని. ఆమె ముందుచూపుతో మేము ఏర్పరుచుకున్న సామ్రాజ్యం ఇది’’ అంటారు ధనుంజయన్.

వొడాఫోన్ కపుల్

ధనుంజయన్, శాంత దంపతులకు సత్యజిత్ ఒక్కడే కొడుకు. ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. అదే రంగంలో కొనసాగాడు. కొడుకు సరదా కోసం వాళ్లు గోవాలో చిత్రీకరించిన వొడాఫోన్ అడ్వర్టయిజ్‌మెంట్‌లో నటించారు. అందులో ఈ దంపతులు సెకండ్ హనీమూన్‌కొచ్చిన కపుల్ అన్నమాట. అది డాన్సు ప్రధానంగా ఉన్న యాడ్ కావడంతో చేయడానికి ఒప్పుకున్నారు శాంత. ఆ తర్వాత మరో ఐదు యాడ్ ఫిల్మ్స్‌లో నటించినప్పటికీ వొడాఫోన్ యాడ్ తనకు చాలా ఇష్టమంటారు శాంత. ఆమె స్వతహాగా కూడా అడ్వెంచర్ స్పోర్ట్స్‌ను ఇష్టపడతారు. పారాసైలింగ్ ఆమె హాబీ. ఆ యాడ్‌లో ఆమె పారాసైలింగ్ చేశారు కూడా. అందుకే ఆ యాడ్‌ను అంతగా ఇష్టపడతారు.


● గోవా బీచ్‌లో లవ్‌లీ కపుల్ ధనుంజయన్, శాంత

నాట్య ప్రయోగాలు!

భార్యాభర్తలిద్దరూ అప్పటి వరకు తాము నేర్చుకున్న నాట్యరూపకాలను ప్రదర్శించడంతో కెరీర్ మొదలుపెట్టారు. తర్వాత కొత్త రూపకాలను పరిచయం చేశారు. నాట్యంలో యుగళగీతాన్ని ప్రవేశపెట్టారు. సంప్రదాయ అలరిప్పు స్థానాన్ని వారి ‘కళాంజలి’ పరిపూర్ణం చేసింది. ఆ దంపతుల అభినయం ‘నృత్యోపహారమ్’ రూపకాన్ని ఆవిష్కరించింది. వాటిని ఎల్లలు దాటించి విదేశాల్లోనూ వందలాదిగా ప్రదర్శించారు.

మనదేశంలో దాదాపుగా అన్ని రాష్ట్రాలకూ తాము రూపొందించిన కొత్త రీతులను చూపించారు. ఖజురహో ఫెస్టివల్, రాష్ట్రపతి భవన్‌లో... ఇలా వేలాది ప్రదర్శనలు, లక్షలాది ప్రశంసలను అందుకున్నారు. పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డుతోపాటు పదులకొద్దీ అవార్డులు వారి సొంతమయ్యాయి. ఇన్ని ప్రశంసలలో తమను అత్యంత మురిపించిన ప్రశంస అమెరికాలోని అట్లాంటాలో ఏడేళ్ల బాలుడు తమకు ఇచ్చిందేనని అంటారు. ధనుంజయన్.

నాట్యమే ఊపిరి!

నాట్య ప్రదర్శనలు మొదలు పెట్టి యాభై ఏళ్లు దాటినా ఇంకా ఈ దంపతులలో ఆ స్ఫూర్తి ఏ మాత్రం తరగలేదు. ‘నాట్యం చేయకపోతేనే నిస్సత్తువ ఆవరిస్తుంది. నాట్యాన్ని శ్వాసిస్తూ జీవించాం, శ్వాస ఆగే వరకు నాట్యం చేస్తూనే ఉంటాం’ అన్నారు ధనుంజయన్. ‘నాట్యంలో శిఖరాలను చూసిన ఆనందాన్ని అనంతంగా ఆస్వాదిస్తున్నాం. ఇక మేము చేయాల్సిన పెద్ద బాధ్యత ఒకటుంది. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ కోసం పెద్ద థియేటర్ నిర్మించాలి. సాంస్కృతిక నగరం చెన్నైలో నిత్యం కొత్త కళాకారులు పుట్టుకొస్తూనే ఉంటారు. వారికి ప్రదర్శనలకు అనువుగా ఒక వేదిక కావాలి. అది పూర్తయితే భరతనాట్యానికి మా వంతుగా తిరిగి ఇచ్చిన వాళ్లమవుతాం’ అన్నారు శాంత.

- మంజీర


అతిథి రావ్ హైదరీ : ఖిల్జీ భార్య మెహరున్నీసా

వై పద్మావతి?!

‘పద్మావత్’ చిత్రంలో పద్మావతి కోసం అల్లావుద్దీన్ ఖిల్జీ.. ఢిల్లీలో తన రాజ్యాన్ని వదిలేసి చిత్తోడ్‌ఘడ్ చేరుకుని అక్కడి ఎడారిలో గుడారం వేసుకుని కూర్చుంటాడు! ‘తలుపు మూసిన తలవాకిటనే పగలూ రేయీ కూర్చున్నా..’ అని 1978 నాటి ‘ఇంద్రధనస్సు’ సినిమాలో కృష్ణ పాడతాడు కదా, శారద కోసం.. అలా ఇక్కడ ఖిల్జీ.. పద్మావతి కోసం అలమటిస్తుంటాడు. అతడి కళ్లు చెమ్మగిల్లుతాయి కూడా. ‘ఏంటి అంతటివాడికి ఇంత ఖర్మ?’ అని అనిపిస్తుంది ప్రేక్షకులకు. ‘పద్మావతంత అపురూపమైన మానవ స్త్రీ ఈ భువిలో లేదని’.. నమ్మకద్రోహి అయిన చిత్తోడ్‌ఘడ్ రాజగురువు ఢిల్లీ వెళ్లి ఖిల్జీకి చెప్పి, అతడిని రెచ్చగొట్టడంతో ఆ మాయలో పడిపోతాడు ఖిల్జీ! అతడి భార్య మెహరున్నీసా కూడా అందాలరాశే. అంత అందాన్ని కళ్లెదుట పెట్టుకుని, వేరే రాజ్యపు స్త్రీ కోసం ఖిల్జీ పాకులాడటం కూడా ఆడియన్స్‌కి అతడిపై గౌరవాన్ని తగ్గిస్తుంది. సినిమా చూస్తున్నవారికి హాల్లోంచి ఒక మాట తప్పనిసరిగా వినిపిస్తుంది. ‘అరె.. ఈవిడ కూడా అందంగా ఉంది కదా. ఖిల్జీకి ఇదేం పోయేకాలం?’ అని! ఖిల్జీ భార్యగా అతిథి రావ్ హైదరీ నటించారు. నిజంగానే ఆమె దీపికా పదుకోన్‌కి దీటుగా ఉన్నారు.


రణ్‌వీర్ సింగ్ : అల్లా ఉద్దీన్ ఖిల్జీ

చేస్తారా? తీస్తారా?

నవ్వు ఒకటి కాదు. దేహాకృతి ఒకటి కాదు. హావభావాలు ఒకటి కాదు. మరెలా ఆవిడ పాత్రను ఈవిడ పోషించడం? బాలన్.. ఇందిర పాత్రను పోషించగలరా లేదా అన్నది తర్వాతి సంగతి. ముందైతే ఈ సంగతి చెప్పండి. నటనలో ఒక మహోన్నత వ్యక్తిత్వాన్ని అనుకరించడానికి ఈ పోలికలన్నీ నిజంగా అవసరమా? ప్రధానిగా దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు, వైవాహిక జీవితంలో ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పుడు, చిన్న కొడుకు సంజయ్ గాంధీతో తలనొప్పులు వచ్చినప్పుడు, రాజకీయాల్లో కల్లోలం చెలరేగినప్పుడు ఇందిరాగాంధీ ఎంత స్ట్రాంగ్ ఉన్నారో.. అంత స్ట్రాంగ్‌నెస్ లైఫ్‌లో ప్రతి మహిళలోనూ ఉంటుంది. విద్యాబాలన్‌లోనూ ఉండి తీరుతుంది. ఆ శక్తి చాలు కదా ఇందిరగా బాలన్ నటించానికి. సాగరికా ఘోష్ రాసిన ‘ఇందిర : ఇండియాస్ మోస్ట్ పవర్‌ఫుల్ ప్రైమ్ మినిస్టర్’ పుస్తకానికి విద్యాబాలన్ రైట్స్ కొనుక్కున్నారు. దాంతో ఆ పుస్తకాన్ని సినిమాగా తియ్యబోతున్నారా, ఇందిరగా విద్యాబాలన్ సూట్ అవుతారా అనేది ఇప్పుడు టాపిక్ అయింది. రైట్స్ అయితే బాలన్ దగ్గరున్నాయి. విద్యే ఇందిరగా నటించాలనేముందీ? ఇంకెవరి చేతైనా యాక్ట్ చేయించవచ్చు కదా.. నిర్మాతగా మారి!


● విద్యాబాలన్


● ఇందిరాగాంధీ

అందమే ఆనందం



- గంధం పొడి, శనగపిండి, బాదంపప్పు పేస్ట్‌లను టీ స్పూన్ చొప్పున తీసుకోవాలి. అందులో ఐదు రేకల కుంకుమపువ్వు, గుడ్డులోని తెల్లసొన, కొన్ని పచ్చిపాలను చేర్చి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి ఆరనివ్వాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. వారానికి మూడుసార్లు ఈ విధంగా చేస్తుంటే చర్మానికి మెరుపు వస్తుంది.

ఓ నిమిషం




- అరటిపండు గుజ్జులో ఒక స్పూను పెసరపిండి, మంచి గంధం, తేనె వేసి కలపాలి. దీనితో ముఖానికి ప్యాక్ వేసుకుని, పదిహేను నిమిషాల తర్వాత కడిగేస్తే ముఖం ప్రకాశవంతంగా ఉంటుంది.
- టమాటా గుజ్జులో కొద్దిగా తేనె కలిపి చేతులకు పట్టించాలి. అరగంట తర్వాత కాసిన్ని పచ్చిపాలతో మసాజ్ చేసి అప్పుడు కడిగేసుకుంటే... మృతకణాలు తొలగిపోతాయి.

చెట్టు నీడ | 30 జనవరి 1948

మహాత్ముని మరణం

వడివడిగా, వేగంగా ప్రార్థనకు నడుస్తూ వస్తున్నారు గాంధీజీ. బిర్లాహౌస్ (ఢిల్లీ) మైదానంలోని జనం లేచి ‘బాపూజీ, బాపూజీ’ అని ఆరాధనతో తన్మయమౌతున్నారు. అచ్ఛాదన లేని ఆయన ఛాతీ ఎన్ని మృత్యువులనైనా చేరదీసి, సేద తీర్చే ప్రేమ మందిరంలా ఉంది.



మళ్లొకసారి తుపాకీ సర్దుకున్నాడు గాడ్సే.

గాంధీజీకి ఎదురు నడుస్తున్నాడు గాడ్సే.

మృత్యువా? మహాత్ముడా? ఎవరు ఎవరిని గౌరవిస్తారో, ఎవరు ఎవరికి శిరస్సు వంచి నమస్కరిస్తారో, ఎవరు ఎవరిని అంతిమంగా ఒడిలోకి తీసుకుంటారో.... కొద్దిసేపట్లో తేలిపోతుంది.

గాంధీజీకి ఇటు మనూ, అటు అభా ఉన్నారు. తృటిలో మృత్యువు అక్కడికి చేరుకుంది. గాంధీజీకి అతి దగ్గరగా వచ్చి, వంగి, చేతులు జోడించాడు గాడ్సే. ఆ చేతుల మధ్య తుపాకీ ఉంది!

మృత్యువును జయించడమంటే... మృత్యువును వట్టి చేతులతో సాగనంపడం కాదని మహాత్ములు మాత్రమే అనగలరు. ఇవ్వడానికి గాంధీజీ దగ్గర నిండు ప్రాణాలున్నాయి. తృణప్రాయంగా వాటిని అర్పించగల గుండె ధైర్యం ఉంది.

మహాత్ముని శరీరంలోకి మూడు గుండ్లు దూసుకెళ్లాయి. కోట్ల హృదయాలకు తూట్లు పడ్డాయి.

బాపూజీ భౌతికంగా మరణించి నేటికి డెబ్బై ఏళ్లు. ఆయన అనుసరించి, మానవాళికి అందించి వెళ్లిన జీవిత సందేశాలు మాత్రం ఏనాటికీ మరణం లేనివి.

సందేహం


● ‘భాగమతి’ చిత్రంలో అనుష్క

పుడకా? పురుగా? పుడకా?

సినిమా కన్నా ముందు.. ‘భాగమతి’ మూవీ పోస్టర్లు విడుదలైనప్పుడు, చాలామందికి మొదట అర్థం కాలేదు.. అనుష్క ముక్కుపై ఉన్నదేమిటో!! ఎవరో పుడక అన్నారు. ఇంకెవరో, పురుగై ఉండొచ్చు అనుకున్నారు. పురుగెలా అవుతుందని ఇంకొందరు. క్యారెక్టర్‌ని బట్టి పుడకో, పురుగో అయి ఉంటుందిలెమ్మని సరిపెట్టుకున్నారు అప్పటికి. సినిమా రిలీజ్ అయింది. అనుష్క ముక్కుపై ఉన్నది పుడక అని తేలిపోయింది. పోస్టర్‌ని దీక్షగా చూసినవాళ్లు రిలీజ్‌కంటే ముందే అది పుడక అని గుర్తించే ఉంటారు. అయినా పురుగులను ఆభరణాలుగా ధరించేవారు ఎక్కడైనా ఉంటారా? ఉంటారు. ఇప్పుడు ఉన్నారో లేదో కానీ, ఒకప్పుడు ఉండేవారు. ఈజిప్షియన్‌లు యుద్ధానికి వెళ్లే ముందు జీరంగి పురుగులను మెడలో ధరించి వెళ్లేవాళ్లు. అలా చేస్తే అతీంద్రియ శక్తులు ఆవహించి విజయం లభిస్తుందని వారి నమ్మకం. జీరంగికి నొప్పి కలక్కుండా ఒడుపుగా మెడలోని హారానికి దానిని తగిలించేవారట. ఈ ఆచారం ప్రాచీన మెక్సికన్‌లలో కూడా ఉండేది. అయితే వాళ్లు బొద్దింకలను ధరించేవారు. మయన్ కల్చర్‌లో బంగారు ఆభరణాలకు జీవంతో ఉన్న పురుగుల్ని కలిపి ధరించడం అనే సంప్రదాయం ఉన్నట్లు చరిత్రలో ఉంది. అదృష్టం కలిసిరావడానికి, దుష్టశక్తులు దూరంగా వెళ్లడానికి ఇలా చేసేవారట.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హలో అన్నయ్యా.. నేను బీటెక్ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నప్పుడు ఒక అబ్బాయిని లవ్ చేశాను. మొదట్లో మేం బెస్ట్ ఫ్రెండ్స్. చాలా క్లోజ్ అయ్యాం. వదిలి ఉండలేని పరిస్థితికి వచ్చాక... ‘‘వేరే అమ్మాయితో పెళ్లి ఫిక్స్ అయ్యింది, తనంటే నాకు ఇష్టంలేదు. కానీ చేసుకోకపోతే మా నాన్న చచ్చిపోతాడు’’ అని చెప్పాడు. ఒక సారి నేను ఆ అమ్మాయితో మాట్లాడాను. మేం లవ్ చేసుకుంటున్నామని కూడా చెప్పాను. కానీ తన నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఈ ఇయర్‌లో పెళ్లి అవొచ్చు అంటున్నాడు. అయినా సరే నాతోనే ఉంటున్నాడు. మరిపోవాలని ట్రై చేస్తున్నా కానీ ప్రతిసారీ ఫెయిల్ అవుతున్నా. వాడికి ఎక్కడ పెళ్లి అయిపోతుందోనని చాలా భయపడుతున్నా. నిద్రాహారాలు లేకుండా నిత్యం ఏడుస్తున్నా. ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి అన్నయ్యా.

\- కావ్య

కావ్యా బంగారం...!

నీ పేరులా... జీవితం అంత అందమైన కావ్యం కాదురా!

అపశ్రుతులు ఎక్కువ.

ప్రేమ సరైన వాడితో చెయ్యకపోతే..

లైఫ్ అంతా అపశ్రుతే..!

కొలనులోని అందమైన కమలం చుట్టూ బురదే ఉంటుంది నాన్నా.

తామరాకులా ఉండడం నేర్చుకోవాలి.

‘సార్ తామరాకులా అంటే ఎలా సార్??’

బురద చుక్కలు పడ్డా..

తామరాకు అందం మారదు..

తామరాకు ఆలోచనా మారదు...

ఎందుకంటే తామరాకుకు తెలుసు..

తాను స్వచ్ఛమైనదని.

మంచీచెడు తనను కెరటంలా ఎగరనివ్వదని, పడనివ్వదని.

‘అంటే ఇప్పుడు ఆ అబ్బాయి ప్రేమ పన్నీరా? బురద చుక్కా? సార్????’

ప్రేమించిన వాడిలో పవిత్రత ఉంటే నాన్న కొడతాడనో..

అమ్మ కోప్పడుతుందనో అమ్మాయికి అన్యాయం చెయ్యడు.

అమ్మానాన్నల మీద అంత గౌరవం ఉంటే..

అమ్మాయిని తప్పుదారి పట్టించాల్సింది కాదు.

ఆ అబ్బాయికి, తన ఫియాన్సీకి కావ్య అంటే చాలా చిన్న చూపు ఉంటుంది.

అలాంటి చోట.. అలాంటి మనుషుల మధ్య నా బంగారం....

‘ఒక్క క్షణం కూడా ఉండకూడదు సార్... ఉండకూడదు అంతే..!’

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాలక్షేప సుడోకు

		4	7	9	3		2	
1	2			8		4		3
3	9		4			5		7
7	4	3						
						8	4	6
6		2			4		1	5
9		8		1			3	4
	3		2	5	9	7		


నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	6	7	2	5	3	4	1	9
4	2	5	1	9	6	7	8	3
1	9	3	4	7	8	2	6	5
6	8	2	5	3	7	1	9	4
5	3	4	6	1	9	8	2	7
9	7	1	8	2	4	5	3	6
3	5	9	7	8	1	6	4	2
2	1	6	3	4	5	9	7	8
7	4	8	9	6	2	3	5	1

వైభవంగా ‘2.0’ టీజర్ లాంచ్


అభిమానుల సమక్షంలో వేడుక


రజనీకాంత్

‘నాన్ ఎప్పో వరువేన్, ఎప్పిడి వరువేన్ను యారుక్కుమ్ తెరియాదు. ఆనా వరవేండియ నేరత్తుల వరువేన్’. ‘నాన్ లేట్టా వందాలుమ్ లేటెస్టా వరువేన్’...

రజనీకాంత్ చెప్పిన పాపులర్ డైలాగ్స్‌లో ఈ రెండూ కూడా ఉన్నాయి. మొదటిది ‘ముత్తు’ సినిమాలోది. రెండోది ‘బాబా’లో చెప్పిన డైలాగ్. ఈ రెండు డైలాగ్స్‌ని రజనీకాంత్ తాజా చిత్రం ‘2.0’కి కనెక్ట్ చేయొచ్చు. ‘నేను ఎప్పుడు వస్తానో ఎలా వస్తానో ఎవరికీ తెలియదు. కానీ రావాల్సినప్పుడు వస్తా’ అన్నది ఫస్ట్ డైలాగ్ అర్థం. ‘నేను లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా వస్తా’ అన్నది రెండో డైలాగ్ అర్థం. ఇప్పటికి రెండు మూడు సార్లు వాయిదా పడిన ‘2.0’ లేటెస్ట్‌గా రావడం ఖాయమని, రావాల్సిన టైమ్ (సమ్మర్ హాలిడేస్)కే వస్తుందని అభిమానులు అంటున్నారు. శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ‘2.0’ గ్రాఫిక్స్ వర్క్ ప్రస్తుతం లాస్ ఏంజిల్స్‌లో జరుగుతోంది. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ చిత్రం పాటలను దుబాయ్‌లో విడుదల చేశారు. టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. ‘‘టీజర్ రిలీజ్ ఫంక్షన్‌ను భారీగా ప్లాన్ చేస్తున్నాం. రెండు తెలుగు రాష్ట్రాల అభిమానుల సమక్షంలో ఫంక్షన్ చేయాలనుకుంటున్నాం. అందుకు తగ్గ వేదిక కోసం చూస్తున్నాం’’ అని ‘2.0’ టీమ్ ప్రతినిధి పేర్కొన్నారు. సెక్యూరిటీ, వేదిక అన్నీ కరెక్ట్‌గా కుదిరితే అభిమానుల మధ్యలో ఫంక్షన్ చేయడం పక్కా. ఫిబ్రవరిలో లేదా మార్చిలో ఈ వేడుక ఉంటుంది. హైదరాబాద్‌లో టీజర్ రిలీజ్ చేసిన 30 రోజులకు చెన్నైలో ట్రైలర్ రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఏప్రిల్ 27న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారని వార్త వచ్చిన విషయం తెలిసిందే. ఆ నెలలోనే రావడానికి ముమ్మరంగా పనులు చేయిస్తున్నారు.

ఇక్కడ స్టెప్ అవుట్.. అక్కడ స్టెప్ ఇన్


రామ్‌చరణ్

స్టెప్ అవుట్ అయితే స్టెప్ ఇన్ అవ్వాలి. అవును... ‘రంగస్థలం’ నుంచి స్టెప్ అవుట్ అయ్యి కొత్త సినిమాలోకి స్టెప్ ఇన్ అవ్వబోతున్నారు రామ్‌చరణ్. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ సినిమా అంగీకరించిన విషయం తెలిసిందే. త్వరలో ‘రంగస్థలం’ పూర్తవుతుంది. ప్రస్తుతం ఈ చిత్రం కోసం స్టెప్పులేస్తున్నారు చరణ్. ఓ పాట చిత్రీకరణ జరగుతోంది. ఆ తర్వాత బోయపాటి సినిమాతో బిజీ అయిపోతారు. మరి.. బోయపాటి సినిమా ఆల్రెడీ ఫస్ట్ షెడ్యూల్ కంప్లీట్ అయిపోయింది కదా అంటే... ఫస్ట్ షెడ్యూల్‌లో నటి స్నేహ మరియు ఇతర తారాగణం పై కొన్ని సీన్లను చిత్రీకరించారు. ఇవి ఫ్యామిలీ ఎమోషనల్ సీన్స్. పది రోజుల పాటు ఈ షెడ్యూల్ జరిగింది. ఫిబ్రవరి మూడో వారంలో తర్వాతి షెడ్యూల్ స్టార్ట్ చేస్తారట. ఆ షెడ్యూల్‌తో షూటింగ్‌లోకి స్టెప్ ఇన్ అవుతారు రామ్‌చరణ్. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ఆ షెడ్యూల్‌లో పాల్గొంటారు. ఈ సినిమాలో చరణ్ లుక్ చాలా కొత్తగా ఉండబోతోందని, ఎక్కువ శాతం షూటింగ్ రాజస్థాన్‌లో జరగనుందని సమాచారం. కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


రకుల్ ప్రీత్‌సింగ్

సింగిల్‌గా ఉన్నవాళ్లను లింక్ చేసేస్తారు!

ప్లేస్ మారినా గాసిప్ మారేట్లు లేదు. ఒకచోట వేసిన రికార్డ్‌నే మరో చోట వేయాల్సి వస్తోంది. సినిమా రికార్డులతో ఆనందపడే సెలబ్రిటీలకు ఇలా.. గాసిప్పుల విషయంలో వేసిన రికార్డునే మళ్లీ మళ్లీ వేయడం చిరాకే. కానీ ఆ చిరాకుని బయటపెట్టకుండా చక్కగా సమాధానం చెప్పాలి. లేకపోతే ‘తెగ పోజు’ అని ట్యాగ్ వేసేస్తారు. ఇవన్నీ రకుల్ ప్రీత్‌సింగ్‌కి తెలియదా? ఏంటి. అందుకే హైదరాబాద్‌లో అడిగిన అదే ప్రశ్నను.. ముంబైలో అడిగితే.. ఇక్కడ చెప్పినట్లే నవ్వుతూ సమాధానం చెప్పారు. ‘రానాతో డేటింగ్ అట’ అన్నదే ఆ ప్రశ్న. ‘అలాంటిదేం లేదు’ అని ముంబై మీడియాతో అన్నారు రకుల్. ఇంకా వివరంగా చెబుతూ –‘‘మా గ్రూప్‌లో మేం మొత్తం 15 నుంచి 20 మంది ఉంటాం. వాళ్లల్లో రానా కూడా ఉన్నారు. కానీ మా ఇద్దరి గురించి చాలాకాలంగా వార్తలు వస్తున్నాయి. రానా, నేను మంచి ఫ్రెండ్స్. నేను హైదరాబాద్‌లో ఉంటాను. అమ్మానాన్న ఢిల్లీలో ఉంటారు. ఇక్కడ నాకంతా ఫ్రెండ్సే. మేమంతా ఎప్పుడూ కలుస్తుంటాం. మా గ్రూప్‌లో ఇద్దరు ముగ్గురు మాత్రమే పెళ్లి కానివాళ్లు. దాంతో సింగిల్‌గా ఉన్న మాలాంటివాళ్లను లింక్ చేసి వార్తలు పుట్టిస్తారనుకుంటున్నా’’ అన్నారు రకుల్.

నేను లక్కీ

‘‘డైరెక్టర్ మదన్ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. నా గత చిత్రాలతో పోలిస్తే ‘గాయత్రి’ సినిమాలో నా పాత్ర కూడా సహజంగా, అందంగా ఉంటుంది. అందుకే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నా’’ అని కథానాయిక శ్రియ అన్నారు. మోహన్‌బాబు హీరోగా విష్ణు, శ్రియ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘గాయత్రి’. మదన్ రామిగాని దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మించిన ఈ సినిమాని ఫిబ్రవరి 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రియ విలేకరులతో మాట్లాడారు.

- ‘గాయత్రి’ సినిమాలో నేను ఓ చిన్న పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపిస్తా. నా క్యారెక్టర్ చాలా అమాయకంగా, నిజాయితీగా, తెలివిగా ఉంటుంది. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది. మోహన్‌బాబుగారు గొప్ప నటుడు. విష్ణుతో యాక్ట్ చేయడం మంచి అనుభూతినిచ్చింది.
- మదన్ ఎటువంటి టెన్షన్ లేకుండా చాలా కూల్‌గా ఉంటారు. ఎక్కడా ఇబ్బంది పడకుండా ఈ చిత్రం తీశారు. ఆయనతో పని చేయడం చాలా బాగుంది. షూటింగ్ చేసినన్ని రోజులు బాగా ఎంజాయ్ చేశా. నాపై ఓ బ్యూటిఫుల్ సాంగ్ కూడా ఉంటుంది.
- దర్శకులు, రచయితలు మంచి కథలు, పాత్రలు రాస్తున్నారు కాబట్టి ఇన్నేళ్లుగా చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతున్నా. నేను ఎంపిక చేసుకునే సినిమాలు కూడా నాకు బాగా కలిసొచ్చాయి. ఒక మూసలో పడిపోకుండా ఎప్పటికప్పుడు కొత్త పాత్రలు చేసే అవకాశం వస్తోంది. అందుకే నేను లక్కీ.
- ప్రస్తుతం తెలుగులో ‘వీరభోగ వసంతరాయలు’, తమిళంలో కార్తీక్ నరేన్‌తో ‘నరగసూరన్’ సినిమాలు చేస్తున్నా. ఆ తర్వాత ఓ లేడీ డైరెక్టర్ సినిమా చేయనున్నా. యువ దర్శకులతో వరుస సినిమాలు చేయడానికి కారణం వారి కథలే. చక్కగా, వైవిధ్యంగా రాసుకుంటున్నారు. అందుకే నేను వారి సినిమాల్లో చేయడానికి ఒప్పుకుంటున్నా.


శ్రియ

ఆయనతో ఇంకో సినిమా చేయాలనుంది!


రాశీఖన్నా

‘‘ఓ సిన్సియర్ పోలీసాఫీసర్ కథ ‘టచ్ చేసి చూడు’. మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను మా సినిమా అలరిస్తుంది. ఈ సినిమా డబ్బింగ్ పూర్తి కాగానే రవితేజగారు నాకు ఫోన్ చేసి, చాలా బాగా చేశావని అభినందించారు. అదే నాకు బిగ్ కాంప్లిమెంట్’’ అని హీరోయిన్ రాశీఖన్నా అన్నారు. రవితేజ, రాశీఖన్నా, సీరత్ కపూర్ హీరో హీరోయిన్లుగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో బేబీ భవ్య సమర్పణలో నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మించిన ‘టచ్ చేసి చూడు’ ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశీఖన్నా పంచుకున్న విశేషాలు..

- ‘టచ్ చేసి చూడు’ చిత్రంలో నా పేరు పుష్ప. సాధారణంగా హీరోలకు వినోదం పండించే అవకాశం ఉంటుంది. కానీ హీరోయిన్లకు కామెడీ చేయడానికి స్కోప్ ఉండదు. అయితే.. ఈ సినిమాలో నాకు ఆ అవకాశం దొరికింది. రవితేజ గారికి, నాకు మధ్య ఉన్న మంచి కామెడీ సీన్స్ ప్రేక్షకులను అలరిస్తాయి.
- నా కోసం, సినిమాల కోసం బరువు తగ్గాను. నటనకూ, గ్లామర్‌కి స్కోప్ ఉన్న పాత్రలు చేయడం చాలా బాగుంది. ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేస్తే బోర్‌గా ఉంటుంది. అందుకే విభిన్నమైన పాత్రలు చేయాలి.
- రవితేజగారు చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు. సెట్స్‌లో ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటారు. ఆయనతో పని చేయడం చాలా బాగుంటుంది. రవితేజగారితో ఇంకో సినిమా చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నా.
- ‘టచ్ చేసి చూడు, తొలిప్రేమ’ సినిమాల్లో నా పాత్రలకు నేనే డబ్బింగ్ చెప్పాలనుకున్నా. కానీ టైమ్ దొరకలేదు. డబ్బింగ్ చెప్పాలంటే ఎక్కువ సమయం పడుతుంది. అందుకే వీలు కుదరలేదు.
- సీనియర్ హీరోలతో పనిచేస్తున్నప్పుడు వాళ్ల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. యంగ్ హీరోల నుంచి కొత్తవి నేర్చుకోవడానికి ట్రై చేస్తుంటాను. నాకు టాలీవుడ్‌లో బాగుంది. మంచి సినిమాలు, పాత్రలు వస్తున్నాయి. చాలా హ్యాపీ. అటువంటప్పుడు బాలీవుడ్ ప్రయత్నాలు ఎందుకు? అందుకే చేయడం లేదు.

దెయ్యాలు భయపడితే...


విజయ్, శ్రీకాంత్, విజి చరిష్

దెయ్యాలను చూసి మనుషులు భయపడటం కామన్. బట్ ఫర్ ఎ ఛేంజ్.. మనుషులను చూసి దెయ్యాలు భయపడితే? ఎలా ఉంటుందనే కథాంశంతో తెరకెక్కిన చిత్రం ‘రా రా’. శ్రీకాంత్, నాజియా జంటగా విజి చరిష్ దర్శకత్వంలో విజయ్ నిర్మించిన ‘రా రా’ ఫిబ్రవరి 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ– ‘‘తొలిసారి నేను నటిస్తున్న హారర్ కామెడీ చిత్రమిది. కథ విన్నప్పుడే ఈ సినిమా బాగుంటుందనుకున్నా. హారర్ నేపథ్యంలో ఇప్పటికే చాలా సినిమాలు వచ్చాయి. వాటికి భిన్నంగా కొత్తగా.. ఎంటర్‌టైనింగ్‌గా ఉండాలని ఈ సినిమా చేశాం. ఆర్టిస్టులు, ఖర్చు విషయంలో విజయ్, శ్రీమిత్ర చౌదరి రాజీ పడకుండా ఈ చిత్రం తీశారు. పాటలు, రీ–రికార్డింగ్ చాలా బాగా వచ్చాయి. ఈ సినిమా విజయంపై వందశాతం నమ్మకంగా ఉన్నాం’’ అన్నారు. ఈ సమావేశంలో విజి చరిష్, విజయ్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ర్యాప్‌రాక్ షకీల్, కెమెరా: పూర్ణ, సమర్పణ: ఎంవీ చౌదరి.

కష్టాలతో నేసిన కథ


వరుణ్ ధావన్


అనుష్క శర్మ

సూదీ దారం తీసుకొని ఎంబ్రాయిడరీ వర్క్ చేస్తున్నారు అనుష్క శర్మ. వీదేశీ ఉత్పత్తులు వద్దు.. స్వదేశీ ఉత్పత్తులే ముద్దు అంటున్నారు వరుణ్ ధావన్. అందుకే వరుణ్ దర్జీ అవతారం ఎత్తారు. ఇదంతా ‘సూయి ధాగా’ సినిమా కోసం. అంటే.. సూదీ దారం అని అర్థం. వరుణ్ టైలర్‌గా, అతని దగ్గర ఎంబ్రాయిడరీ వర్కర్‌గా అనుష్క శర్మ కనిపిస్తారట సినిమాలో. ఆ క్యారెక్టర్ కోసమే ఇలా సూదీ దారం తీసుకొని ఎంబ్రాయిడరీ వర్క్ నేర్చుకుంటున్నారామె. ‘మేక్ ఇన్ ఇండియా’ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ‘సూయి ధాగా’ సినిమాకు శరత్ కాత్రియ దర్శకత్వం వహిస్తున్నారు. వరుణ్, అనుష్క ఫస్ట్ టైమ్ జోడీగా నటిస్తున్న ఈ సినిమాను యశ్ రాజ్ సంస్థ నిర్మిస్తోంది. ‘‘గాంధీజీ నుంచి మోదీజీ వరకు పాటించిన ‘మేక్ ఇన్ ఇండియా’ మంత్రాన్ని ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్తున్నందుకు గర్వంగా ఉంది. మెసేజ్‌తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది’’ అని పేర్కొన్నారు వరుణ్ ధావన్. ‘‘కష్టాలతో నేసిన కథ.. నిర్బంధంగా అయినా ఈ కథ అందరికీ వినిపించాలి. గాంధీజీ పాటించిన స్వదేశీ మూమెంట్ (మేక్ ఇన్ ఇండియా) అనే పాయింట్‌తో పాటుగా ఓ అద్భుతమైన లవ్ స్టోరీ చెప్పదలుచుకున్నాము’’ అన్నారు అనుష్కశర్మ.

నాకు స్ఫూర్తి ఆ ఇద్దరే

\- వెంకీ కుడుముల


వెంకీ కుడుముల

‘‘నాది ఖమ్మం జిల్లా అశ్వరావుపేట. సినిమాలపై ఆసక్తితో రచయిత బలభద్రపాత్రుని రమణి ద్వారా తేజ గారి వద్ద ‘నీకు నాకు డాష్ డాష్’ సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరా. ఆ తర్వాత ‘అ ఆ’ సినిమాకు త్రివిక్రమ్‌గారి వద్ద దర్శకత్వ శాఖలో పనిచేశా. దర్శకులు త్రివిక్రమ్, పూరి జగన్నాథ్ నాకు స్ఫూర్తి’’ అన్నారు దర్శకుడు వెంకీ కుడుముల. నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా శంకర్ ప్రసాద్ మూల్పూరి సమర్పణలో ఉషా మూల్పూరి నిర్మించిన ‘ఛలో’ ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ –‘‘నాగశౌర్య ‘జాదూగాడు’ సినిమాకు నేను డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసా. నా వర్క్ నచ్చడంతో కథ రెడీ చేసుకురమ్మన్నారు శౌర్య. నేను వినిపించిన ‘ఛలో’ స్టోరీ ఆయనకు నచ్చడంతో సినిమా ప్రారంభమయ్యింది. నన్ను, నా కథను నమ్మి నాగశౌర్య పేరెంట్స్ ఈ సినిమా నిర్మించినందుకు వారికి నా కృతజ్ఞతలు. కన్నడ ‘కిరిక్ పార్టీ’ సినిమా చూశాక రష్మిక హీరోయిన్‌గా కరెక్ట్ అనిపించింది. నాగశౌర్యతో పాటు ఆయన పేరెంట్స్ కూడా ఓకే అనడంతో తనని తీసుకున్నాం. సంగీత దర్శకుడు సాగర్ మణిశర్మగారి అబ్బాయి అని అందరికీ తెలుసు. ‘జాదూగాడు’ టైమ్‌లో నాకు పరిచయమయ్యారు. ‘ఛలో’ సినిమాకు మంచి పాటలిచ్చారు. ఇప్పటి యువ దర్శకులపై త్రివిక్రమ్‌గారి ప్రభావం ఉంటుంది. అయితే ఆయన్ని అనుకరించకూడదు. సినిమా అవుట్‌పుట్ చూశాక టెన్షన్ లేదు. ‘ఛలో’ రిలీజ్ తర్వాత కొత్త సినిమా స్క్రిప్ట్ పనులు ప్రారంభిస్తా’’ అన్నారు.

పోస్టర్ బాగుంది

\- పూరి జగన్నాథ్


పూరి జగన్నాథ్, సిద్ధార్థ్, పూర్ణానంద్, కార్తీక్‌రాజ్

కార్తీక్‌రాజ్, మిస్తీ చక్రవర్తి జంటగా రూపొందిన చిత్రం ‘దీర్ఘ ఆయుష్మాన్ భవ’. పూర్ణానంద్ .ఎం దర్శకత్వంలో ప్రతిమ .జి నిర్మించిన ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ పూరి జగన్నాథ్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా పూరి మాట్లాడుతూ– ‘‘కార్తీక్‌రాజ్ నాకు చాలా రోజులుగా తెలుసు. వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. టైటిల్, పోస్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఈ సినిమాతో కార్తీక్‌కి మంచి గుర్తింపు లభించాలని ఆశిస్తున్నా’’ అన్నారు. ఎం.పూర్ణానంద్ మాట్లాడుతూ– ‘‘ఇప్పటివరకు వచ్చిన ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా తెరకెక్కిన సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ ‘దీర్ఘ ఆయుష్మాన్ భవ’. సినిమా ఆద్యంతం ఫ్రెష్ లుక్‌తో ఉంటుంది. సీనియర్ నటులు కైకాల సత్యనారాయణగారు చాలాకాలం తర్వాత యముడిగా కనిపిస్తారు. ఆయన పాత్ర సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. మార్చిలో సినిమా విడుదల చేయనున్నాం’’ అన్నారు. ‘‘గమ్మత్తైన ప్రేమకథగా పూర్ణానంద్‌గారు ఈ సినిమా రూపొందించారు. వైవిధ్యంగా ఉండే ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది’’ అన్నారు కార్తీక్‌రాజ్.

పేరు.. డబ్బులు రావాలి

\- వినాయక్


వీవీ వినాయక్, కోటి, మాలతి

‘‘ఎందుకో ఏమో’ టైటిల్‌లాగే టీజర్ కూడా చాలా ట్రెండీగా, ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న కోటికి మంచి పేరు, నిర్మాతకు లాభాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఆల్ ది బెస్ట్’’ అన్నారు దర్శకుడు వీవీ వినాయక్. నందు, నోయల్, పునర్నవి ముఖ్య తారలుగా కోటి వద్దినేని దర్శకత్వంలో మాలతి వద్దినేని నిర్మిస్తోన్న సినిమా ‘ఎందుకో ఏమో’. ఈ చిత్రం టీజర్‌ను వినాయక్ విడుదల చేశారు. కోటి వద్దినేని మాట్లాడుతూ– ‘‘ఇదొక ట్రయాంగిల్ లవ్ స్టోరీ. మా నిర్మాత రాజీ పడకుండా, నాకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో అనుకున్నట్టుగా సినిమా తీయగలిగా. సెన్సార్ పనులు జరుగుతున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలో ఆడియో, అదే నెలలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం’’ అన్నారు. ‘‘మంచి లవ్ స్టోరీతో పాటు కమర్షియల్ హంగులు మా సినిమాలో ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుంది’’ అన్నారు మాలతి. ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్, కెమెరా: జీయస్ రాజ్ (మురళి).

నిన్నే చూస్తూ


సుహాసిని, హేమలత, సుమన్

శ్రీకాంత్, హేమలత జంటగా వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై వీఎస్ ఫణీంద్ర దర్శకత్వంలో హేమలతారెడ్డి నిర్మిస్తున్న చిత్రం ‘నిన్నే చూస్తూ’. సుహాసిని, భానుచందర్, సుమన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైంది. ‘‘మా వీరభద్ర క్రియేషన్స్‌పై నిర్మిస్తున్న రెండో చిత్రం ‘నిన్నే చూస్తూ’. సుహాసినిగారు మా సినిమాలో నటిస్తుండటం మా అదృష్టం. సీనియర్ నటులు సుమన్, భానుచందర్ చిత్రబృందంతో కుటుంబసభ్యుల్లా కలిసిపోయారు. అవుట్‌పుట్ బాగా వస్తోంది’’ అన్నారు నిర్మాత హేమలతా రెడ్డి. కిన్నెర, కాశీ విశ్వనాథ్, నిహాల్, వేణు మహేశ్, ఫణి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: రమణ్ రాథోడ్.

పరి పరిశోధన

ఈ చెప్పులకు కాళ్లున్నాయి!



డ్రైవర్లు లేకుండా నడిచే కార్ల గురించి విన్నాం. లారీలూ వచ్చేస్తున్నాయి. విమానాలనూ ఇలాగే నడిపేందుకు ప్రయత్నిస్తున్నారు. మరి చెప్పుల మాటేంటి?
నో ప్రాబ్లెమ్ వాటినీ మనిషి లేకుండానే నడిపించేస్తాం అంటున్నది అంతర్జాతీయ కార్ల తయారీ కంపెనీ నిస్సాన్. అనగా మనిషి లేకపోయినా ఈ చెప్పులు నడుస్తాయన్నమాట. కార్లలో వాడే హైటెక్ ప్రో పైలెట్ టెక్నాలజీని ఈ చెప్పుల్లో వాడటం వల్ల అవి మనిషి లేకపోయినా చెప్పినట్టుగా నడిచి ఒక మూల చేరుకుంటాయి. మనిషి లేకపోయినా ఎలాగైతే పార్కింగ్ స్థలాల్లో కార్లు చక్కగా వాటంతట అవే ఎలా పార్క్ అవుతాయో అలాగే ఈ చెప్పులు కూడా బుద్ధిగా కొలువు తీరుతాయి. సాధారణంగా మీటింగుల సమయాల్లో, ప్రార్థనా స్థలాల బయట చెప్పులు చిందరవందరగా పడి ఉండటం ఆనవాయితీ. ఈ టెక్నాలజీని వాడిన చెప్పులు ఉంటే ఆ చిందరవందర ఉండదు. అవి వరుసగా ఒక పద్ధతిలో సర్దుకుంటాయన్న మాట. చెప్పులకే కాదు గదుల్లో వాడే చిన్న చిన్న వస్తువులకు కూడా ఈ టెక్నాలజీని జోడించడం ద్వారా గదులను సర్దడం చాలా సులువైపోతుందని చెబుతోంది నిస్సాన్ సంస్థ. ర్యోకాన్ అనే సంప్రదాయ జపనీస్ లాడ్జీల్లో ఈ హైటెక్ చెప్పులను ఇప్పటికే వాడేస్తున్నారు. చిన్న చిన్న బల్లలు, వాటి చుట్టూ కూర్చునేందుకు కుషన్లతో ఉండే ఈ రెస్టారెంట్‌లో అతిథులు భోజనం చేస్తుండగానే బయట వదిలేసిన చెప్పులు జతలవారీగా ఒక పద్ధతి ప్రకారం అమరిపోతూంటాయి. భోజనం ముగించుకుని అతిథులు బయటికి రావడం ఆలస్యం.. కుషన్లు, ఇతర పరికరాలు కూడా తమ తమ స్థానాల్లో పొందికగా అమరిపోతాయి.

* * *

కార్లలో వైర్‌లెస్ సెల్‌ఫోన్ ఛార్జింగ్



కార్లు, బస్సుల్లో వైర్‌లెస్ పద్ధతిలో స్మార్ట్ ఫోన్లను ఛార్జ్ చేసుకునేందుకు భారతీయ కంపెనీ ఒక వినూత్నమైన ఆవిష్కరణ చేసింది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న పవర్‌స్క్వేర్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ పరికరంలో ఫోన్‌ను ఉంచితే చాలు, వైర్‌లెస్ పద్ధతిలో దాని బ్యాటరీ ఛార్జ్ అవుతూంటుంది. కనెక్టర్లు, అడాప్టర్ల కోసం వెతుక్కోవాల్సిన పని లేదన్నమాట. వైర్‌లెస్ ఛార్జింగ్‌కు అనుకూలించే ఏ బ్రాండ్ ఫోన్‌నైనా దీంట్లో వినియోగించవచ్చు. డాష్ బోర్డుతోపాటు సెంట్రల్ కన్సోల్; ఆర్మ్‌రెస్ట్‌లలో ఎక్కడైనా బిగించుకునేందుకు ఇది అనువైందని అంటున్నారు కంపెనీ సీఈవో పూడిపెద్ది పవన్. ఛార్జింగ్ కోసం ఉంచిన స్మార్ట్‌ఫోన్‌కు ఏ స్థాయి విద్యుత్తు అవసరమన్నది కూడా ఈ పరికరమే గుర్తిస్తుందని చెప్పారు. సామ్‌సంగ్, ఆపిల్ ఐఫోన్లలోని కొన్ని మోడళ్లలో ఉండే ఫాస్ట్ ఛార్జింగ్ మోడ్‌ను కూడా పసిగట్టి తనంతట తానే 7.5 లేదంటే పదివాట్ల విద్యుత్తును సరఫరా చేస్తుందని, భవిష్యత్తులో ఈ టెక్నాలజీని విద్యుత్తు వాహనాలతో పాటు మిక్సీ, గ్రైండర్, టోస్టర్ వంటి వంటింటి పరికరాలకూ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కాట్రగడ్డ ఆనంద్ తెలిపారు.

* * *

పగడపు దిబ్బలపైనా ప్లాస్టిక్ పడగ



ప్లాస్టిక్ కాలుష్యం... భూమి మీద నీరు మట్టిని మాత్రమే కాకుండా సముద్రాల్లోని పగడపు దిబ్బలపై కూడా దుష్ప్రభావం చూపుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్లాస్టిక్‌తో పాటు పగడపు దిబ్బలకు చేరుతున్న బ్యాక్టీరియా వాటికి ఆరోగ్య సమస్యలు సృష్టిస్తున్నాయని చివరకు వాటిని చంపేస్తున్నాయని కార్లెన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త జోలే లాంబ్ అధ్యయన పూర్వకంగా తెలుసుకున్నారు. ఇండోనేసియా, ఆస్ట్రేలియా, మయన్మార్, థాయ్‌లాండ్ లలో లక్షకుపైగా పగడపు దిబ్బలను పరిశీలించిన తరువాత తాము ఈ అంచనాకు వచ్చామని జోలే చెప్పారు. ప్రాంతాన్ని బట్టి కాలుష్యం తీవ్రత మారిందని, ఇండోనేసియాలో ప్రతి వంద చదరపు అడుగుల దిబ్బకు 26 వరకూ ప్లాస్టిక్ ముక్కలు కనిపించగా.. ఆస్ట్రేలియాలో ఇది ఒకటి కంటే తక్కువగా ఉందని వివరించారు. ఆసియా పసఫిక్ ప్రాంతంలోని పగడపు దీవులు మొత్తం మీద దాదాపు 1110 కోట్ల ప్లాస్టిక్ ముక్కలు ఉన్నట్లు అంచనా. పరిస్థితిని వీలైనంత తొందరగా చక్కదిద్దకపోతే పగడపు దిబ్బలు అంతరించిపోయేందుకు ఎక్కువ సమయం పట్టదని హెచ్చరించారు.

ఇకనైనా బజ్జోమ్మా..!

నిద్రాసమయం



పెద్దల్లో నిద్రలేమి సర్వసాధారణమే. వయసు మళ్లిన వారు వివిధ ఆరోగ్య సమస్యల కారణాల వల్ల నిద్రకు దూరమవుతుంటారు. పని ఒత్తిడి, మానసిక ఆందోళనలు, కుంగుబాటు వంటి కారణాల వల్ల యుక్త వయస్కులు కూడా నిద్రకు దూరమవుతుండటం మామూలే. అభం శుభం తెలియని చిన్నారులు సైతం ఇటీవలి కాలంలో ప్రశాంతమైన నిద్రకు దూరమవుతున్నారు. నిద్రలేమి కారణంగా పలు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు.

స్థూలకాయానికి ఇదే కారణం...

చదువుల్లో పెరిగిన ఒత్తిడి, టీవీలు, కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లకు గంటల తరబడి అతుక్కుపోయి వీడియో గేమ్స్‌తో గడిపే అలవాటు, ఒంటికి అలసట కలిగించే ఆటపాటలకు అవకాశం లేకపోవడం వంటి పలు కారణాలు చిన్నారులను నిద్రకు దూరం చేస్తున్నాయి. అవసరమైన సమయం కంటే తక్కువ సేపు నిద్రపోయే చిన్నారులు త్వరగా వయసుకు మించి బరువు పెరుగుతున్నారని వర్జీనియా కామన్‌వెల్త యూనివర్సిటీ శాస్త్రవేత్తలు నిర్వహించిన తాజా పరిశోధనలో తేలింది. నాలుగు నుంచి పన్నెండేళ్ల లోపు వయసు గల 120 మంది పిల్లలపై నెలల తరబడి నిర్వహించిన అధ్యయనంలో ఈ అంశాన్ని గుర్తించినట్లు ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ బెర్నార్డ్ ఫ్యూమలర్ వెల్లడించారు. పిల్లల్లో స్థూలకాయానికి కొవ్వులతో నిండిన జంక్‌ఫుడ్, తీపి పదార్థాలనే అంతా నిందిస్తారు. చిన్నారులు స్థూలకాయం బారినపడటానికి ఇవి ప్రధాన కారణాలే అయినప్పటికీ నిద్రలేమి కూడా ఇందుకు కారణమవుతోందని ఆయన తెలిపారు. నిద్రలేమికి గురైన పిల్లల్లో జీవక్రియలు మందగిస్తాయని, ఫలితంగా వారు త్వరగా బరువు పెరిగిపోతారని వివరించారు. పిల్లలు వేళకు నిద్రపోయేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వారు తగినంత సమయం నిద్రపోలేకపోతుంటే ఆలస్యం చేయకుండా వైద్యుల సహాయం తీసుకోవాలని ప్రొఫెసర్ ఫ్యూమలర్ సూచిస్తున్నారు.

మానసిక సమస్యలకూ మూలం...

నిద్రలేమి కారణంగా స్థూలకాయం, దాని ద్వారా తలెత్తే శారీరక సమస్యలతో పాటు పిల్లల్లో మానసిక సమస్యలు కూడా తలెత్తుతాయని కూడా ఇటీవలి పరిశోధనలు చెబుతున్నాయి. తగినంత నిద్రకు దూరమైన చిన్నారుల్లో ప్రవర్తనాపరమైన రుగ్మతలను గుర్తించినట్లు సిన్సినాటీ చిల్డ్రన్స్ హాస్పిటల్ మెడికల్ సెంటర్‌లోని న్యూరోసైకాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ డీన్ బీబె తెలిపారు. నిద్రలేమితో బాధపడే పిల్లల్లో దుడుకు ప్రవర్తన, కుదురుగా ఉండలేకపోవడం వంటి సమస్యలు తరచుగా కనిపిస్తాయని ఆయన చెప్పారు. దీర్ఘకాలం నిద్రలేమితో బాధపడే పిల్లలు ఏకాగ్రత కోల్పోయి, చదువు సంధ్యల్లో వెనుకబడతారని వివరించారు.9

ఏ వయసు చిన్నారులకు ఎంత నిద్ర అవసరం?

పిల్లల వయసు	నిద్రపోవాల్సిన సమయం
3 నెలల నుంచి 1 సంవత్సరం	14–15 గంటలు
1 నుంచి 3 సంవత్సరాలు	12–14 గంటలు
4 నుంచి 5 సంవత్సరాలు	11–12 గంటలు
6 నుంచి 12 సంవత్సరాలు	10–11 గంటలు

పిల్లలు చక్కగా నిద్రపోవాలంటే...?

పిల్లలు చక్కగా నిద్రపోవాలంటే తల్లిదండ్రులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫిలడెల్ఫియా చిల్డ్రన్స్ హాస్పిటల్‌లోని స్లీప్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జోడి మిండెల్ ఈ విషయమై చేసిన సూచనలు ఇవీ...

- రోజూ ఒకే సమయానికి నిద్రపోయేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- పిల్లలు పడుకునే గదిలో తక్కువ కాంతితో ఉండే లైట్లు వెలిగించాలి.
- పిల్లలు నిద్రపోవడానికి కనీసం గంట ముందు ఇంట్లోని టీవీలు, కంప్యూటర్ల వంటివి కట్టేయాలి.
- పిల్లలను పడుకోబెట్టి కథలు, కబుర్లు చెబుతూ వారిని నిద్రపుచ్చాలి.

మమకారం

ఊహూ ఆ అమ్మే కావాలి

ఇద్దరు తల్లులు.. ఇద్దరు బిడ్డలు...
పిల్లలు తారుమారయ్యారు...
తల్లులు కనిపెట్టలేకపోయారు.
తీరా కనిపెట్టాక ఈ వింత జరిగింది.


ప్రతీకాత్మక చిత్రాలు

ఆమె ఒక ముస్లిం యువతి. పేరు రెహానా (పేరు మార్చాం). అసోంలో ఒక చిన్న గ్రామంలో ఉంటోంది. నిండు చూలాలు. నెలలు నిండటంతో మంగోల్డోయ్ ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవడానికి వచ్చింది. అక్కడి వారి నియమానుసారం కేసు షీటులో అన్నీ పూర్తి చేసింది. కాన్పు సులువుగానే అయ్యింది. పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. నర్సు వచ్చి పసిబిడ్డకు స్నానం చేయించడానికి తీసుకువెళ్లింది. శుభ్రంగా ఒళ్లంతా కడిగి, సాన్నం చేయించి, పొడి వస్త్రంలో చుట్టి తీసుకువచ్చి తల్లి దగ్గర పడుకోబెట్టింది. తల్లి ఆ బిడ్డను అక్కున చేర్చుకుని పాలు తాగించి నిద్రపుచ్చింది.

అదే రోజున ప్రభ (పేరు మార్పు చేశాం) అనే బోడో యువతి కూడా అదే ఆసుపత్రిలో కాన్పు కోసం వచ్చింది. ఆమెకు కూడా పండంటి మగబిడ్డ పుట్టాడు. ఆ పసివాడికి కూడా నర్సు స్నానం చేయించి పొడి వస్త్రంలో చుట్టి తల్లికి అప్పచెప్పింది. పిల్లవాడు పాలు తాగి హాయిగా నిద్రపోయాడు.

ఈ ఇద్దరూ హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యి, ఇంటికి వెళ్లారు. ఇద్దరూ ప్రతిరోజూ పసిబిడ్డకు స్నానం చేయించి, బిడ్డకు పాలిచ్చి నిద్ర పుచ్చారు. ఇలా వారం రోజులు గడిచాయి. రోజూ స్నానం చేయిస్తున్నా గమనించని ఆ ముస్లిం అమ్మ, ఆ రోజు బిడ్డను చూసి ఆశ్చర్యపోయింది. తల్లిదండ్రుల పోలికలు లేకుండా ఉన్నాడు బిడ్డ. పోలికలే కాదు, వేరే జాతి పిల్లవాడిలా ఉన్నాడు. ఇలా ఎలా జరిగిందో అర్థం కాలేదు. వెంటనే ఆమె భర్తతో కలిసి ఆసుపత్రికి వెళ్లింది. ఆ రోజు ప్రసవించిన ప్రభ వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుంది.ఆమె ఇంటికి వెళ్లింది.

అక్కడకు వెళ్లిన వెంటనే ప్రభ ఒడిలోని బాబుని చూసింది. ఆశ్చర్యపోయింది. తన పోలికలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. ఆ బిడ్డ తన బిడ్డేనని, ఆసుపత్రిలో బిడ్డలు తారుమారయ్యారని చెప్పింది. ప్రభ అంగీకరించలేదు. ఆ బిడ్డ తమ బిడ్డేనంటూ గట్టిగా ఏడుస్తూ, బిడ్డను గుండెలకు హత్తుకుంది. రెహానా ఎంత చెప్పినా ప్రభ అంగీకరించలేదు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రెహానా న్యాయ పోరాటం చేసింది. ఆ బిడ్డ ఆమె బిడ్డే అని కోర్టు తీర్పు చెప్పింది. న్యాయపరంగా తన బిడ్డను తనకు ఇవ్వమని కోరింది రెహానా. అన్ని రోజులపాటు పాలిచ్చి పెంచిన బిడ్డను ఇవ్వడానికి ప్రభ మనసు అంగీకరించలేదు. అయితే తాను పెంచిన తల్లిని మాత్రమేనని, నవ మాసాలు మోసిన తల్లికే బిడ్డ మీద అధికారం ఉంటుందని చాలాసేపటికి అర్థం చేసుకుంది ప్రభ. తన అజ్ఞానానికి విచారిస్తూ, రెహానా బిడ్డను ఆమెకు ఇవ్వడానికి అంగీకరించింది.

ఇంతవరకు కథ బాగానే ఉంది.

అసలు ఇబ్బందంతా ఇక్కడే వచ్చిపడింది.

ప్రభ తన ఒడిలోని బిడ్డను రెహానాకు అందించబోయింది. ఆ బిడ్డ ప్రభను విడిచిపెట్టలేదు. చీర గట్టిగా పట్టేసుకున్నాడు. రెహానా ఆమె చీర విడిపించి, బిడ్డను తన ఒడిలోకి తీసుకుంది. గుక్క పెట్టి ఏడ్వడం మొదలుపెట్టాడు. ఎవరు ఎంత ఆడించినా ఏడుపు ఆపలేదు. బిడ్డను తన వైపు మళ్లించుకోవడానికి రెహానా ఎంతగానో ప్రయత్నించింది.

ఇదే సంఘటన ప్రభకూ అనుభవమైంది. రెహానా దగ్గర నుంచి తన బిడ్డను తీసుకుని ఎత్తుకుంది. ఆ పిల్లవాడూ గుక్క పట్టి ఏడ్వడం మొదలుపెట్టాడు.

ఇద్దరు తల్లులకు ఏం చేయాలో అర్థం కాలేదు. కన్న పేగు కంటె, పెంచిన మమకారానికి లొంగిపోయారు ఆ పసికందులు. కన్న తల్లి చేతుల నుంచి, పెంచిన తల్లి చేతుల్లోకి వెళ్లగానే ఇద్దరూ ఏడుపు ఆపేశారు. కన్నతల్లిని కాదు, పుట్టిన మరుక్షణం నుంచి పాలిచ్చి పెంచిన తల్లినే కన్నతల్లిగా భావించారు. చిరునవ్వులు చిందించారు. ఆమే తన తల్లి అని గుర్తుపట్టినట్లుగా, ఆ పసిపిల్లలిద్దరూ తల్లులను గట్టిగా పట్టేసుకున్నారు... ''నువ్వే మా అమ్మవు''అన్నట్లుగా ఉంగా ఉంగా అంటూ అమ్మలతో మాట్లాడారు.

చేసేదిలేక ఒకరి కన్న బిడ్డను మరొకరు తమతో తీసుకెళ్లారు. బరువెక్కిన గుండెలకు ఆ పిల్లలను అదుముకున్నారు.

ఇది చాలా వింత, విచిత్ర కథ. సృష్టి అంటే ఇదేనేమో. ఎవరు ఎవరిని పెంచాలో ఆ దేవుడే నిర్ణయించి ఉంటాడు. అందుకే ఒకరు కన్నారు మరొకరు పెంచారు.


వీరిద్దరూ యశోదలే. ఇద్దరూ దేవకీదేవులే!

పీడియాట్రిక్ కౌన్సెలింగ్స్

స్కూల్లో కళ్లు తిరిగి పడిపోతున్నాడు... ఎందుకిలా?

మా అబ్బాయికి తొమ్మిదేళ్లు. ఇటీవల రెండుసార్లు వాడు స్కూల్లో కళ్లు తిరిగిపడిపోయాడు. డాక్టర్‌కు చూపిస్తే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. మా అబ్బాయి సమస్య ఏమిటో చెప్పండి.

- కె. రాంబాబు, నకిరేకల్



మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే మీ అబ్బాయికి ఉన్న కండిషన్‌ను సింకోప్ అనుకోవచ్చు. అంటే ఉన్నట్టుండి అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం అన్నమాట. ఇది ఏ వయసువారిలోనైనా రావచ్చు. పిల్లలు ఇలా పడిపోవడం అన్నది తల్లిదండ్రులకు ఎంతో ఆందోళన కలిగించే విషయమే అయినా ఇది చాలా సాధారణం. అయినప్పటికీ ఇలా జరిగినప్పుడు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు అవసరం. సాధారణంగా కళ్లుతిరిగి పడిపోవడం (వేసోవ్యాగల్), గుండె సమస్యలు (లయ తప్పడం, అయోర్టిక్ స్టెనోసిస్), ఫిట్స్‌లో కొన్ని రకాలు, తీవ్రమైన నొప్పి వంటి అనేక కారణాలతో ఇలా జరగవచ్చు. అయితే మీ అబ్బాయి విషయంలో మామూలుగా కళ్లు తిరగడం (వేసోవ్యాగల్), ఒక్కసారిగా లేవగానే కళ్లు తిరగడం (ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్) వంటి కారణాలతో ఇది జరిగిందేమోనని భావించవచ్చు. అయినప్పటికీ మీరు ఒకసారి మీ పీడియాట్రిక్ నిపుణుడి ఆధ్వర్యంలో ఇలా కళ్లు తిరిగిపడిపోవడానికి గల కారణాలను కనుక్కోడానికి తగిన పరీక్షలు (ఈసీజీ, ఈఈజీ మొదలైనవి) చేయించాలి. ఇలాంటి పిల్లలకు నీళ్లు ఎక్కువగా తాగించడం, బిగుతుగా ఉండే దుస్తులు (ముఖ్యంగా మెడ వద్ద టైట్‌గా ఉన్నవి) తొడగకుండా ఉండటం మంచిది. పిల్లలను పడుకోబెట్టినప్పుడు తలవైపు కాస్త ఎత్తుగా ఉండేలా చేయడం వంటి జాగ్రత్తలతో ఈ సమస్యను చాలావరకు నిరోధించవచ్చు.

ఇంత చిన్న పాపకూ అవాంఛిత రోమాలా...?

మా పాప వయసు ఆరేళ్లు. పాపకు ఒళ్లంతా దాదాపు అంగుళం పొడవున్న వెంట్రుకలు ఉన్నాయి. భవిష్యత్తులో ఇవి మరింత పెరుగుతాయేమోనని భయంగా ఉంది. మా పాప సమస్యకు సరైన చికిత్స వివరించండి.

– సుభద్ర, టెక్కలి

మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే మీ పాపకు హైపర్ ట్రైకోసిస్ అన్న కండిషన్ ఉన్నట్లు అనిపిస్తోంది. అంటే... అవాంఛిత రోమాలు చాలా ఎక్కువగా, శరీరంలో చాలాచోట్ల ఉండటం అన్నమాట. పిల్లల్లో ఈ కండిషన్ చాలా అరుదు. మీరు చెప్పిన కొద్దిపాటి సమాచారంతో మీ పాపకు ఇవే లక్షణాలు కనిపించే హిర్సుటిజమ్ అనే కండిషన్ ఉండేందుకు అవకాశం తక్కువ.

పిల్లల్లో అవాంఛిత రోమాలు ఎక్కువగా ఉంటే... అది దేహంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడం లేదా ఒళ్లంతా ఉండటం, మరి కొందరిలో కొంతకాలం పాటే ఉండటం లేదా కొందరిలో శాశ్వతంగా ఉండటం చూస్తుంటాం. కొందరిలో ఇలా వెంట్రుకలు ఎక్కువగా ఉండటం అన్నది పుట్టుకతోనే (కంజెనిటల్) వచ్చే సమస్య కాగా మరి కొందరిలో మధ్యలో (అక్వైర్‌డ్) రావచ్చు.

కుటుంబంలో వెంట్రుకలు ఎక్కువగా ఉంటే ఆ లక్షణం పిల్లలకూ రావడం (ఫెమీలియల్), జెనెటిక్, కొన్ని రకాల దీర్ఘకాలిక సమస్యలు, దీర్ఘకాలికంగా కొన్ని మందులు వాడటం, ఎండోక్రైన్ సమస్యల వంటివి అవాంఛిత రోమాలకు కారణం. పుట్టుకతోనే వెంట్రుకలు ఎక్కువగా ఉండేవారికి – అవి తొలగించేందుకు శాశ్వత చికిత్స చేయడం అన్నది కొద్దిగా క్లిష్టమైన సమస్యే. ఇలా అవాంఛిత రోమాలు రావడం అన్నది మధ్యలోనే వచ్చే సమస్య (ఉదాహరణకు దీర్ఘకాలికమైన మందులు, ఎండోక్రైన్ సమస్య, ఆహారంలోపాల వల్ల) అయితే, సమస్యకు మూలకారణాన్ని గుర్తించి చికిత్స చేయగలిగితే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

అవాంఛిత రోమాలు కేవలం ఒక విధానం విధానం ద్వారానే పూర్తి తొలగించడం సాధ్యం కాదు. ప్లకింగ్, ఎపిలేషన్, ఎలక్ట్రాలిస్, లేజర్‌థెరపీ వంటి ప్రక్రియలతో వాటిని తీసివేయవచ్చు. అయితే ఎలక్ట్రాలిసిస్, లేజర్ రిమూవల్ వంటి ప్రక్రియలను చిన్న వయసులోనే అనుసరించడం సరికాదు. మీరు ఒకసారి డెర్మటాలజిస్ట్ లేదా కాస్మటాలజిస్ట్‌ను కలిసి మీ పాప అవాంఛిత రోమాలకు ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయేమో అని నిర్ధారణ చేసుకుని, దాని ప్రకారం తగిన చికిత్స తీసుకోవాలి.



డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్, రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

ఫ్యామిలీ డాక్టర్

గుండె రంధ్రాలు అవే పూడుకుపోతాయా...?

మా బాబు పుట్టిన నెల తర్వాత బాగా జలుబుగా ఉన్నట్లు అనిపిస్తే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాం. గుండె లోపల రెండు రంధ్రాలు ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. 'చిన్న వయసు కదా... వాటంతట అవే పూడుకుంటాయి' అన్నారు. మాకు ఆందోళనగా ఉంది. మా బాబు సమస్య నయమవుతుందా? వివరంగా తెలియజేగలరు.

- సంధ్యారాణి, రాజంపేట



మీరు బాబుకు గుండెలో రంధ్రాలున్నాయంటూ చెప్పిన వివరాలను బట్టి చూస్తే మీ బాబుకు ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ (ఏఎస్‌డీ... అంటే గుండె పై గదుల్లోని గోడలో రంధ్రాలు)గాని, వెంట్రిక్యులార్ సెప్టల్ డిఫెక్ట్ (వీఎస్‌డీ... అంటే గుండె కింది గదుల్లోని గోడలో రంధ్రాలు) గాని ఉండవచ్చు. ఇలా గుండె గదుల్లోని గోడలపై రంధ్రాలు ఉన్న సమస్యతో పిల్లలు నీలంగా మారిపోతూ (సైనోసిస్) ఉంటే అలాంటప్పుడు పిల్లలకు తక్షణం శస్త్రచికిత్స తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. మరి కొన్ని సందర్భాల్లో గుండె గదుల గోడలకు రంధ్రాలు ఉండీ, పిల్లలు నీలంగా మారనప్పుడు, శ్వాసకోశానికి సంబంధించిన ఇతరత్రా సమస్యలు ఏవీ లేకుండా తక్షణం శస్త్రచికిత్స అవసరం ఉండకపోవచ్చు. అయితే అలాంటి పిల్లలకు భవిష్యత్తులో ఎలాంటి చికిత్స అవసరమన్నది ఆ రంధ్రాల పరిమాణం, అవి ఉన్న స్థానం మొదలైన అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ రంధ్రాలు వాటంతట అవే మూసుకుపోతాయా లేదా అన్నది కూడా ఆ రంధ్రాల పరిమాణం, అవి ఉన్న స్థానాలను బట్టి ఉంటుంది. ఆ రంధ్రాలు ఉండటం వల్ల వచ్చే ఇతరత్ర సమస్యల (అసోసియేటెడ్ కార్డియాక్ డిఫెక్ట్స్)పైన కూడా ఆధారపడి ఉంటుంది.

గుండె పై గదుల మధ్య ఉన్న గోడకు రంధ్రం ఉన్న పిల్లలకు దాదాపు 60 శాతం నుంచి 70 శాతం మందిలో ఆ రంధ్రాలు వాటంతట అవే మూసుకుపోతాయి. గుండె కింది గదుల్లోని గోడకు రంధ్రం ఉన్న పిల్లలకు దాదాపు 30 శాతం నుంచి 40 మందిల్లోనూ ఆ రంధ్రాలు వాటంతట అవే మూసుకుపోవచ్చు. అలాగని గుండె గోడలకు ఉన్న రంధ్రాలన్నీ వాటంతట అవే మూసుకుపోతాయని చెప్పలేం.

ఇలా గుండె గదుల మధ్య గోడకు రంధ్రాలు ఉన్న పిల్లలకు తరచూ నెమ్ము రావడం చూస్తుంటాం. అలాంటప్పుడు పిల్లలకు తక్షణ చికిత్స అవసరం. మీరు మీ అబ్బాయిని కనీసం ప్రతి ఆర్నెలకు ఒకసారి పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌కు చూపించాలి. ఒకవేళ గుండె గదుల మధ్యనున్న రంధ్రాలు వాటంతట అవే మూసుకోకపోయినా మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య చికిత్స సహాయంతో – శస్త్రచికిత్స లేదా శస్త్రచికిత్స లేకుండానే మందులతో దాదాపు 90 శాతం నుంచి 95 శాతం సక్సెస్‌రేట్‌తో సమర్థంగా చికిత్స చేయడానికి అవకాశం ఉంది. మీరు మీ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌తో ఫాలోఅప్‌లో ఉండండి.

వ్యవసాయం అత్యంత ఉత్కృష్టమైన జీవన విధానం..
ఇదే నిజమైన సంపద, నీతి, ఆనందాల కలపోత!
- థామస్ జఫర్‌సన్, అమెరికా వ్యవస్థాపకుల్లో ఒకరు

సాక్షి

సాగుబడి

'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

శ్రవణ కార్తె : ఫిబ్రవరి 5 వరకు
ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 6 నుంచి

వెలుగులు నింపే 'ఓలిక్' వేరుశనగ!


డా. జనీల

- ఓలిక్ యాసిడ్ 80% ఉండే వేరుశనగ రకాలకు ఇక్రిశాట్ రూపకల్పన
- 2 నెలల నుంచి 9 నెలలకు పెరిగిన వేరుశనగలు, వాటి ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం
- అధిక ఓలిక్ యాసిడ్ ఉండే వేరుశనగలను ఇప్పటి వరకు ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఆహార శుద్ధి పరిశ్రమలు
- ఇక్రిశాట్ వంగడాల అభివృద్ధితో వేరుశనగ రైతులకు పాత వంగడాల కన్నా 15% వరకు అధిక దిగుబడి.. 10% అదనపు ఆదాయం
- ఉత్పత్తిదారుల సంఘాలకు విత్తనాలు ఇస్తాం: ముఖ్య శాస్త్రవేత్త డా. పి. జనీల

వేరుశనగలో అత్యంత మేలైన, మెట్ట ప్రాంత రైతులకు అధిక రాబడిని అందించే రకాలేవి?

ఓలిక్ యాసిడ్ ఎక్కువ శాతం ఉండే రకాలు!

ఎందుకని?..

సాధారణ వేరుశనగలు 2 నెలల్లోనే మెత్తబడి పోతాయి. వీటిలో ఓలిక్ యాసిడ్ 45–50% వరకు ఉండటమే కారణం. కాబట్టి, ఇటు వంటి వేరుశనగలతో వివిధ ఉత్పత్తులను తయారు చేయటం కష్టం.

ఓలిక్ యాసిడ్ 80% వరకు ఉంటే.. 9 నెలల వరకు మెత్తబడి పాడు కాకుండా నిల్వ చేయొచ్చు!

అంతేకాదు.. ఓలిక్ యాసిడ్ ఎక్కువగా ఉండే వేరుశనగలు వినియోగదారుల ఆరోగ్యానికి కూడా అనేక విధాలుగా మేలు చేస్తాయి.

అందుకే.. మన దేశంలో, ఇతర ఆసియా దేశాల్లోని ఆహార శుద్ధి కంపెనీలు ఆస్ట్రేలియా నుంచి ఓలిక్ యాసిడ్ 80% వరకు ఉన్న వేరుశనగలను ప్రతి ఏటా వేలాది టన్నులు దిగుమతి చేసుకుంటున్నాయి.

ఓలిక్ యాసిడ్ ఎక్కువగా ఉండే వేరుశనగ రకాలను మనమే అభివృద్ధి చేసుకోగలిగితే ఎంతబావుంటుందో కదా..? ఆ రకాలు అధిక ఉష్ణోగ్రతను, బెట్టను, తిక్క తెగులు, తుక్కు తెగుళ్లను కూడా సమర్థవంతంగా తట్టుకొనగలిగినవైతే మన రైతులకు మరింత మేలు కదూ?

సరిగ్గా ఏడేళ్ల క్రితం డా. పసుపులేటి జనీలకు ఈ ఆలోచన వచ్చింది. మెదక్ జిల్లా పటాన్‌చెరులోని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధనా సంస్థ(ఇక్రిశాట్)లోని వేరుశనగ వంగడాల అభివృద్ధి విభాగంలో ముఖ్య శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఆమె నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఏడేళ్ల పాటు కొనసాగించిన పరిశోధన సఫలీకృతమైంది. గుజరాత్‌లోని జునాగఢ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని తిరుపతి పరిశోధనా కేంద్రం, ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలెం పరిశోధనా కేంద్రం, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు కూడా ఈ పరిశోధనలో, క్షేత్రప్రయోగాల్లో పాలుపంచుకున్నారు.

జన్యుమార్పిడి విత్తనాలు కావు.. తిరిగి వాడుకోవచ్చు..

ఇక్రిశాట్‌లో డా. జనీల ఆధ్వర్యంలో 2011 నుంచి ఓలిక్ యాసిడ్ అధికంగా ఉండే వంగడాలపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఓలిక్ యాసిడ్ అధికంగా ఉండే అమెరికన్ వంగడం(సనోలిక్95ఆర్)తో స్థానిక వంగడాలను సంకరపరచి 16 కొత్త వంగడాలను రూపొందించారు. జన్యుమార్పిడి పద్ధతులను అనుసరించలేదు. మాలిక్యూలర్ మార్కర్స్‌తోపాటు అనేక సాంకేతికతలను వినియోగించడం ద్వారా సాధారణం కన్నా 3–4 ఏళ్ల ముందుగానే పరిశోధనను తక్కువ ఖర్చుతోనే కొలిక్కి తెచ్చామని డా. జనీల సంతోషంగా చెప్పారు. ఓలిక్ యాసిడ్ 80% వరకు ఉండే ఐ.సి.జి.వి. 03043 అనే రకంతో పాటు మరో రెండు వేరుశనగ వంగడాలు విడుదలకు సిద్ధమయ్యాయి. ఈ రకాలను సాగు చేసే రైతులు తమ పంట నుంచి కొన్ని కాయలను పక్కన పెట్టుకొని తిరిగి విత్తనంగా వాడుకోవచ్చు. స్థానికంగా క్షేత్ర ప్రయోగాలు చేసిన తర్వాత వేరుశనగ విస్తారంగా సాగయ్యే గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో 2017లో ప్రయోగాత్మకంగా సాగు చేయించారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌కు చెందిన నరసింహారెడ్డి తదితర రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటివరకూ రైతులు ఇష్టపడి సాగుచేస్తున్న వేరుశనగ రకాల కన్నా (5–15% నుంచి 84% వరకు) అధిక దిగుబడి వచ్చిందని, ఓలిక్ యాసిడ్ 80% వరకు వచ్చిందని డా. జనీల 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. సాధారణంగా మన వేరుశనగ గింజల్లో 48% వరకూ వచ్చే నూనె దిగుబడి.. ఐ.సి.జి.వి. 03043 రకంలో 53% రావటం విశేషమన్నారు.


ఐ.సి.జి.వి. 03043 రకం వేరుశనగ కాయలు, గింజలు


వేరుశనగ రకాల మధ్య తేడాలను వివరిస్తున్న రైతు నరసింహారెడ్డి

చెట్టుకు 30కి పైగా కాయలున్నాయి..!

పదేళ్లుగా వేరుశనగను సాగు చేస్తున్నా. కె6, టాగ్ 24 రకాలు మచ్చ(తిక్క) తెగులును తట్టుకోవటం లేదు. దిగుబడి 3, 4 క్వింటాళ్లే వస్తున్నది. ఈ ఏడాది ఐ.సి.జి.వి. 03043 రకం సాగు చేశా. మచ్చ తెగులును తట్టుకోవటంతో చేనంతా పచ్చగా ఉంది. ఊడలు ఎక్కువగా వచ్చాయి. 60 రోజుల తర్వాతే ఊడలు వస్తున్నాయి. చెట్టుకు 30కి పైగా కాయలు ఉన్నాయి. 5 నెలల పంట కాలం. ఆకుమచ్చ తెగులు రాలేదు కాబట్టి ఆకు రాల్లేదు. మంచి పశుగ్రాసం కూడా వస్తుంది. తుప్పు తెగులు ఒకటి, రెండు మొక్కలకు తప్ప రాలేదు. 10 రోజుల్లో కాయలు కోస్తాం. బాగా లాభదాయకంగా ఉంటుందనుకుంటున్నా.

- మల్లాయపల్లి నరసింహారెడ్డి (86869 55757),
వేరుశనగ రైతు, శ్రీరంగాపూర్, వనపర్తి జిల్లా

నారాయణ, కె6 కన్నా అధిక దిగుబడి.. ఉత్పత్తిదారుల సంఘాలకు విత్తనాలిస్తాం!

ఈ కొత్త వేరుశనగ వంగడాలను ఆంధ్రప్రదేశ్‌లో సాగు చేయించగా.. నారాయణ రకంతో సమానంగా దిగుబడి వచ్చింది. ఓలిక్ యాసిడ్ 80% వచ్చింది. అధిక ఉష్ణోగ్రతను, బెట్టను, తుప్పు తెగులు, తిక్క తెగులును తట్టుకున్నాయి. తెలంగాణలో కె6 కన్నా మెరుగైన దిగుబడి వచ్చింది. 2018లో కూడా క్షేత్ర స్థాయి ప్రయోగాలు కొనసాగుతాయి. ఆ తర్వాత అధికారికంగా విడుదల అవుతాయి. అయితే, ఈ లోగానే కొంత మేరకు విత్తనోత్పత్తి కోసం వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు, జాతీయ విత్తన సంస్థ(ఎన్.ఎస్.సి.)కు వచ్చే ఖరీఫ్ నాటికి కొత్త విత్తనాలను అందించాలనుకుంటున్నాం.

- డా. పసుపులేటి జనీల (99899 30855),
ముఖ్య శాస్త్రవేత్త, ఇక్రిశాట్, పటాన్‌చెరు, మెదక్ జిల్లా
p.janila@cgiar.org

ఆరోగ్యదాయకం..

ఓలిక్ యాసిడ్ అధికంగా ఉండే వేరుశనగలు వినియోగదారులకు మరింత ఆరోగ్యదాయకమైనవి. ఓలిక్ యాసిడ్ తక్కువగా ఉండే సాధారణ వేరుశనగలు లేదా వాటితో తయారు చేసిన ఆహారోత్పత్తులు రెండు నెలల్లో మెత్తబడుతాయి. కాబట్టి, ఆహార శుద్ధి కర్మాగారాల యాజమాన్యాలు ఆస్ట్రేలియా నుంచి 9 నెలల పాటు నిల్వ సామర్థ్యం కలిగిన, అధిక ఓలిక్ యాసిడ్ ఉండే వేరుశనగలను ఏటా భారీగా దిగుమతి చేసుకుంటున్నాయి. ఇప్పుడు సిద్ధమైన కొత్త వంగడాలు పూర్తిగా సాగులోకి వస్తే ఈ కంపెనీలు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదు. మన దేశంలోని ఆహార శుద్ధి కర్మాగారాలకు ఇంకా ఓలిక్ యాసిడ్ ప్రాధాన్యంపై తగినంత చైతన్యం లేదని ఆమె అన్నారు. వీరిలో చైతన్యం పెంపొందించడంతోపాటు రైతులకు కొత్త వంగడాలను అందిస్తే పరిశ్రమకు, రైతులకు, వినియోగదారులకు కూడా మేలు కలుగుతుంది. ఓలిక్ యాసిడ్ అధికంగా ఉండడం వల్ల వేరుశనగ నూనె వాసన మెరుగ్గా ఉంటుందని, గుండె జబ్బుల నివారణతోపాటు అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు ఒనగూరతాయని ఆమె అన్నారు.

రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు ఆహార శుద్ధి కంపెనీలతో ముందస్తు ఒప్పందాల మేరకు ఈ వంగడాలను సాగు చేయాలని సూచిస్తున్నారు. ఈ వంగడాలను సాగు చేయటం వల్ల రైతులకు అధిక ఉత్పత్తితోపాటు కనీసం 10% అధిక ధర కూడా లభిస్తుందని డా. జనీల చెబుతున్నారు.

గుజరాత్‌లో సుమారు 8 వేల మంది రైతులతో కూడిన ఖేదుత్ ఫుడ్స్ అండ్ ఫీడ్స్ అనే సంస్థ ద్వారా ప్రయోగాత్మకంగా కొత్త వంగడాలను సాగు చేయించారు. మార్కెట్ అవసరాలకు తగినంత నాణ్యత కలిగిన వేరుశనగలను వారు పండించి లబ్ధిపొందుతున్నారని డా. జనీల వివరించారు.

ప్రస్తుతం దేశంలో 48 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగవుతోంది. ఇక్రిశాట్ రూపొందించిన కొత్త వంగడాలు తక్కువ ఎరువులు, పురుగు మందులతోనే మంచి దిగుబడినిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.అత్యధికంగా 40 వరకు ఊడలు వస్తున్నందున ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటాయని చెబుతున్నారు. సేంద్రియ వ్యవసాయదారులు కూడా ఈ వంగడాలను సాగు చేయడం ద్వారా మంచి గిట్టుబాటు ధర పొందడానికి అవకాశం ఉంటుందంటున్నారు.

- పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

ఏటా 18 కోట్ల టన్నుల ఇంటిపంటల దిగుబడి!

అరిజోనా యూనివర్సిటీ తాజా అధ్యయనం



నగరాలు, పట్టణాల్లో ఇళ్ల మధ్య, ఇళ్లపైన ఖాళీ స్థలాల్లో సేంద్రియ ఇంటిపంటలు సాగు చేయటం ప్రపంచమంతటా విస్తరిస్తున్నది. ఇంతకీ పట్టణ, నగర ప్రాంతాల్లో సేంద్రియ ఇంటిపంటల ద్వారా ఏటా ఎంత పంట పండించవచ్చు? దాని విలువ ఎంత??

10 నుంచి 18 కోట్ల టన్నుల ఆహారాన్ని ఉత్పత్తి చేయొచ్చని ఈ ఆహారం విలువ ఏకంగా 8,000 కోట్ల నుంచి 16,000 కోట్ల డాలర్లని అమెరికాకు చెందిన అరిజోనా స్టేట్ యూనివర్సిటీ తాజాగా లెక్క తేల్చింది. ఈ అంశంపై ఇదే తొట్టతొలి సమగ్ర అధ్యయనంగా భావిస్తున్నారు. నేషనల్ సైన్స్ ఫౌండేషన్ ఆర్థిక తోడ్పాటుతో.. ఆహార, వ్యవసాయ సంస్థ గణాంకాలు.. గూగుల్ ఎర్త్ ఇంజిన్ సాంకేతిక సహకారంతో ఈ అధ్యయనం జరిగింది. ఈ అధ్యయనం వివరాలను అమెరికన్ జియోఫిజికల్ యూనియన్‌కు చెందిన 'ఎర్త్ ఫ్యూచర్' జర్నల్ ఇటీవల ప్రచురించింది.

సేంద్రియ ఇంటిపంటల వల్ల ప్రయోజనం చక్కని ఆహారం మాత్రమే కాదండోయ్.. పర్యావరణ సేవలు కూడా భారీగానే అందుతున్నాయి. అంతేకాక, పట్టణాల్లో ఇంటిపంటల చల్లదనం వల్ల ఏటా 1,400–1,500 కోట్ల కిలోవాట్ అవర్స్ మేరకు విద్యుత్తు ఆదా అవుతుంది. లక్ష నుంచి లక్షా 70 వేల టన్నుల నత్రజనిని ప్రతి ఏటా ఇంటిపంటలు మట్టిలో స్థిరీకరిస్తాయి. 4,500–5,700 కోట్ల క్యూబిక్ మీటర్ల మేరకు వర్షపు నీరు వృథాగా కొట్టుకుపోకుండా ఇంటిపంటలు ఒడిసిపట్టగలుగుతాయని అంచనా. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ పర్యావరణ సేవలన్నిటి విలువ ఏకంగా 3,300 కోట్ల డాలర్లట!

4న చీడపీడలు, తెగుళ్లను గుర్తించటం, సేంద్రియ పద్ధతుల్లో నివారణపై శిక్షణ

వివిధ రకాల పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లను గుర్తించటంతోపాటు సేంద్రియ పద్ధతుల్లో నివారణ మార్గాలపై రైతునేస్తం ఫౌండేషన్ గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలో కొర్నెపాడులోని రైతు శిక్షణా కేంద్రంలో ఫిబ్రవరి 4(ఆదివారం)న శిక్షణ ఇవ్వనున్నారు. వ్యవసాయ శాఖ విశ్రాంత అదనపు సంచాలకులు కె. రామచంద్రం, ప్రకృతి వ్యవసాయదారుడు ధర్మారం బాజి రైతులకు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 97053 83666, 0863 22862055 నంబర్లలో సంప్రదించవచ్చు.

రేపు మహానందిలో ఒంగోలు పశువుల వేలం

శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన కర్నూలు జిల్లా మహానందిలోని పరిశోధనా స్థానంలో ఈ నెల 31 (బుధవారం)న 57 ఒంగోలు జాతి పశువులను వేలం వేస్తున్నారు. 18 ఆవులు, 7 పెయ్యలు, ఒక ఎద్దు, 12 కోడె దూడలు, 19 దూడలను వేలం వేయనున్నట్లు పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లను తీసుకొని రావాలి. వివరాలకు.. 08514–284523, 79950 08929 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఆస్పత్రిలో అమృతాహారం!



- శ్రీకాకుళం 'రిమ్స్' ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరల సాగు
- రోగుల బంధువులకు ఆ కూరలతోనే అన్నదానం

శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)కి పేరు. దీన్ని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటు చేశారు. ఇది 500 పడకల ఆసుపత్రి. ఇక్కడి రోగులకు ఆసుపత్రి సేవల్లో భాగంగా భోజనం అందుతుంది. వారికి సహాయకులుగా వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం బయట క్యాంటీన్లకు వెళ్లాల్సి వచ్చేది. వారికి కూడా ఆసుపత్రి ప్రాంగణంలోనే భోజనం అందిస్తే బాగుంటుందనే ఆలోచనతో సత్యసాయి సేవాదళ్ ట్రస్టు ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితం ఉచిత నిత్యాన్నదానం ప్రారంభించారు. మధ్యాహ్నం 300–350 మంది వరకూ, రాత్రి పూట 300 మంది వరకూ రుచికరమైన భోజనం అందిస్తున్నారు. ఇందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలనే ఉపయోగిస్తుండటం విశేషం.

రిమ్స్ ప్రాంగణంలో నిత్యాన్నదానం క్యాంటీన్‌లో అన్నంతో పాటు సాంబారు, ఒక కూర, పచ్చడితో అరటిపండు, బొప్పాయి పండ్ల ముక్కలు కూడా అందిస్తున్నారు. తొలుత ఈ క్యాంటీన్‌కు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు మొత్తం బయట మార్కెట్‌లోనే కొనుగోలు చేసేవారు. అలాగా కుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయలైతే రుచికరంగా ఉండటంతో పాటు ఆరోగ్యానికీ మేలైనవనే ఉద్దేశంతో శ్రీకాకుళానికి చెందిన సామాజిక సేవకురాలు పేర్ల అనురాధ చొరవ చూపి కూరగాయల సాగు ప్రారంభించారు. ఇప్పుడు క్యాంటీన్‌లో రోజువారీ అవసరాలకు ఈ ప్రకృతి సాగు తోట నుంచే వెళ్తున్నాయి.



''నిత్యాన్నదానం కోసం కేటాయించిన భవనం వెనుక దాదాపు వెయ్యి గజాల ఖాళీ స్థలం వృథాగా ఉండేది. దీనిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా ప్రకృతి సేద్య విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరల రుచి చాలా బాగుంటుంది. చిన్నప్పటి నుంచి ఇంటి వద్ద కొన్నిరకాల కూరగాయల మొక్కలు పెంచేవాళ్లం. ఆ ఆసక్తితోనే రిమ్స్‌లో ఆ ఖాళీ స్థలం ప్రకృతి సాగు కోసం ఇవ్వాలని జిల్లా కలెక్టరును కోరాం. రెండేళ్ల క్రితం అనుమతి రాగానే బయటి నుంచి సారవంతమైన మట్టి తెప్పించి వేయించాం. పశువుల గెత్తం కూడా వేశాం. తొలుత టమాటా, మునగ, వంకాయలు, పచ్చిమిర్చి సాగు ప్రారంభించాం. తర్వాత ముల్లంగి, దొండ, గోంగూర, కొత్తిమీర.. వేశాం. వాటిలో అత్యధికంగా గోంగూర, కొత్తిమీర రోజువారీ వంటకు సరిపోతోంది. సాంబారులో వాడకానికి కంది కూడా పండిస్తున్నాం.

కరివేపాకు, కొత్తిమీర, గోంగూర పూర్తిగా ఇక్కడిదే వంటకు వినియోగిస్తున్నాం. వీటికి రసాయనిక ఎరువులు వేయలేదు. కేవలం వర్మికంపోస్టు ఎరువు తీసుకొచ్చి వేస్తున్నాం. చీడపీడల సమస్య కూడా కనిపించలేదు. ఎప్పుడైనా కనిపిస్తే దశపత్ర కషాయం, వేపనూనె పిచికారీ చేయిస్తున్నాం. పంటల మధ్యలో బంతి మొక్కలు పెంచడం ద్వారా చీడపీడలను నియంత్రిస్తున్నాం. పచ్చిమిర్చి రోజూ రెండు మూడు కిలోల వరకూ వస్తాయి. వచ్చే వేసవిలో అందుబాటులోకి వచ్చేలా ఇప్పుడు కొన్ని రకాల కూరగాయల మొక్కలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. సాయి భక్తులు కాళీ ప్రసాద్, అన్నపూర్ణ గార్ల సహకారంతో అరటితో పాటు మామిడి, సపోట, ఉసిరి, దానిమ్మ, బొప్పాయి వంటి పండ్ల మొక్కలు పెంచుతున్నాం. సాక్షి 'సాగుబడి'లో వచ్చే కథనాలు, సూచనలు మాకెంతో ఉపయోగపడుతున్నాయి. ఈ స్ఫూర్తితో శ్రీకాకుళంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పూలమొక్కలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే పెంచుతున్నాం. ప్రతిరోజూ పూజలకు వాటి పూలు సరిపోతున్నాయి'' అని అనురాధ చెబుతున్నారు.

- అల్లు సూరిబాబు, సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం
ఫొటోలు: కుప్పిలి జయశంకర్

ఉద్యోగం కన్నా ప్రకృతి సేద్యం మిన్న

- ప్రకృతి సేద్యపద్ధతిలో 4 ఎకరాల్లో పశుగ్రాసం, ఎకరంలో వరి, 15 సెంట్లలో యాపిల్ బెర్ సాగు
- తక్కువ ఖర్చుతో సంతృప్తికరమైన ఆదాయం


రేగుమొక్కల కాయలను పరిశీలిస్తున్న వేణుగోపాలనాయుడు



ఇంటికి దూరంగా వెళ్లి చిన్నా చితకా ఉద్యోగాలు చేయటం కన్నా ఇంటి పట్టునే ఉండి సొంత భూమిలో ప్రకృతి వ్యవసాయం చేసుకోవడమే మిన్న అని భావించాడా యువకుడు. అతని పేరు కె. వేణుగోపాలనాయుడు. విజయనగరం జిల్లా సీతానగరం మండలం కె. సీతారాంపురం గ్రామం అతని స్వస్థలం. వ్యవసాయ కుటుంబానికి చెందిన వేణు మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చేసిన తర్వాత వైజాగ్‌లో ఆర్నెల్లు ఉద్యోగం చేశారు. ఈ లోగా తమ లచ్చయ్యపేటలోని చెరకు ఫ్యాక్టరీ ఆవరణలో సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతులు జరగడంతో తండ్రి రత్నాకర్‌తో కలసి ఆసక్తిగా హాజరయ్యారు. ఆ తర్వాత ఉద్యోగం మానేసి తండ్రికి తోడుగా ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేయాలని వేణు నిర్ణయించుకున్నారు. ఆ విధంగా 9 నెలల క్రితం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 4 ఎకరాల్లో కో–4, కో–3 పశుగ్రాసం, ఎకరంలో వరి, 15 సెంట్లలో యాపిల్ బెర్‌ను సాగు చేయడం ప్రారంభించారు.

పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం నుంచి సహాయం పొందారు. సాళ్ల మధ్య 2.5 అడుగులు, మొక్కల మధ్య అడుగు దూరంలో పశుగ్రాసం నారును 4 నెలల క్రితం నాటారు. వారం, పది రోజులకోసారి స్వయంగా తానే తయారు చేసుకునే జీవామృతాన్ని డ్రిప్ ద్వారా అందిస్తున్నారు. ఎకరంలో పెంచే పశుగ్రాసాన్ని ఇతర రైతులకు చెందిన 8 పాడి పశువులకు పచ్చిమేతగా కిలో రూ.1 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ. 9వేల కౌలు, రూ. 40 వేలను ప్రోత్సాహకంగా అందజేస్తున్నదని తెలిపారు. రెండేళ్ల వరకు ఇలా రైతులకు పచ్చిమేత ఇవ్వాల్సి ఉంటుందని, పదేళ్ల వరకు పచ్చిగడ్డి వస్తూనే ఉంటుందని వేణు తెలిపారు.

తెలిసిన రైతు దగ్గర నుంచి 40 ఆపిల్ బెర్ మొక్కలు తెచ్చి ఎటు చూసినా 8 అడుగుల దూరంలో 15 సెంట్లలో నాటుకున్నారు. తొలి కాపుగా చెట్టుకు 3–5 కిలోల నాణ్యమైన ఆపిల్ బెర్ పండ్ల దిగుబడి వచ్చింది. జీవామృతం క్రమం తప్పకుండా డ్రిప్ ద్వారా ఇస్తున్నారు. పురుగు కనిపించినప్పుడు అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం పిచికారీ చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఈ పండ్లు రుచిగా ఉన్నాయన్నారు. తొలి పంట కాబట్టి అందరికీ పంచిపెట్టానని తెలిపారు.

నీలగిరి మొక్కల వల్ల పొలం పాడవుతున్నదని గ్రహించి, ఆ మొక్కలను పీకించి చెరువు మట్టి తోలించారు. ఎకరంలో వరిని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ప్రకృతి సేద్యంలో తొలి పంట కావడంతో 18 (80 కిలోలు) బస్తాల ధాన్యం దిగుబడి వచ్చిందని వేణు తెలిపారు. ఇతరులు ఎరువులు, పురుగుమందులకు ఎకరానికి రూ. 7–8 వేలు ఖర్చు చేశారని, తనకు రూ. వెయ్యి వరకు ఖర్చయిందని తెలిపారు. మొత్తం మీద ప్రకృతి వ్యవసాయం తొలి ఏడాది కూడా తమకు లాభదాయకంగానే ఉందని, ముమ్మందు దిగుబడులు మరింత పెరుగుతాయని భావిస్తున్నట్లు యువ రైతు వేణు(96403 33128) సంతృప్తిగా తెలిపారు.

- పోల కోటేశ్వరరావు, సాక్షి, సీతానగరం, విజయనగరం జిల్లా

గిరిజనులను మోసం చేస్తున్న చంద్రబాబు

గిరిజన సంఘాల నేతల మండిపాటు



బోయలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ నినాదాలు చేస్తున్న గిరిజన సంఘం నేతలు

నెహ్రూనగర్ (గుంటూరు): గిరిజనులకు సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు మండిపడ్డారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ సోమవారం బోయ ఎస్టీ జాబితా వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ ముడావత్ విష్ణునాయక్ ఆధ్వర్యంలో గుంటూరు ఉల్ఫ్ హాలు గ్రౌండ్‌లో గిరిజన మహా శంఖారావం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణునాయక్ మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేసిందని, గిరిజనులకు అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానన్న పవన్‌కల్యాణ్ తెలుగుదేశంతో చేతులు కలిపి ప్రశ్నించడం మానేశారని ధ్వజమెత్తారు. గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడా సురేష్ మాట్లాడుతూ.. మైదాన ప్రాంతంలోని బోయలు, ఏజెన్సీలోని వాల్మీకులు ఒకటి కాదన్నారు. 35 తెగల గిరిజన జనాభా 37 లక్షలైతే.. బోయల జనాభా 30 లక్షలు పైగానే ఉన్నారని.. ఏ విధంగా బోయలు అంతరించిపోతున్నారని ప్రశ్నించారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే ఆలోచనను విరమించుకోవాలని, లేని పక్షంలో గిరిజనుల ఆగ్రహానికి బలికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన హక్కుల పోరాట సమితి చైర్మన్ మాదిగాని గురునాథం తదితరులు పాల్గొన్నారు.

చెన్నై ఎయిర్‌పోర్టులో విజయవాడ యువకుడి ఆత్మహత్య

అన్నానగర్ (చెన్నై): విజయవాడకి చెందిన యువకుడు చెన్నై విమానాశ్రయం బ్రిడ్జిపై నుంచి దూకి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నై విమానాశ్రయానికి ప్రయాణికులు వచ్చే ప్రాంతంలో సోమవారం ఉదయం 6:45 సమయంలో విజయవాడ న్యూగిరిపురానికి చెందిన చైతన్య (28) నిలబడి చాలా సేపు ఫోన్ మాట్లాడాడు. ఈ ప్రాంతంలో కారు, బైకు వంటి వాహనాలు వెళ్లడానికి 50 అడుగుల ఎత్తైన వంతెన ఉంటుంది. దీనిపై నుంచి ఆ యువకుడు హఠాత్తుగా కిందకు దూకేయడంతో తీవ్రంగా గాయపడి ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న విమానాశ్రయ పోలీసులు అక్కడికి వచ్చి యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టానికి క్రోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేయగా బ్రిడ్జ్ నుంచి కిందకు దూకిన యువకుడి పేరు,చిరునామా తెలిసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిత్రధర్మాన్ని భేషుగ్గా పాటిస్తున్నాం

దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ మిత్ర ధర్మాన్ని పాటిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి పి.మాణిక్యాలరావు చెప్పారు. సోమవారం ఆయన సచివాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. తాము భేషుగ్గా మిత్రధర్మాన్ని పాటిస్తున్నామనేది టీడీపీ వారికి ఈపాటికే తెలిసే ఉంటుందన్నారు. విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో తాంత్రిక పూజలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ పూర్తయిందన్నారు. తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే టీటీడీ కమిటీని వేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అలాగే ప్రస్తుతం దేవాదాయ, ధర్మాదాయ శాఖగా ఉన్న పేరును 'దేవదాయ, ధర్మదాయ శాఖ'గా మారుస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలి: వీర్రాజు



ఉక్కునగరం: విశాఖ ఉక్కు పరిశ్రమకు పెట్టుబడుల ఉపసంహరణ కానివ్వకుండా అడ్డుకుంటామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉక్కుహౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదన 2012లో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వానిదన్నారు. కోట్లాది రూపాయలు ట్యాక్స్ రూపేణా ప్రభుత్వానికి చెల్లిస్తూ, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో స్టీల్ బీఎంఎస్ నాయకులు కొమ్మినేని శ్రీనివాస్, ఎస్.రాధాకృష్ణన్, వెన్నా శ్రీరామ్మూర్తి, బంగార్రాజు, బీజేపీ నేత నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

'వెలిగొండ' పనులకు బ్రేక్

బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపేసిన అధికారులు

సాక్షి, అమరావతి: నత్తనడకన సాగుతున్న వెలిగొండ ప్రాజెక్టు తవ్వకం పనులు సోమవారం పూర్తిగా నిలిచిపోయాయి. రూ.ఏడు కోట్లకుపైగా బకాయిలు చెల్లించకపోవడంతో ఎస్పీడీసీఎల్(దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఒకటో సొరంగానికి చెందిన కాంట్రాక్టర్ రూ.4 కోట్లు, రెండో సొరంగం కాంట్రాక్టర్ రూ.మూడు కోట్లకుపైగా ఎస్పీడీసీఎల్‌కు బకాయిపడ్డారు. ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా కాంట్రాక్టర్లు స్పందించకపోవడంతో ప్రకాశం జిల్లా ఎస్పీడీసీఎల్ అధికారులు సోమవారం ఉదయం 9.30కు వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల వద్దకు చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపేశారు. సోమవారం సాయంత్రానికి ఒకటో సొరంగం కాంట్రాక్టర్ రూ.కోటి చెల్లించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రెండో సొరంగం కాంట్రాక్టర్ మాత్రం స్పందించకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి.

డ్వాక్రా సంఘాలకు రూ.1,939 కోట్లు

సాక్షి, అమరావతి: డ్వాక్రా మహిళా సంఘాలకు మూడో విడత నగదు కింద రూ.1,939 కోట్లను విడుదల చేస్తూ పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పెట్టుబడి నిధి పథకంలో భాగంగా ఈ నిధులను ఆయా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిపారు. ఇందుకు బడ్జెట్‌లో రూ.798.85 కోట్లు కేటాయించగా, మరో రూ.1,140.41 కోట్లు అదనంగా విడుదల చేసేందుకు అనుమతిస్తున్నట్టు పేర్కొన్నారు.

మంచినీటి శుద్ధి ప్లాంట్లకు రూ.402 కోట్లు: ఎన్టీఆర్ సుజల పథకం కింద మంచినీటి శుద్ధి ప్లాంట్ల కోసం రూ.402 కోట్లు ఖర్చు చేసేందుకు అనుమతిస్తూ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి, విజయనగరం జిల్లాలు మినహా మిగిలిన 11 జిల్లాల్లోని 46 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 103 మంచినీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

బడ్జెట్‌పై సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

ఏపీ స్టేట్ ప్లానింగ్ బోర్డు సభ్య కార్యదర్శి గంగయ్య



సూర్యారావుపేట (విజయవాడ సెంట్రల్): సెంటర్ ఫర్ రూరల్ స్టడీస్ అండ్ డెవలప్‌మెంట్(సీఆర్‌ఎస్‌డీ), ఏపీ బడ్జెట్ సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా సహకారంతో సోమవారం విజయవాడలో 'ప్రీ బడ్జెట్ కన్సల్టేషన్ ఆన్ ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2018–19'పై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ప్రజా పర్యవేక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు సత్యబాబు బోస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏపీ స్టేట్ ప్లానింగ్ బోర్డు సభ్య కార్యదర్శి డా.గంగయ్య మాట్లాడుతూ.. ఏపీ బడ్జెట్ సెంటర్, సీఆర్‌ఎస్‌డీ ఇలాంటి సదస్సులు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. సదస్సులో వెల్లడయ్యే సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్, సీఆర్‌ఎస్‌డీ అధ్యక్షురాలు హెల్డీగ్రేస్, ఏపీ బడ్జెట్ సెంటర్ కో ఆర్డినేటర్ డేవిడ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'దేవాదాయ'లోనూ అనారోగ్య కారుణ్య నియామకాలు

సాక్షి, అమరావతి: దేవాదాయ శాఖలోనూ అనారోగ్య కారుణ్య నియామకాలకు అనుమతిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్‌మోహన్‌సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతూ శాఖలో పనిచేసే ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే, వారి స్థానంలో భార్య/భర్త లేకుంటే పిల్లలకు ఉద్యోగం కల్పించేందుకు వీలు కల్పించారు. దేవాదాయ శాఖ పర్మినెంట్ (పూర్తి స్థాయి) ఉద్యోగులుగా గుర్తించిన వారే ఇందుకు అర్హులని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే ధార్మిక, పరిపాలన ఉద్యోగులూ అర్హులేనన్నారు. ప్రత్యేకించి ఆలయంలో ఖాళీ ఉన్నప్పుడే అక్కడ అనారోగ్య కారుణ నియామకానికి అనుమతిస్తారు.

కృష్ణా బొట్టు.. నానాటికీ తీసికట్టు!



- ఈ ఏడాది ఒక్క చుక్క కూడా సముద్రంలో కలవని వైనం
- గత పదేళ్లలో ఇప్పుడే కనిష్ఠ నీటి లభ్యత
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమలైతే 50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎడారే!
- 'గోదావరి'లోనూ అల్ప వర్షపాతంతో ఈసారి తగ్గిన నీటి లభ్యత

గత పదేళ్లలో సముద్రంలోకి విడుదల చేసిన జలాలు
(జూన్ 1 నుంచి అక్టోబరు 6 వరకూ) (టీఎంసీల్లో)

సంవత్సరం	ధవళేశ్వరం నుంచి గోదావరి జలాలు	ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా జలాలు	గొట్టా బ్యారేజీ నుంచి వంశధార జలాలు
2008	1767.85	277.997	85.697
2009	700.412	285.026	60.139
2010	3683.537	274.076	47.559
2011	1495.068	208.994	39.815
2012	2704.919	30.381	37.260
2013	5033.330	232.628	44.669
2014	1836.796	56.398	115.687
2015	1543.945	9.259	24.116
2016	2512.789	52.863	27.374
2017	1021.679	00	85.884

సాక్షి, అమరావతి

బిరబిరా పరుగులెడుతూ తెలుగు నేలను సుభిక్షం చేస్తూ సముద్రం వైపు పరుగెత్తాల్సిన కృష్ణమ్మ కళ తప్పింది. చరిత్రలో తొలిసారిగా తెలుగు రాష్ట్రాల పరిధిలో కనిష్ఠ నీటి లభ్యత నమోదైంది. దీంతో ఈ ఏడాది కృష్ణా నది నుంచి ఒక్క నీటి చుక్క కూడా సముద్రానికి చేరలేదు సరికదా.. ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణమ్మ జీవం కోల్పోయింది. మరోవైపు, గోదావరి నదిలోనూ 2009 తర్వాత మళ్లీ ఇప్పుడు కనిష్ఠ నీటి లభ్యత నమోదైంది. ఈ రెండింటితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తరాంధ్రలోని వంశధారలో నీటి లభ్యత కొంత మెరుగ్గా ఉంది.

'ఆల్మట్టి' పెంచితే మరిన్ని కష్టాలు

కర్ణాటకలోని ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచితే కృష్ణాలో నీటి లభ్యత మరింత తగ్గి తెలుగు రాష్ట్రాల్లోని నదీ పరివాహక ప్రాంతంలో 50 లక్షల ఎకరాల ఆయకట్టు బంజరుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నదీ జలాల్లో 811 టీఎంసీలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, కృష్ణా డెల్టాలో మొత్తం 50 లక్షల ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది. కేటాయించిన మేరకు నీటి లభ్యత ఉంటే ఆయకట్టులో పంటల సాగుకు ఢోకా ఉండదు. కానీ.. కృష్ణా నదిలో నీటి లభ్యత నానాటికీ తగ్గిపోతూ వస్తోంది. ఈ ఏడాది బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన మేరకు తెలుగు రాష్ట్రాలకు కృష్ణాజలాలు చేరలేదు. ఇప్పటివరకూ ఇరు రాష్ట్రాలు 354.96 టీఎంసీల కృష్ణా జలాలను మాత్రమే వినియోగించుకున్నాయి. ఇంకా 512 టీఎంసీల కొరత ఉంది. కృష్ణా నదికి భారీ వరద రాకపోవడం.. నాగార్జునసాగర్ దిగువన నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో పులిచింతల ప్రాజెక్టులోకి అరకొరగానే నీళ్లు చేరాయి. వరద లేకపోవడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు చుక్కనీరు కూడా ఈ సీజన్‌లో విడుదల చేయలేదు. దాంతో ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణమ్మ జీవకళ తప్పింది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును అమలుచేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీచేస్తే కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంచడానికి మార్గం సుగమం అవుతుంది. దాంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రవహించే కృష్ణా నదిలో నీటి లభ్యత మరింత తగ్గిపోయే అవకాశం ఉంది. దీనివల్ల రెండు రాష్ట్రాల్లో 50 లక్షల ఎకరాల ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకం అవుతుంది.

ఎగువ రాష్ట్రాలే కారణం

ఇదిలా ఉంటే, ఏటా సగటున 3000 నుంచి 3500 టీఎంసీల గోదావరి జలాలు ధవళేశ్వరం బ్యారేజీ మీదుగా సముద్రంలో కలుస్తాయి. కానీ, ఈ ఏడాది ఇప్పటివరకూ సముద్రంలో కలిసిన గోదావరి జలాలు కేవలం 1021.679 టీఎంసీలే. 2009 తర్వాత ఈ ఏడాదే గోదావరి నదిలో నీటి లభ్యత కనిష్ఠగా నమోదవడం గమనార్హం. కాగా, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిసినా ఈ ఏడాది నీటి లభ్యత తగ్గడానికి ప్రధాన కారణం మహారాష్ట్ర, కర్ణాటకల్లో అనుమతిలేకుండా ప్రాజెక్టులు చేపట్టి.. అడ్డగోలుగా వరద జలాలను మళ్లించడమే. గోదావరిలో నీటి లభ్యత తగ్గడానికి ప్రధాన కారణం.. ఆ నదీ పరివాహక ప్రాంతంలో గత ఏడేళ్లతో పోల్చితే ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడమే. మరోవైపు.. ఉత్తరాంధ్ర జీవనాడి అయిన వంశధార నదిలో మాత్రం నీటి లభ్యత మెరుగ్గా ఉంది. గతేడాది కన్నా ఈ ఏడాది 100% అధికంగా వంశధార జలాలు గొట్టా బ్యారేజీ నుంచి సముద్రంలో కలవడం గమనార్హం.

నిరీక్షణకు నిర్లక్ష్యమే శాపం

- ఉద్యోగం వచ్చినా చేరలేని దైన్యంలో 1999 గ్రూప్–2 అభ్యర్థులు
- ఉద్యోగం వచ్చినట్టు సమాచారం తెలియకపోవడమే కారణం
- ఈవోపీఆర్‌డీ పోస్టులకు 16 మందికి చేరని సమాచారం

సాక్షి, అమరావతి: లక్షలమంది అభ్యర్థులు పోటీ పడే గ్రూప్–2కు ఎంత పోటీ ఉంటుందో తెలిసిందే. అభ్యర్థులు కష్టపడి పరీక్షల్లో పాసయ్యాక.. ఉద్యోగమొచ్చినట్టు వారి చిరునామాకు కాల్ లెటర్ పంపడానికి వారి దరఖాస్తులు కనిపించలేదంటే సంబంధిత అధికారుల నిర్లక్ష్యాన్ని ఏమనాలి? ఇంత కష్టపడి ఉద్యోగం సాధించినట్టు అభ్యర్థులకు తెలియకపోతే ఎంత దారుణం? ఇదే జరిగింది. వివరాల్లోకెళ్తే.. 1999లో గ్రూప్–2 నోటిఫికేషన్ వెలువడింది. ఎన్నో అవాంతరాల తర్వాత మార్చి 2017లో ఎంపికైనవారి జాబితాను ప్రకటించారు. పంచాయతీరాజ్ శాఖలో గెజిటెడ్ అధికారి హోదాలో ఈవోపీఆర్‌డీ పోస్టులకు 46 మంది ఎంపికయ్యారు. అయితే అధికారులు 29 మందికి మాత్రమే కాల్ లెటర్లు పంపారు. మరో 16 మంది దరఖాస్తులు కనిపించడం లేదంటూ వారికి ఉద్యోగం వచ్చినట్టు కనీసం సమాచారం కూడా పంపలేదు. కనీసం పత్రికా ప్రకటన రూపంలోనైనా తెలియజేసే ప్రయత్నం చేయకుండా అధికారులు మిన్నకుండిపోయారు. ఆ బాధ్యత మాది కాదు.. పరీక్ష నిర్వహించిన ఏపీపీఎస్సీదని ఒకరు.. పంచాయతీరాజ్ శాఖే చూసుకోవాలని మరొకరు.. బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారు. 1999 గ్రూప్–2కు సంబంధించి 18 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఫలితాలు వెలువడ్డా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభ్యర్థులు నష్టపోతున్నారు.

1999.. 2005.. 2017

1999 గ్రూప్–2 నోటిఫికేషన్‌లో భాగంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు జోన్ల పరిధిలో 46 ఈవోపీఆర్‌డీ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించారు. పరీక్ష, ఇంటర్వ్యూలు పూర్తై ఫలితాలు వెలువడ్డాక 2005లో 46 మందిని అప్పటి ప్రభుత్వం ఉద్యోగాల్లో నియమించింది. అయితే, ఈ పరీక్ష ఫలితాలపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం పాత అర్హుల జాబితాల్లో మార్పులు చేసి కొత్త జాబితాను ప్రకటించాలంటూ ఏపీపీఎస్సీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ మేరకు 46 ఈవోపీఆర్‌డీ పోస్టులకు పాత వారి స్థానంలో కొత్త అర్హుల జాబితాను రూపొందించి 2017 సెప్టెంబర్‌లో పంచాయతీరాజ్ శాఖకు అందజేసింది. తొలి జాబితాలో ఉద్యోగాలు పొందిన పలువురు మలివిడతలో ఉద్యోగాలను కోల్పోగా, తొలి జాబితాలో ఉద్యోగం పొందని కొందరికి కొత్తగా ఉద్యోగ అవకాశం దక్కింది.

అధికారుల నిర్లక్ష్యం

ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాతోపాటు వారి బయోడేటాలను సైతం ఏపీపీఎస్సీ ఆయా శాఖలకు పంపాల్సి ఉంటుంది. అందుకనుగుణంగా ఆయా శాఖలు అర్హులకు సమాచారమిచ్చి నియామకాలను పూర్తి చేస్తుంటాయి. అయితే, 46 మందిలో కేవలం 29 మంది అభ్యర్థుల బయోడేటాలను మాత్రమే పంచాయతీరాజ్ శాఖకు ఏపీపీఎస్సీ అందించింది. వీరు గతేడాది సెప్టెంబర్‌లోనే బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగం వచ్చినట్టు సమాచారం ఇవ్వడానికి మిగిలిన 17 మంది బయోడేటా ఇవ్వాలంటూ ఏపీపీఎస్సీని కోరినప్పటికీ తమ వద్ద అందుబాటులో లేవంటూ వారి నుంచి సమాచారమొచ్చిందని పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఎంపికైన అభ్యర్థుల చిరునామాలు తెలియకుండా తామెవరికి సమాచారం ఇస్తామంటూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు అంటున్నారు. కాగా, ఈ 17 మందిలో ఒక అభ్యర్థి సమాచారం తెలుసుకొని 15 రోజుల క్రితం ఏపీపీఎస్సీని సంప్రదించడంతో అతనికి ఉద్యోగం ఇచ్చినట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెప్పారు. చిరునామాలు లభించని మిగిలిన 16 మందిలో ఇద్దరు ముగ్గురు తొలి జాబితాలో వేరొక శాఖలో ఉద్యోగంలో చేరి ఉండొచ్చుని, తక్కినవారిలో ఎక్కువ మంది నిరుద్యోగులే ఉండొచ్చని అధికారులంటున్నారు. కాగా, ఈ విషయంపై ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయభాస్కర్‌ను వివరణ కోరగా.. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రివైజ్డ్ అర్హుల జాబితాతో తమ దగ్గర అందుబాటులో ఉన్న డేటా వివరాలను కలిపి ఆయా శాఖలకు పంపామని చెప్పారు. ఆ శాఖలే తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో తెలుగు రాష్ట్రాల ముందంజ

- తెలంగాణ, ఏపీల్లో 30.9 శాతం వృద్ధి
- జాతీయ సగటు 18 శాతమే
- రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది వసూళ్ల లక్ష్యం రూ.50 వేల కోట్లు
- ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎస్.పి.చౌదరి

సాక్షి, హైదరాబాద్: ప్రత్యక్ష పన్ను వసూళ్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దూసుకు పోతున్నాయని, జాతీయ స్థాయిలో పన్ను వసూళ్ల వృద్ధి 18 శాతం ఉంటే, ఈ రెండు రాష్ట్రాల్లో కలిపి 30.9 శాతం నమోదయిందని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎస్.పి.చౌదరి చెప్పారు. రెండు రాష్ట్రాలు పన్ను వసూళ్లలో పోటీపడి ముందుకెళుతున్నామని, రాష్ట్రాల అభివృద్ధికి ఇదో ఉదాహరణ అని అన్నారు. ఈ ఏడాది రెండు రాష్ట్రాల్లో కలిపి రూ.50 వేల కోట్ల పన్ను వసూళ్లను లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫెటాప్సీ) ఆధ్వర్యంలో వర్తక, పరిశ్రమ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై చార్టర్డ్ అకౌంటెంట్‌లతో ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడారు. ఆదాయాన్ని పన్ను నుంచి ఎలా మినహాయించాలా అనే కోణం కన్నా... సరైన కారణం లేకుండా పన్ను మినహాయింపులు వ్యాపారులకు ఇవ్వకూడదనే ఆలోచనతో ఫెటాప్సీ ప్రతినిధులు పనిచేయాలని ఎస్.పి.చౌదరి సూచించారు. దేశం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు సంతోషంగా ఉండాలన్నా పన్ను చెల్లింపులు తప్పనిసరని, పన్ను చెల్లించడమంటే జాతి నిర్మాణంలో భాగస్వాములు కావడమేనని ఆయన వ్యాఖ్యానించారు. పన్ను చెల్లింపుదారులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్నుల శాఖ అధికారుల మధ్య వృత్తి పరమైన శత్రుత్వమే తప్ప వ్యక్తిగత శత్రుత్వాలకు తావుండకూడదని అన్నారు. వచ్చే జన్మంటూ ఉంటే తాను చార్టర్డ్ అకౌంటెంట్ కావాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఫెటాప్సీ కో చైర్మన్ రాందేవ్ భుటాడా అధ్యక్షత వహించగా, ఫెటాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యక్షుడు అరుణ్ లుహరుక, ప్రత్యక్షపన్నుల కమిటీ చైర్మన్ సురేశ్ కుమార్‌జైన్, పలువురు ఆదాయపన్ను శాఖ అధికారులు, ఫెటాప్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నా భార్య వేధిస్తోంది..

- అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా
- సూసైడ్ నోట్ రాసి భర్త బలవన్మరణం
- గుంటూరు జిల్లా నరసరావుపేటలో ఘటన



సతీష్‌బాబు (ఫైల్)

నరసరావుపేటటౌన్: 'అమ్మా, నాన్న నన్ను క్షమించండి. ఆత్మహత్య చేసుకోవడం తప్పే.. కానీ తప్పడం లేదు. నా భార్య వేధిస్తోంది. మానసికంగా చచ్చిపోయాను. పరువంతా పోయింది. చట్టాలన్నీ ఆడవాళ్లకే అనుకూలంగా ఉన్నాయి. వాళ్లనే సమర్థిస్తున్నాయి. నా విషయంలో కూడా అదే జరిగింది' అంటూ ఓ భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దచెరువుకు చెందిన మద్దూరి సతీశ్‌బాబు(34)కు నెల్లూరు జిల్లా కట్టుబడివారిపాలెం గ్రామానికి చెందిన రాధతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. సతీశ్ ప్రకాష్‌నగర్‌లోని నరసరావుపేట ఆక్స్‌ఫర్ట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో వివాహమైన 3 నెలలకే రాధ అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు నచ్చచెప్పడంతో కొన్ని నెలల తర్వాత తిరిగి భర్త వద్దకు వచ్చింది. మళ్లీ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో రెండేళ్ల కిందట సతీశ్ పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా.. అతన్ని ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఆ సమయంలో తోడుగా నిలవాల్సిన భార్య మళ్లీ పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పట్నుంచి తిరిగి రాకపోవడంతో సతీశ్ 6 నెలల కిందట న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ప్రస్తుతం కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో 2 నెలల కిందట రాధ తన సోదరులతో కలసి సతీశ్ ఇంటివద్ద ఆందోళనకు దిగింది. భర్తతో కలిసి ఉంటానని చెప్పడంతో పెద్దలు ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. ఆ విషయాన్ని భార్యభర్తలిద్దరూ న్యాయస్థానానికి తెలియజేశారు. అప్పట్నుంచి ఇద్దరూ కలిసే ఉంటున్నారు. మళ్లీ ఇటీవల ఇద్దరి మధ్య గొడవ జరగడంతో రాధ పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన సతీశ్.. తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులు తలుపులు తెరవగా సతీశ్ విగతజీవిగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న సీఐ సురేంద్రబాబు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తన చావుకు భార్య రాధ ఆమె సోదరులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్ కారణమంటూ సతీశ్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి బెదిరింపులు, వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొన్నాడు. కాగా, ఈనెల 18వ తేదీనే సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు గుర్తించారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఉల్లాసం

సీజీఎస్‌టీ చీఫ్ కమిషనర్ వైఎస్ సహారవాత్



కల్చరల్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఉద్యోగులతో చీఫ్ కమిషనర్ వైఎస్ సహారవాత్

నెహ్రూనగర్ (గుంటూరు): మానసిక ఉల్లాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని సీజీఎస్‌టీ చీఫ్ కమిషనర్ వైఎస్ సహారవాత్ తెలిపారు. సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ బోర్డు ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కస్టమ్స్ (సీజీఎస్‌టీ), ఇన్‌కమ్ టాక్స్ ఉద్యోగుల సబ్ జోనల్ కల్చరల్ మీట్– 2018 కార్యక్రమం సోమవారం గుంటూరులోని ఇండియన్ టొబాకో అసోసియేషన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సహారవాత్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో విజేతలు ఫిబ్రవరి 5, 6 తేదీల్లో కొచ్చి (కేరళలో) జరిగే సౌత్ జోనల్ కార్యక్రమంలో ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఫిబ్రవరి 21, 22, 23 తేదీల్లో పుణేలో జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో గుంటూరు జోనల్ సీజీఎస్‌టీ కమిషనర్ శ్రీహరిరావు దశావతార రూపంలో నాట్యం చేసి అలరించారు. ఈ పోటీలకు గుంటూరుకు చెందిన ప్రముఖ నాట్య కళాకారుడు ఖలీల్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. నృత్య ప్రదర్శనలో మొదటి స్థానంలో కమిషనర్ శ్రీహరిరావు, రెండో స్థానంలో ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ వై.లక్ష్మి నిలిచారు. కార్యక్రమంలో కమిషనర్ సుధ, అడిషనల్ కమిషనర్ నాగేంద్రరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆడిట్ చేయించిన పంచాయతీలకే ప్రత్యేక నిధులు

మార్గదర్శకాలపై పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీలకు కేంద్రం అందజేసే నిధులు ఏ అవసరానికి ఎంత ఖర్చు పెట్టారన్న వివరాలను కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక వెబ్‌సైట్‌లో పొందుపరిస్తే ఆ గ్రామ పంచాయతీ పెర్ఫార్మెన్స్ గ్రాంట్ పొందేందుకు అర్హత కలిగి ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. కేంద్రం ఈ ఏడాది పెర్ఫార్మెన్స్ గ్రాంట్ రూపంలో రాష్ట్రానికి రూ. 192 కోట్లు మంజూరు చేయనుంది. ఈ నిధులను నాలుగు ప్రధాన అంశాలలో గ్రామ పంచాయతీల పనితీరు ఆధారంగా ఆయా పంచాయతీలకు కేటాయిస్తారు. ఈమేరకు కొత్త మార్గదర్శకాలపై పంచాయతీరాజ్ శాఖ సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. గ్రామ పంచాయతీ నిధుల జమా ఖర్చులపై ఆడిట్ నివేదిక సమర్పిస్తేనే ఆ గ్రామ పంచాయతీ పెర్ఫార్మెన్స్ గ్రాంట్ నిధుల విడుదలకు అర్హత కలిగి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఏటా గ్రామ అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకొని ఆ మేరకు ప్రగతి పనులు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు అంశాల ఆధారంగా ఆయా గ్రామ పంచాయతీలకు పాయింట్లు కేటాయించి, అత్యధిక పాయింట్లు సాధించిన గ్రామాలకు అధిక నిధులు కేటాయిస్తారు.

రుణభారంతో అన్నదాత ఆత్మహత్య

- 40 రోజులు మృత్యువుతో పోరాడి ఓడిన రైతు
- గుంటూరు జిల్లలో ఘటన



మృతుడు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు (సత్తెనపల్లి) : పంటలు సరిగ్గా పండక.. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేనన్న భయంతో ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. చల్లగుండ్లకు చెందిన రైతు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి (45) తనకున్న మూడెకరాల పొలంతో పాటు మరో ఎనిమిదెకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. బంగారం కుదువ పెట్టి తన భార్య పేరు మీద నకరికల్లులోని స్టేట్ బ్యాంకులో మూడు విడతలుగా 2017లో సుమారు రూ.2లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. మరో రూ.5 లక్షలు తెలిసిన వారి వద్ద ప్రైవేట్‌గా అప్పుగా తీసుకున్నాడు. నాలుగేళ్లుగా సాగర్ నీరు రాకపోవడంతో వరికి బదులు మినుము, కంది, మొక్కజొన్న, శనగ తదితర పంటలు సాగుచేస్తున్నాడు. అయితే, అవి కూడా సక్రమంగా పండకపోవడంతో అప్పు పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో అప్పులు తీర్చలేనన్న బెంగతో తీవ్ర మనస్తాపానికి గురై గత ఏడాది డిసెంబర్ 20న పురుగుమందు తాగాడు. బంధువులు హుటాహుటిన నరసరావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య వెంకట్రావమ్మతో పాటు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరిద్దరూ చదువుకుంటున్నారు. నరసరావుపేట ఆస్పత్రిలో శ్రీనివాసరెడ్డి ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.అనిల్‌కుమార్ తెలిపారు.

ఆయుధాలు కలిగిన ఆరుగురి అరెస్టు



పోలీసుల అదుపులో సైకం, మరో ఐదుగురు

కనిగిరి: ఆయుధాలతో వెళ్లి ప్రజల్ని భయాందోళనకు గురిచేసిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో సోమవారం సైకం రామకృష్ణారెడ్డి మరికొందరితో నిబంధనలకు విరుద్ధంగా వెపన్స్ వాడటంతోపాటు ప్రజల్లోకి గుంపులుగా వెళ్లి వారిని భయాందోళకు గురిచేశారు. దీనిపై భారతీయ ఆయుధాల చట్టం, ఐపీసీ సెక్షన్‌ల కింద రామకృష్ణారెడ్డితోపాటు అతడికి ప్రయివేట్ సెక్యూరిటీగా ఉన్న ఉదయ్ సింగ్, అజ్‌గర్, భైరంరెడ్డి, కోటిరెడ్డి, మాధవరావులను అరెస్ట్ చేసినట్లు సీఐ మరవనేని సుబ్బారావు వెల్లడించారు.

రాష్ట్రంలో మైనారిటీలపై పెరిగిన దాడులు

రాష్ట్ర క్రిస్టియన్ లీడర్స్ ఫోరం కన్వీనర్ ఆలీవర్ రాయ్


సమావేశంలో మాట్లాడుతున్న ఆలీవర్ రాయ్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): టీడీపీ హయాంలో రాష్ట్రంలో మైనారిటీలపై దాడులు పెరిగిపోతున్నాయని రాష్ట్ర క్రిస్టియన్ లీడర్స్ ఫోరం కన్వీనర్ ఆలీవర్ రాయ్ అన్నారు. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఫోరం సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగేళ్లలో చర్చిలు, మతబోధకులపై దాడులు పెరిగాయని చెప్పారు. ఇతర మతాలకు చెందిన ఆచారాలను అందరిపై రుద్దే ప్రయత్నాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. ఈ నెల 28న అధికారికంగా సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించటం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని దీనిపై న్యాయపోరాటానికి సిద్ధపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విధానంలో మార్పు రాని పక్షంలో రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. విశాఖలో శ్మశాన స్థలం కేటాయిస్తామని టీడీపీ గత ఎన్నికల్లో హామీ ఇచ్చిందని..అది నేటికీ నెరవేరలేదని మండిపడ్డారు. ఈ విషయమై త్వరలో నిరాహారదీక్ష చేపట్టాలని తీర్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా సీనియర్ క్రైస్తవ నాయకులు విల్సన్ బాబు, రవిబాబు, రోలండ్ విలియమ్స్, జార్జ్ చీడి, భాస్కర్ రాజు పాల్గొన్నారు.

తల్లి మరణించినా పెన్షన్ డ్రా చేస్తున్న పిల్లలు

పదేళ్లపాటు దాదాపు రూ.10 లక్షలు తీసుకున్న వైనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ. పక్కన నిందితులు

తెనాలి రూరల్: తల్లి మరణించినా తప్పుడు పత్రాలు సమర్పిస్తూ పదేళ్ల నుంచి అక్రమంగా పెన్షన్ తీసుకుంటున్న కుమార్తె, కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి వన్‌టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎం.శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొల్లిపర రుద్రమూర్తి మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 1986లో రిటైరై, 1998లో మరణించారు. దీంతో ఆయన భార్య కొల్లిపర కోట సుబ్బమ్మకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరైంది. పెన్షన్ పొందుతూ 2006లో ఆమె కూడా మృతి చెందింది. అయితే ఆమె కుమారుడు బసవప్రసాద్ లింగం, ఐదో కుమార్తె బదూదరి హైమావతి తల్లి చనిపోయిన విషయాన్ని ట్రెజరీ అధికారులకు తెలియచేయకుండా 2016 వరకు పెన్షన్‌ను తీసుకున్నారు. వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను ఇద్దరూ తయారుచేసి హైదరాబాద్, ఆ పరిసర జిల్లాల్లో అటెస్టేషన్ చేయించారు. దీన్ని తెనాలి సబ్ ట్రెజరీకి పోస్ట్ ద్వారా పంపుతూ సుమారు రూ.9,98,599 వరకు పొందారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ విషయాన్ని ట్రెజరీ అధికారులకు లేఖ ద్వారా తెలియజేయడంతో విషయం బయటకు పొక్కింది. శాఖాపరమైన విచారణ అనంతరం సబ్ ట్రెజరీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ పి.వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

మార్కెట్లోకి అరకు వ్యాలీ కాఫీ పొడి

విడుదల చేసిన మంత్రులు నక్కా ఆనందబాబు, జవహర్

సాక్షి, అమరావతి: అరకు వ్యాలీ ఇన్‌స్టంట్ కాఫీ పొడి ప్యాకెట్లను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్ జవహర్‌లు సోమవారం మార్కెట్లోకి విడుదల చేశారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయం మూడో బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం రామారావు, జీసీసీ ఎండీ రవిప్రకాష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. రెండు గ్రాములు, పది గ్రాముల ఇన్‌స్టంట్ కాఫీ ప్యాకెట్లను మార్కెట్లోకి విడుదల చేశామని, త్వరలోనే అన్ని ప్రాంతాల్లో గిరిజన కార్పొరేషన్ ఔట్‌లెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. జీసీసీకి వచ్చే ఆదాయాన్ని గిరిజన రైతులకు అందజేస్తామన్నారు.

ఎవరెస్ట్ అధిరోహించిన విద్యార్థులకు అభినందన

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న 15 మంది విద్యార్థినీ విద్యార్థులను సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి నక్కా ఆనందబాబు అభినందించారు. వీరు మౌంట్ కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించి గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కారు.

బ్యాంకు ఉన్నతాధికారికి జైలుశిక్ష

విశాఖ లీగల్ : సహోద్యోగిని పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఓ బ్యాంకు అధికారికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ నగరంలోని ఒకటవ అదనపు మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ సుబ్బారెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని ఓ బ్యాంకులో పనిచేసే మహిళా ఉద్యోగి ఒకరు విధులు సరిగ్గా నిర్వహించడంలేదనే ఆరోపణలతో 2008లో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో అదే బ్యాంకులో జోనల్ మేనేజర్ స్థాయి అధికారి ఒకరు తనను మానసికంగా వేధించి అనుచితంగా ప్రవర్తించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష విధించారు.

ఇల్లు కేటాయించి ఆదుకోవాలి


సొంత ఇల్లు లేక నానా అవస్థలు పడుతున్నా. ప్రభుత్వానికి ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా ఇంటి స్థలం కేటాయించలేదు. ఇంటి అద్దె చెల్లించే స్థోమత నాకు లేదు. ప్రభుత్వం ఇల్లు లేదా ఇంటి స్థలం కేటాయించి నాలాంటి పేదలను ఆదుకోవాలి. – దాసరి శేషమ్మ, అమ్మిశెట్టివారి వీధి, ఒంగోలు, ప్రకాశం జిల్లా


కడప నగరానికి చెందిన అఫ్రీన్ నిరుపేద. తనకు ఇల్లు లేదా ఇంటి స్థలం మంజూరు చేయాలంటూ మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పదిసార్లు దరఖాస్తులు ఇచ్చినా ప్రభుత్వం ఇల్లుగానీ, ఇంటి స్థలం గానీ మంజూరు చేయలేదని అఫ్రీన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కర్నూలు జిల్లా దేవరకొండ మండలం కప్పట్రాళ్లకు చెందిన వృద్ధురాలు సంజమ్మ ఇంటి స్థలం కోసం చాలాసార్లు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ప్రభుత్వం కనికరం చూపడం లేదని ఆమె కంటతడి పెట్టుకుంటున్నారు.

నిలువ నీడ కల్పించండి

- ఇళ్ల స్థలాల కోసం పేదల ఎదురుచూపులు
- 7.59 లక్షల దరఖాస్తులకు లభించని మోక్షం
- ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటే 21,359.58 ఎకరాలు కావాలి
- 17,165.16 ఎకరాల ప్రైవేట్ భూమి కొనుగోలు చేయలి
- మొత్తం రూ.5,762 కోట్లు కేటాయించండి
- ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ ప్రతిపాదనలు
- అన్ని నిధులు ఇవ్వలేమంటున్న బీసీ, గిరిజన సంక్షేమ శాఖ

సాక్షి, అమరావతి

తల దాచుకోవడానికి కాసింత గూడు కోసం పేదలు ఆశలు ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులు చేత పట్టుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. దరఖాస్తులకు మోక్షం లభించక కన్నీటి పర్యంతమవుతున్నారు. జనవరి 1వ తేదీ నాటికి ఇళ్ల స్థలాల కోసం వచ్చిన అర్జీల్లో అన్ని అర్హతలు కలిగినవి 6.37 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల జరిగిన 'జన్మభూమి–మాఊరు' కార్యక్రమంలో మరో 1.22 లక్షల అర్జీలు వచ్చాయి. అంటే రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య 7.59 లక్షలకు చేరింది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 1,38,380, పశ్చిమ గోదావరి జిల్లాలో 88,837, విశాఖ జిల్లాలో 78,894 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలంటే 21,359.58 ఎకరాల భూమి అవసరమని అధికారులు తేల్చారు. ప్రభుత్వ భూమి 4,194.42 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉంది. మరో 17,165.16 ఎకరాల ప్రైవేట్ భూమిని కొనుగోలు చేయాల్సి ఉంది.

రూ.5,762 కోట్లు కావాలి

17,165.16 ఎకరాల ప్రైవేట్ భూమి కొనుగోలుకు రూ.5,368.29 కోట్లు అవసరమని రెవెన్యూశాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ భూమిని చదును చేయడం, ప్లాట్లుగా మార్చడానికి మరో రూ.394.34 కోట్లు కావాలి. భూమి కొనుగోలు, అభివృద్ధి కోసం కావాల్సిన సొమ్ము రూ.5,762.63 కోట్లు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి అందిన ప్రతిపాదనలను రెవెన్యూ శాఖ క్రోడీకరించింది. నిధుల కోసం గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలకు ప్రతిపాదనలు పంపింది. అంత పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వడం వీలుకాదని ఆయా శాఖల ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ తేల్చిచెప్పారు.

కబ్జాల వల్లే భూమి కొరత

ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడానికి ప్రధాన కారణం భూ కబ్జాలేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ స్థలాలను అధికార పార్టీ నేతలు స్వాహా చేశారు. రికార్డులను సైతం తారుమారు చేయించారు. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, తూర్పు గోదావరి తదితర జిల్లాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారు.


కడపకు చెందిన అయేషా భర్త మూడేళ్ల క్రితం చనిపోయారు. ఇంటి అద్దె, కుటుంబ పోషణ భారంగా మారింది. సొంత ఇల్లు ఉంటే అద్దె భారమైనా తగ్గుతుందనే ఆశతో ఇల్లు కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కనీసం ఇంటి జాగా ఇస్తే చిన్న పూరిల్లు వేసుకుని బతుకుతానని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా సర్కారు కరుణించడం లేదని అయేషా వాపోతున్నారు.

గోప్యంగా విశాఖ భూకుంభకోణాలు

- విశాఖ సీపీకి నివేదిక సమర్పించిన సిట్
- బయటపెట్టని సిఫార్సులు
- ఆక్రమణదారులు ఎవరో చెప్పని వైనం


సీపీ యోగానంద్‌కు నివేదిక సమర్పిస్తున్న సిట్ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రాన్ని కుదిపేసిన విశాఖ భూ కుంభకోణాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) విచారణ ముగిసింది. మూడువేల పేజీలతో కూడిన ఈ నివేదికను సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్, కమిటీ సభ్యులైన జేసీ జి.సృజన, టీటీడీ జేఈవో పార్థసారథి సోమవారం విశాఖ సీపీ యోగానంద్‌కు అందజేశారు. కాగా, విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు, చేసిన సిఫార్సులను సిట్ బయటపెట్టకుండా గోప్యత ప్రదర్శించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మధురవాడ ప్రాంతంలో రూ.550 కోట్ల విలువైన 60.4 ఎకరాలు, కొమ్మాది ప్రాంతంలో రూ.1641 కోట్ల విలువైన 178.2 ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్టుగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ జి.సృజన ప్రకటించడంతో ఈ భూ వివాదం మొదలైంది. ఆ తర్వాత సుమారు లక్ష ఎకరాలకు సంబంధించిన ఎఫ్ఎంబీలు, విలేజ్ మ్యాప్‌లు గల్లంతయ్యాయంటూ చేసిన ప్రకటనతో మరింత ముదిరింది. దీంతో జూన్ 20న ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. 2875 ఫిర్యాదులు రాగా వాటిలో 333 తమ పరిధిలోకి వచ్చాయని సిట్ ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా 11 ఫిర్యాదులను విచారణకు స్వీకరించారు. వీటితోపాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు 68 ఎన్ఐసీలపై కూడా దర్యాప్తు చేపట్టారు.

చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమే

ఆర్నెళ్లపాటు ఎన్నో డాక్యుమెంట్లు, రికార్డులు పరిశీలించి దర్యాప్తు చేశామని, విచారణ నిష్పక్షపాతంగా సాగిందని సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ చెప్పారు. ప్రతి ఫిర్యాదుపై పక్కా ఆధారాలను సేకరించి, ఆక్రమణదారులపై చర్యలకు సిఫార్సు చేశామన్నారు. వ్యవస్థలో లోపాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఇక చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనని వెల్లడించారు. ఈ సిఫార్సుల అమలుపై ప్రభుత్వం స్పందించాల్సి ఉన్నందున నివేదికలో వివరాలను బహిరంగంగా ప్రకటించలేమని తెలిపారు.

ప్రత్యేక హోదా బ్రహ్మపదార్థం కాదు

ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా బ్రహ్మపదార్థం కాదని, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి దానిని తీసుకొస్తే చూస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్ జవహర్ వ్యాఖ్యానించారు. సోమవారం సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, కేవలం ప్రభుత్వాన్ని తిట్టేందుకే పాదయాత్ర చేస్తున్నారన్నారు. పవన్‌కల్యాణ్ తెలుగుదేశం పార్టీ వాళ్ల ఇళ్లకు ఎందుకు వెళుతున్నారని ప్రశ్నిస్తే తన యాత్రలో వచ్చిన సమస్యలు వివరించేందుకు తెలుగుదేశం పార్టీ వాళ్ల వద్దకు వెళుతున్నారన్నారు. టీడీపీని దళితవాడల్లోకి తీసుకు వెళ్లేందుకు జనవరి 26 నుంచి దళితతేజం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

ముగిసిన బైబిల్ మిషన్ మహోత్సవాలు

బైబిల్ మిషన్ ద్వారా సకల జనులకు శాంతి సందేశం


మహోత్సవాల్లో భక్తుల ప్రార్థనలు

పెదకాకాని (పొన్నూరు): బైబిల్ మిషన్ మహోత్సవాలు సకల జనులకు దీవెనకరంగా మారాయని బైబిల్‌మిషన్ మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మూడు రోజుల బైబిల్‌మిషన్ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. దైవజనులు ఎం.దేవదాసు అయ్యకు బయలుపరచిన 80వ బైబిల్ మిషన్ మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. చివరిరోజు సోమవారం సభలకు బైబిల్ మిషన్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎన్.సత్యానందం అధ్యక్షత వహించారు. మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, ప్రాంత భేదాలు లేకుండా ఒకే పందిరి కింద లక్షలాది మంది భక్తులు ఐక్యతానురాగాలతో మూడు రోజుల పండుగ వాతావరణంలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. మానవ జీవితంలో ఎదురయ్యే కష్టాలు, వైఫల్యాలు అన్నింటినీ ఎదుర్కొనేందుకు క్రీస్తుమార్గమే శరణ్యమన్నారు. అనంతరం మహోత్సవాల నివేదికను సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలను రెవరెండ్ డాక్టర్ ఎన్.యేసురత్నం చేయగా, ముగింపు ప్రార్థనలను రెవరెండ్ డాక్టర్ పీఎం శాంతిరాజు, దీవెనలను రెవరెండ్ డాక్టర్ ఎన్.సత్యానందం, రెవరెండ్ ఎస్.షారోనుకుమార్ అందించారు. స్త్రీల సభల కన్వీనర్ డాక్టర్ జె.ప్రమీలాసెల్వరాజ్ బృందం ఆధ్యాత్మిక క్రైస్తవ భక్తిగీతాలను ఆలపించారు. చివరిరోజు మహోత్సవాలకు స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, జవహర్, విజిలెన్స్ ఎస్పీ శోభామంజరి తదితరులు హాజరయ్యారు.

చేనేత రంగాన్ని పరిరక్షించాలి

ధర్మవరం చేనేత సదస్సులో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్



ధర్మవరం: కళాత్మకమైన చేనేత రంగాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. ధర్మవరం పట్టుచీరలకు గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. సోమవారం ఆయన అనంతపురం జిల్లా ధర్మవరంలో చేనేత సదస్సు నిర్వహించారు. చేనేత కార్మికులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పవన్ మాట్లాడుతూ దేశానికి నాగరికతను నేర్పిన చేనేతలు ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆత్మహత్యలు, వలసలు పెరగడం బాధాకరమన్నారు. ఈ మూడేళ్లలో పదుల సంఖ్యలో చేనేతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ దారిలో.. 'చలోరే చల్'

- అనంతపురం జిల్లాలో పవన్ పర్యటనపై అభిమానుల్లో విస్మయం
- ప్రశ్నిస్తానని వచ్చి టీడీపీకి అనుకూల ప్రసంగాలపై ఆశ్చర్యం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'చలోరే.. చలోరే చల్' పేరుతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మూడు రోజుల అనంతపురం జిల్లా పర్యటనపై స్థానికులు, ఆయన అభిమానులు పెదవి విరుస్తున్నారు. సమస్యల అధ్యయనం కోసం వస్తున్నానని చెప్పి దానికి సంబంధించిన కార్యక్రమాలేవీ చేపట్టకుండానే వెనక్కి తిరగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'అనంత' పర్యటనతో తొలిసారి పూర్తిస్థాయిగా ప్రజల్లోకి వస్తున్నానని పవన్ చెప్పారు. దీంతో ఆయన ఎలాంటి ప్రసంగాలు చేస్తారో.. పార్టీ విధివిధానాలపై ఎలాంటి ప్రకటనలు చేస్తారో అని స్థానికులతో పాటు ఆయన అభిమానులు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా చూశారు. అయితే మూడురోజుల పవన్ పర్యటన చూస్తే ఆయన పంథా ఏంటో చెప్పకనే చెప్పినట్లయిందని వారు అంటున్నారు. గతంలో పవన్ 'అనంత'కు వచ్చినపుడు యువకులు, విద్యార్థులు, పార్టీ నేతలు చేసిన హడావుడి ఇప్పుడు ఎక్కడా కనపడకపోవడంపై కూడా చర్చకు దారితీసింది.

టీడీపీతో నేతలతో భేటీలు

సమస్యలు అధ్యయనం అంటూ వచ్చిన పవన్.. టీడీపీ నేతలతో భేటీ కావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. సమస్యల మూలాలు తెలుసుకునేందుకు గ్రామాలకు వెళ్లి రైతులు, కూలీలు, ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను కలవాలిగానీ, తొలిరోజు అనంతపురం ఎమ్మెల్యే ప్రభాకరచౌదరితో, రెండోరోజు మంత్రి పరిటాల సునీత, ఫిరాయింపు ఎమ్మెల్యే చాంద్‌బాషా కలవడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ధర్మవరంలో టీడీపీ కార్యాలయానికి వెళ్లి మరీ ఎమ్మెల్యే వరదాపురం సూరిని కలవడంపై జనసేన నేతలే ముక్కునవేలేసుకున్నారు. పుట్టపర్తిలో పల్లెరఘునాథరెడ్డి అనుచరులు పవన్‌ను కలిశారు. వీటిని చూస్తే టీడీపీకి అనుకూలంగా జనసేన పార్టీ పని చేస్తుందని తెలుస్తోందని మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు.

● తెలంగాణ

ఆయుధం కావాలా..? ఆన్‌లైన్ ఉందిగా..!

- ఆర్డర్ చేస్తే ఇంటికే ఆయుధాల డెలివరీ
- అన్ని ఈ–కామర్స్ సైట్స్‌లోనూ వెపన్స్ అమ్మకాలు
- 12 మంది అరెస్ట్, 13 మారణాయుధాల స్వాధీనం చేసుకున్న పోలీసులు
- స్నాప్‌డీల్ ఎండీపై కేసు నమోదు!

సాక్షి, హైదరాబాద్

స్నాప్‌డీల్‌లో బాహుబలి ఖడ్గం.. రూ.8,999.. ఆఫర్‌లో రూ.5,499 మాత్రమే.

అమెజాన్‌లో సమురాయ్ కటన ట్రైనర్.. రూ.1,800.. డెలివరీ చార్జీలు రూ.50 ఓన్లీ.

ఫ్లిప్‌కార్ట్‌లో నింజా వారియర్ స్వోర్డ్ రూ.3,476.. ప్రత్యేక ధర కేవలం రూ.2780.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆన్‌లైన్‌లో లభిస్తున్న అక్రమ ఆయుధాల మెనూ ఇదీ. క్యాష్ ఆన్ డెలివరీ, నెలవారీ వాయిదాల పద్ధతుల్లోనూ ఇంటర్నెట్ కేంద్రంగా ఆయుధ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీనిపై కన్నేసిన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం 12 మందిని పట్టుకుని, 13 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఈ నిందితులు స్నాప్‌డీల్ నుంచి ఖరీదు చేసినట్లు తేలిందని, ఈ నేపథ్యంలోనే ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌పైనా కేసులు నమోదు చేస్తున్నామని డీసీపీ పి.రాధాకిషన్‌రావు తెలిపారు.

ఉత్తరాదిని కాపీ కొడుతూ..

పెళ్లిళ్లు, బారాత్‌లతో పాటు పుట్టినరోజు వేడుకల్లో కత్తుల్ని ప్రదర్శించే, డాగర్లను వెంట ఉంచుకుని సంచరించే సంస్కృతి ఒకప్పుడు ఉత్తరాదికి మాత్రమే పరిమితమై ఉండేది. ఇటీవల హైదరాబాద్‌లోనూ ఈ విష సంస్కృతి విస్తరిస్తోంది. గతంలోనూ సిటీలో కత్తుల్ని స్వాధీనం చేసుకున్న ఉదంతాలు ఉన్నా వాటిని నిందితులు బీదర్, గుల్బర్గా నుంచి తీసుకొచ్చేవారు. అయితే ఇప్పుడు ఈ–కామర్స్ సైట్ల కారణంగా ఆన్‌లైన్‌లోనూ ఆయుధాలు దొరికేస్తున్నాయి. దీంతో అనేక మంది యువకులు అవసరం ఉన్నా లేకున్నా, చట్టవిరుద్ధమని తెలిసో తెలియకో వీటిని ఖరీదు చేసి తమ వద్ద ఉంచుకుంటున్నారు. పెళ్లిళ్లు, బారాత్‌లు, బర్త్‌డే పార్టీల్లో(కేక్ కటింగ్ కోసం) వాటితో పోజులిస్తూ ఆ చిత్రాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. అయితే రాయదుర్గం పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల మొదటి వారంలో ఓ ఎంగేజ్‌మెంట్ బారాత్ ఊరేగింపులో కత్తి విన్యాసం 15 ఏళ్ల సయ్యద్ హమీద్ ప్రాణం తీసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. వీటి క్రయవిక్రయాలు, వినియోగంపై నిఘా పెట్టారు. స్నాప్‌డీల్ మాత్రమే కాదు.. ఏ ఈ–కామర్స్ సైట్‌లో చూసినా కత్తులు విక్రయానికి సిద్ధంగా ఉంటున్నాయి. రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు వివిధ ఆకృతులు, సైజుల్లో వీటిని విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే చాలు పార్శిల్స్ ఇంటికి చేర్చేస్తున్నారు. కొన్ని సైట్లు క్యాష్ ఆన్ డెలివరీ అవకాశాన్నీ ఇస్తున్నాయి. ఆయుధ చట్టం ప్రకారం ఇలా ఆయుధాలను అమ్మడం నేరం. ప్రస్తుతం స్నాప్‌డీల్‌పై ఆధారాలు చిక్కినందుకు దానిపై చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో ఇతర సైట్లకు సంబంధించి ఆధారాలు లభిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయుధ చట్టం ప్రకారం 9 అంగుళాల కంటే ఎక్కువ పొడవు, రెండు అంగుళాలకు మించి వెడల్పుతో కూడిన కత్తులు తదితరాలు కలిగి ఉండటం, ఖరీదు చేయడం నేరమన్నారు.

చందానగర్‌లో మూడు హత్యల కలకలం

- ఓ మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఘాతుకం
- ప్రేమికురాలితోపాటు ఆమె కుమార్తె, తల్లి హత్య.. పోలీసుల అదుపులో నిందితుడు మధు


జయమ్మ, కార్తికేయ, అపర్ణ(ఫైల్) (ఇన్‌సెట్‌లో) నిందితుడు మధు

హైదరాబాద్: ప్రేమ అన్నాడు. వెంటపడ్డాడు. సహజీవనం చేశాడు. ఓ కుమార్తె జన్మకు కారణమయ్యాడు. పెళ్లి చేసుకోవాలని ప్రేమికురాలు ఒత్తిడి చేయడంతో ఆమెను దారుణంగా చంపాడు. కుమార్తెను, ప్రేమికురాలి తల్లిని కూడా హత్య చేశాడు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా చందానగర్‌లో శనివారం జరిగిన ఈ మూడు హత్యల ఉదంతం సోమవారం ఉదయం వెలుగు చూసింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన గుడూరి జయమ్మ(50)కు కుమార్తె అపర్ణాదేవి(33), కుమారుడు వంశీకృష్ణ ఉన్నారు. అపర్ణ అమ్మమ్మ ఊరు పాలకొల్లు మండలం ఉల్లంపర్రు. అదే గ్రామానికి చెందిన రావాడ మధు కేపీహెచ్‌బీలో సెల్‌ఫోన్లు రిపేర్ చేస్తుంటాడు. అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు పదేళ్ల క్రితం మధుతో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. అప్పటికే తనకు వివాహమై ఇద్దరు పిల్లలున్నారన్న విషయాన్ని దాచి అపర్ణతో సహజీవనం చేయసాగాడు. వీరికి ఐదేళ్ల వయస్సున్న పాప కార్తికేయ కూడా ఉంది. చందానగర్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ఎల్‌జీ ప్రమోటర్‌గా పనిచేస్తున్న అపర్ణ ఫ్లాట్‌లో తల్లి, కుమార్తెతో కలసి ఉంటోంది.

దుర్వాసన రావడంతో వెలుగులోకి ...

బయట నుంచి తాళం వేసిన ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని నారాయణరావు అనుమానం వచ్చి వెనక వైపు కిటికీలో నుంచి చూశాడు. హత్యకు గురైన అపర్ణ కాళ్లు కనిపించాయి. ఎంత పిలిచినా పలకలేదు. దీంతో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. కిచెన్‌లో రక్తపు మడుగులో పడి అపర్ణ మృతి చెంది ఉంది. బెడ్‌పై జయమ్మ, కార్తికేయ తనువు చాలించి ఉన్నారు. అపర్ణ తలపై బలంగా కొట్టి చంపినట్టుగా ఆనవాళ్లు ఉన్నాయని చెప్పిన పోలీసులు చెప్పారు. జయమ్మ, కార్తికేయ ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. క్లూస్ టీం, ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌లు ఘటనాస్థలాన్ని పరిశీలించాయి. ఘటనాస్థలిని సైబరాబాద్ జాయింట్ పోలీసు కమిషనర్ షానవాజ్ ఖాసీం పరిశీలించారు. షానవాజ్ ఖాసీమ్ మాట్లాడుతూ 'అపర్ణను తలపై రోకలిబండతో మోది కిచెన్‌లో హత్య చేశారు. బెడ్‌పై పడుకున్న జయమ్మ, కార్తికేయను గొంతుకు పిసికి చంపి ఉండొచ్చు. లేదంటే విషమిచ్చి చంపి ఉండవచ్చ'న్నారు. అపర్ణ, మధు మధ్య రెండు నెలల నుంచి గొడవలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఈ హత్యలు చోటుచేసుకున్నాయి. అయితే, అపర్ణతో తాను సహజీవనం చేస్తున్నానని, మరొక వ్యక్తితో సన్నిహితంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకనే హత్య చేశానని నిందితుడు పోలీసుల విచారణలో చెప్పినట్టు తెలిసింది. శనివారం మధ్యాహ్నం అపర్ణ ఇంటికి రాగానే తలుపు తీశానని, వెంటనే ఆమె తలను గోడకేసి బాది చంపానని నిందితుడు అంగీకరించినట్లు తెలిసింది.

'తత్కాల్' పాస్‌పోర్టులకు అటెస్టేషన్ అవసరం లేదు!

హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తత్కాల్ పథకం కింద పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకునే వారికి శుభవార్త. ఇకపై ఐఏఎస్/ఐపీఎస్ అధికారుల అటెస్టేషన్ లేకుండానే పాస్‌పోర్టు పొందవచ్చు. ఆధార్/ఆధార్ ఎన్‌రోల్ మెంట్ నంబర్, స్వీయ ధ్రువీకరణ పత్రంతో పాటు కేంద్రం సూచించిన 12 రకాల పత్రాల్లో ఏవైనా రెండు జత చేసి పాస్‌పోర్టు రుసుము రూ.1,500, అదనంగా తత్కాల్ రుసుము రూ.2 వేలు చెల్లిస్తే మరుసటి రోజు నుంచి గరిష్టంగా 3 రోజుల్లోగా పాస్‌పోర్టు జారీ కానుంది. ఈ మేరకు 'తత్కాల్' కింద పాస్‌పోర్టుల జారీని సరళిస్తూ విదేశాంగ శాఖ జనవరి 11న గెజిట్ ప్రకటన జారీ చేసిందని హైదరా బాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధారణ పథకం కింద తక్కువ సమయంలో (ఔట్ ఆఫ్ టర్న్) పాస్‌పోర్టు జారీకి పై విధానంలో దరఖాస్తు చేసు కుంటే మూడు నుంచి వారం రోజుల్లో పాస్‌పోర్టు జారీ చేస్తామన్నారు. పై రెండు విధానాల కింద దరఖాస్తు అందిన వెంటనే పాస్‌పోర్టు జారీ ప్రక్రియ ప్రారంభిస్తామని, పాస్‌పోర్టు జారీ చేసిన తర్వాత పోలీస్ వెరిఫికేషన్ జరిపిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రజలు అటెస్టేషన్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ఆ విధానం తొలగించి పాస్‌పోర్టుల జారీని కేంద్రం సరళీకృతం చేసిందన్నారు.

నేడు పోలవరంపై ఢిల్లీలో భేటీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ సమక్షంలో మంగళవారం ఢిల్లీలో కీలక భేటీ జరగనుంది. పోలవరం హెడ్‌వర్క్స్ (జలాశయం)లో కాంక్రీట్ పనులను నవయుగకు నామినేషన్‌పై అప్పగించాలన్న సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు సోమవారం నిర్వహించిన వర్చువల్ రివ్యూలో వ్యతిరేకించారు. తాము చేసిన పనులకు నేరుగా బిల్లులు చెల్లించాలన్న నవయుగ ప్రతిపాదనకు ట్రాన్స్‌ట్రాయ్ అభ్యంతరం తెలిపింది. ఈ నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు ఢిల్లీ రావాలని జలవనరుల శాఖ అధికారులను, పోలవరం కాంట్రాక్టు సంస్థ ప్రతినిధుల్ని గడ్కారీ ఆదేశించారు. పోలవరం హెడ్ వర్క్స్‌లో 60 సీ నిబంధన కింద కొన్ని పనుల్ని విడదీసి రూ.1,483.22 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం టెండరు నోటిఫికేషన్ జారీ చేయడం వివాదాస్పదంగా మారటం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 11న నిర్వహించిన పీపీఏ సమావేశంలో కూడా టెండర్ నోటిఫికేషన్‌ను తప్పుబట్టారు. టెండర్ల వల్ల పడే రూ.287 కోట్ల భారాన్ని ఎవరు భరిస్తారని నిలదీసిన పీపీఏ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీంతో స్పిల్ వే, స్పిల్ ఛానెల్‌లో మొత్తం కాంక్రీట్ పనులను నవయుగకు నామినేషన్ పద్ధతిలో సబ్ కాంట్రాక్టు కింద అప్పగిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. అయితే పీపీఏ అనుమతి లేకుండా నామినేషన్ విధానంలో సబ్ కాంట్రాక్టు ఇవ్వకూడదని సోమవారం వర్చువల్ రివ్యూలో అధికారులు స్పష్టం చేశారు. దీంతో పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థలతోపాటు మంత్రి దేవినేని ఉమా, అధికారులను మంగళవారం ఉదయం ఢిల్లీకి రావాలని గడ్కారీ సూచించారు.

తెలుగు

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



ఐఐఎం ప్రవేశాలు..

మలిదశకు మేలైన బాట..

గ్రాడ్యుయేట్స్ స్పెషల్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంలు).. భారత ప్రతిష్టాత్మక మేనేజ్‌మెంట్ విద్యా సంస్థలు. వీటిలో చేరితే ఉజ్వల కెరీర్‌కు మార్గం సుగమమైనట్లే. ఐఐఎంల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్) ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. ఇందులో టాప్ పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు ఐఐఎంలు మలిదశ ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తాయి. ఇందులో బృంద చర్చ (జీడీ), మౌఖిక, రాత సామర్థ్య పరీక్షలు ఉంటాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు మలిదశను విజయవంతంగా ఎదుర్కొనేందుకు ఉపయోగపడేలా విలువైన సలహాలు...

- ప్రస్తుతం దేశంలో 20 ఐఐఎంలు ఉన్నాయి. వీటిలో ఆరు తొలి తరం ఐఐఎంలుగా గుర్తింపు పొంది, అగ్రశ్రేణిలో కొనసాగుతున్నాయి. అవి.. ఐఐఎం-అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, లక్నో, ఇండోర్, కోజికోడ్. 2008లో ఏర్పాటైన ఐఐఎం-షిల్లాంగ్, కాశీపూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, ట్రిచీ, ఉదయ్‌పూర్; 2015లో ప్రారంభించిన ఐఐఎం-విశాఖపట్నం, అమృత్‌సర్, బోధ్‌గయా, జమ్మూ, నాగ్‌పూర్, సంబల్‌పూర్, సిర్మార్‌లను కొత్తవిగా పరిగణిస్తారు.

ప్రవేశ ప్రక్రియ

గతేడాది గణాంకాలను పరిశీలిస్తే అన్ని ఐఐఎంలు ఒకే విధమైన ప్రవేశ ప్రక్రియను అనుసరించడం లేదని తెలుస్తుంది. ఆయా ఐఐఎంలు క్యాట్ స్కోరుకు నిర్దిష్ట వెయిటేజీ ఇస్తూనే బృంద చర్చ, మౌఖిక, రాత పరీక్షలకు తమదైన (వేర్వేరు) వెయిటేజీలను అమలుచేస్తున్నాయి.

షార్ట్‌లిస్ట్‌లోనూ వైవిధ్యం!

ఐఐఎంలు మొత్తంగా క్యాట్‌స్కోరుతోపాటు ఇతర అంశాలను కూడా అభ్యర్థులను ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నాయి. కొన్ని ఐఐఎంలు మాత్రం కేవలం క్యాట్ ద్వారానే ఇంటర్వ్యూలకు షార్ట్‌లిస్ట్ చేస్తుంటే.. మరికొన్ని క్యాట్‌తోపాటు నేపథ్యం, పని అనుభవం వంటి అంశాల ఆధారంగా కాల్ లెటర్స్ పంపిస్తున్నాయి.



- గతేడాది షిల్లాంగ్, కాశీపూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, ఉదయ్‌పూర్, బోధ్‌గయా, అమృత్‌సర్, సంబల్‌పూర్ ఐఐఎంలు క్యాట్ స్కోరు ఆధారంగా ఇంటర్వ్యూ జాబితా రూపొందించాయి.
- ఐఐఎం-అహ్మదాబాద్, కోజికోడ్‌లు క్యాట్ స్కోరుకు 70 నుంచి 80 శాతం వెయిటేజీ ఇచ్చాయి.
- ఐఐఎం-కోల్‌కతా, లక్నోలు క్యాట్ స్కోరుకు అత్యల్పంగా 50 నుంచి 55 శాతం వెయిటేజీ కల్పించాయి.
- బెంగళూరు, ఇండోర్, నాగ్‌పూర్, విశాఖపట్నం ఐఐఎంలు క్యాట్ స్కోరు కంటే.. అభ్యర్థుల విద్యా నేపథ్యం, రికార్డులు, పని అనుభవం తదితరాలకు పెద్దపీట వేశాయి.

సెక్షనల్ కటాఫ్ కీలకమా?

ఐఐఎంలు ఇంటర్వ్యూలకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసేటప్పుడు.. సెక్షనల్ కటాఫ్ మార్కులకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఉదాహరణకు ఓవరాల్‌గా 99 శాతం పర్సంటైల్ పొందినా, ఏదైనా సెక్షన్‌లో నిర్దేశిత మార్కులు పొందకపోతే సదరు అభ్యర్థులను అనర్హులుగా ప్రకటిస్తున్నాయి. తాజాగా ఇండోర్ ఐఐఎం దాదాపు 1400 మందిని మలిదశ ప్రక్రియకు ఎంపిక చేసింది. క్యాట్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 80 శాతం పర్సంటైల్ పొందాలనే నిబంధన ఆధారంగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసింది.

అకడమిక్ రికార్డ్, వర్క్ ఎక్స్‌పీరియెన్స్

- పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీలకు ప్రత్యేక వెయిటేజీలు ఉంటున్నాయి. అన్ని ఐఐఎంలు కోర్సుకు పది శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. అభ్యర్థులు ఆయా కోర్సుల్లో పొందిన జీపీఏ/ఉత్తీర్ణత శాతం ఆధారంగా నిర్దిష్ట వెయిటేజీ మొత్తాలను గణిస్తారు. కొన్ని ఐఐఎంలు ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్‌కు ప్రత్యేక వెయిటేజీ ఇస్తున్నాయి.
- తుది దశ వెయిటేజీ పరంగా 'వర్క్ ఎక్స్‌పీరియన్స్' కీలకంగా ఉంటోంది. వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉన్న అభ్యర్థులకు తుది జాబితా రూపకల్పనలో ఐదు నుంచి పది శాతం వెయిటేజీ లభిస్తోంది. అభ్యర్థులు పనిచేస్తున్న రంగం, అనుభవం వంటివి వెయిటేజీని నిర్ణయిస్తున్నాయి.
- ఐఐఎం షిల్లాంగ్ అకడమిక్స్, వర్క్ ఎక్స్‌పీరియెన్స్‌కు ఎలాంటి వెయిటేజీ ఇవ్వడం లేదు. కోల్‌కతా, కోజికోడ్, అమృత్‌సర్, బోధ్‌గయా ఐఐఎంలు 5 నుంచి 8 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి. అహ్మదాబాద్, లక్నో, కాశీపూర్, ఉదయ్‌పూర్, సంబల్‌పూర్ ఐఐఎంలు 10-15 శాతం; ఇండోర్, రాంచీ, రాయ్‌పూర్ ఐఐఎంలు 20-26 శాతం; బెంగళూరు, రోహ్‌తక్, విశాఖపట్నం ఐఐఎంలు 35 శాతం; ఐఐఎం నాగ్‌పూర్ 40 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి.
- ఓవరాల్‌గా తుది ఎంపికలో అకడమిక్స్/వర్క్ ఎక్స్‌పీరియెన్స్ వెయిటేజీ స్వల్పంగా ఉంటోంది. పది ఐఐఎంలలో అకడమిక్స్/వర్క్ ఎక్స్‌పీరియెన్స్‌లకు 15 శాతం కంటే తక్కువ వెయిటేజీ లభిస్తోంది. కేవలం నాలుగు ఐఐఎంలు మాత్రమే 35 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి. కాబట్టి క్యాట్ స్కోరు, ఇతర ఎంపిక ప్రక్రియలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని అభ్యర్థులు గుర్తించాలి.
- ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ అయినవారు తర్వాతి దశల్లో కనబర్చే ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

స్పష్టత అవసరం

మలిదశలో బృంద చర్చ/రిటెన్ ఎబిలిటీ టెస్ట్ (డబ్ల్యూఏటీ), పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- బృంద చర్చ (జీడీ)లో ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. ఆ సమయంలో అభ్యర్థుల ప్రవర్తన, కమ్యూనికేషన్ స్కిల్స్, విషయ పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. జీడీలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య, వైద్యం రంగాల్లోని సమకాలీన అంశాలపై చర్చించాల్సి ఉంటుంది. ఆయా అంశాలపై అభ్యర్థులు లోతైన అవగాహనను పెంపొందించుకోవాలి.
- రిటెన్ ఎబిలిటీ టెస్ట్ (డబ్ల్యూఏటీ)లో ఒక అంశం ఇచ్చి దానిపై నిర్దేశిత సమయంలో సమాధానం రాయమంటారు. ఈ సమాధానానికి సంబంధించి పదాల సంఖ్యలో పరిమితి ఉంటుంది.
- పర్సనల్ ఇంటర్వ్యూలో మేనేజ్‌మెంట్ విద్యపై ఉన్న ఆసక్తి, భవిష్యత్తు లక్ష్యాలు-వాటిని సాధించేందుకు ఎంచుకున్న మార్గాల గురించి వివరించాల్సి ఉంటుంది. అభ్యర్థులు దీన్ని గుర్తించి ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పేలా సిద్ధం కావాలి. విద్యా నేపథ్యం, లక్ష్యాల విషయంలో స్పష్టత ఉండాలి.

స్వీయ విశ్లేషణ ప్రధానం

అత్యుత్త బిజినెస్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ప్రవేశాలకు అకడమిక్ ప్రతిభ, వర్క్ ఎక్స్‌పీరియెన్స్ కంటే మలిదశలో చూపే ప్రతిభే కీలకం. ఇంటర్వ్యూ విజయంలో స్వీయ విశ్లేషణ కీలకం. అభ్యర్థి తన బలాలు, బలహీనతలు, కెరీర్ లక్ష్యాలు, అభిరుచులు, గత విజయాలు వంటి అంశాల్లో స్పష్టతతో ఉండాలి. ఇది స్వీయ విశ్లేషణ ద్వారానే సాధ్యం అవుతుంది. గ్రాడ్యుయేషన్ సబ్జెక్టులు, పని అనుభవం (ఉన్నవారికి) తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూ ప్యానెల్ అభ్యర్థుల్లోని జనరల్ అవేర్‌నెస్‌ను కూడా పరీక్షిస్తుంది. కాబట్టి గణాంకాలను ఉదహరిస్తూ విశ్లేషణాత్మకంగా సమాధానాలు చెప్పే నైపుణ్యాన్ని అలవరచుకోవాలి. సమాధానాలు చెప్పే సమయంలో చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రదర్శించడం కీలకం.

-రామ్‌నాథ్ కనకదండి,
క్యాట్ కోర్స్ డైరెక్టర్,
టైమ్ ఇన్‌స్టిట్యూట్.

ఇన్‌స్టిట్యూట్ వాచ్



వినూత్న కోర్సులకు కేరాఫ్..

ఐఐటీ-హెచ్

- బీటెక్‌లో కొత్తగా డిజైన్, మ్యాథమెటిక్స్ కోర్సులు

ఐఐటీ - హైదరాబాద్.. 2008లో ప్రారంభమైంది. ప్లేస్‌మెంట్స్, పరిశోధనల ద్వారా ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. తాజాగా బీటెక్ విద్యార్థులకు బహుళ నైపుణ్యాలు అందించే క్రమంలో డిజైన్, మ్యాథమెటిక్స్‌లను మైనర్ కోర్సులుగా ప్రారంభించింది. డేటా అనలిటిక్స్, బిగ్‌డేటా తదితర వినూత్న కోర్సులను సైతం అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఐఐటీ-హైదరాబాద్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన మైనర్ కోర్సులు, ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్ తదితరాలపై ప్రత్యేక కథనం..

'ఇంజనీరింగ్ విద్యార్థులకు మల్టీ డిసిప్లినరీ అప్రోచ్ చాలా అవసరం. విద్యార్థులు కోర్ బ్రాంచ్‌తోపాటు కనీసం ఒకట్రెండు ఇతర కోర్సులను మైనర్‌గా ఎంపిక చేసుకుని వాటిలో నైపుణ్యం సొంతం చేసుకోవాలి. అప్పుడే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యపడుతుంది.'

- మన దేశంలో బీటెక్ విద్యార్థుల నైపుణ్యాల పరంగా విద్యావేత్తలు, ఇండస్ట్రీ వర్గాలు తరచుగా వ్యక్తం చేసే అభిప్రాయమిది.

ఇదే అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఐఐటీ-హైదరాబాద్.. బీటెక్ ప్రోగ్రామ్‌లో రెండు కొత్త మైనర్ కోర్సుల (డిజైన్, మ్యాథమెటిక్స్)ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కోర్సులను మైనర్‌గా బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉన్నతవిద్య అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విభాగాలకు సంబంధించి ఎంటెక్, పీహెచ్‌డీ, ఎంఎస్సీ వంటి ఉన్నత విద్య ప్రోగ్రామ్‌లకు వీరికి అర్హత లభిస్తుంది.

మ్యాథమెటిక్స్

నాలుగేళ్ల బీటెక్ కోర్సులో అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు మ్యాథమెటిక్స్‌ను ఒక సబ్జెక్టుగా మొదటి సంవత్సరంలో చదవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మ్యాథ్స్‌పై కన్నెత్తి చూసే విద్యార్థులు చాలా తక్కువ. కానీ, ఇంజనీరింగ్ విభాగంలో ఏ బ్రాంచ్‌లోనైనా.. భవిష్యత్తులో రాణించాలంటే.. మ్యాథమెటిక్స్ వెన్నెముక. అల్గారిథమ్స్ రూపొందించాలన్నా.. డేటా అనలైజ్ చేయాలన్నా.. మ్యాథమెటిక్స్‌పై పట్టు అవసరం. అందుకే ఐఐటీ-హైదరాబాద్.. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ పేరుతో బీటెక్‌లో మైనర్ కోర్సును ప్రారంభించింది. ప్రత్యేక పరీక్ష ద్వారా దీనికి అర్హత సాధించిన వారు నాలుగు సెమిస్టర్లలోనూ మ్యాథమెటిక్స్‌ను పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

డిజైన్

ఇంజనీరింగ్ విద్యార్థులకు సృజనాత్మక ఆలోచనా విధానం ఎంతో అవసరమని తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని, బీటెక్ ప్రోగ్రామ్‌లో మరో మైనర్‌గా డిజైన్ కోర్సును ఐఐటీ-హెచ్ ప్రారంభించింది. ముఖ్యంగా 3డీ డిజైన్ టెక్నాలజీకి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కోర్సు బీటెక్ విద్యార్థులకు ఎంతో కలిసొస్తుందని చెప్పొచ్చు. ఈ కోర్సుకు ఆయా బ్రాంచ్‌ల నుంచి గరిష్టంగా 20 మందిని ఎంపిక చేస్తారు. డిజైన్ టెక్నాలజీస్‌కు సంబంధించి పూర్తిస్థాయి నైపుణ్యం లభించేలా కోర్సు ఉంటుంది. క్రియేటివ్ ప్రొడక్ట్ డిజైన్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ యానిమేషన్, మూవింగ్ ఇమేజెస్, డిజిటల్ హెరిటేజ్, విజువల్ కమ్యూనికేషన్స్ అండ్ డిజిటల్ ఇమేజింగ్, బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, అర్బన్ స్పేస్ డిజైన్ తదితర అంశాలు సిలబస్‌లో ఉంటాయి.

షార్ట్ టర్మ్ కోర్సులు

ఐఐటీ-హైదరాబాద్ మరెన్నో వినూత్న నైపుణ్యాలు అందించేందుకు చిరునామాగా మారుతోంది. ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న బిగ్‌డేటా, డేటా అనలిటిక్స్ వంటి విభాగాలలో షార్ట్ టర్మ్ కోర్సులను సైతం అందిస్తోంది.

ఎంటెక్, పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ

ఐఐటీ-హైదరాబాద్‌లోని ప్రోగ్రామ్‌ల పరంగా మరో ప్రత్యేకత ఎంటెక్, పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ అవకాశాలను అందుబాటులోకి తేవడం. గేట్ స్కోర్ ఆధారంగా ఈ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు కాల వ్యవధి అయిదేళ్లు. తొలి రెండేళ్లు ఎంటెక్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన అంశాలుంటాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ విషయంలోనూ ఐఐటీ-హైదరాబాద్ వినూత్నంగా అడుగులు వేస్తోంది. కొలాబరేటెడ్ రీసెర్చ్ పేరుతో విదేశీ యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకుని.. పీహెచ్‌డీ వ్యవధిలో కొంతకాలం విద్యార్థులు విదేశీ వర్సిటీల్లో పరిశోధనలు సాగించే విధంగా నిబంధనలు అమలుచేస్తోంది.

జైకా ఫ్రెండ్‌షిప్ ప్రోగ్రామ్

జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా)-ఇండియా ఫ్రెండ్‌షిప్ పేరుతో ఐఐటీ-హెచ్‌లో ప్రత్యేక పథకం అమలవుతోంది. 2012లో అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందంలో భాగంగా.. ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు జపాన్ ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆ దేశ యూనివర్సిటీల్లో స్కాలర్‌షిప్ సదుపాయంతో ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందొచ్చు. దీనికింద ఇప్పటివరకు 54 మంది విద్యార్థులు ప్రయోజనం పొందారు. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో, టొహొకు యూనివర్సిటీ, కియో యూనివర్సిటీ, క్యోటో యూనివర్సిటీ, ఒసాకా యూనివర్సిటీ, క్యుషు యూనివర్సిటీ తదితర ప్రముఖ యూనివర్సిటీల్లో ఐఐటీ-హెచ్ విద్యార్థులు ఉన్నారు.

యూఎస్ వర్సిటీలతో ఒప్పందం

కొలాబరేటెడ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా అమెరికా యూనివర్సిటీలతో ఐఐటీ-హెచ్ ఒప్పందం చేసుకుంది. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా తదితర ప్రముఖ వర్సిటీలతో అకడమిక్ ఎక్స్ఛేంజ్ ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో ఆయా యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు ఎంటెక్, పీహెచ్‌డీ స్థాయిలో రెండు నెలల వ్యవధిలో ఐఐటీ-హెచ్‌లో బోధిస్తారు. అదేవిధంగా ఆస్ట్రేలియా, స్వీడన్ దేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలతోనూ ఇంటర్న్‌షిప్, అకడమిక్ ఎక్స్ఛేంజ్ ఒప్పందాలు చేసుకుంది. మొత్తంమీద ఐఐటీ-హెచ్.. 52 విదేశీ యూనివర్సిటీలతో కలిసి ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ అందిస్తోంది.

ప్లేస్‌మెంట్స్‌లోనూ ముందంజ

ఏటా దాదాపు రెండు వందల కంపెనీలు ఐఐటీ-హెచ్‌ను సందర్శిస్తున్నాయి. ఆఫర్ల పరంగానూ ఐఐటీ-ముంబై, ఢిల్లీ, చెన్నై, కాన్పూర్ తదితర ప్రముఖ ఐఐటీలకు దీటుగా నిలుస్తోంది.

- 2017-18 బ్యాచ్‌లో ఇప్పటికే 80 శాతం మందికి ఆఫర్లు లభించాయి. ఈ ప్రక్రియ ఫిబ్రవరి వరకు సాగనుంది. దాదాపు ప్రతి ఒక్క విద్యార్థికి కొలువు ఖాయంగా కనిపిస్తోంది.
- 2016-17లో 264 మందికి ఆఫర్లు ఖరారయ్యాయి. 17 మంది విద్యార్థులకు ఇంటర్నేషనల్ ఆఫర్స్ లభించాయి. రూ.38 లక్షలు అత్యధిక వార్షిక వేతనంగా నమోదైంది.
- 2015-16 విద్యా సంవత్సరంలోనూ 268 మంది విద్యార్థులకు ఆఫర్లు లభించాయి. అత్యధిక వార్షిక వేతనం రూ.35 లక్షలుగా నమోదైంది.

ఉన్నతవిద్యలో రాణించేందుకు మైనర్ కోర్సులు

మైనర్ కోర్సులు ప్రవేశపెట్టడానికి ప్రధాన కారణం.. కోర్ బ్రాంచ్ అంశాలతో పాటు ఇతర ఉన్నతవిద్య ప్రోగ్రామ్‌లకు అర్హులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే. ప్రధానంగా కోడింగ్, అల్గారిథమ్స్ రూపకల్పనలో కీలకమైన మ్యాథమెటిక్స్‌లో పట్టు సాధించేందుకు ఆ సబ్జెక్టును మైనర్ కోర్సుగా బీటెక్‌లో ప్రవేశ పెట్టాం. బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల్లో ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారికి ఇన్‌స్టిట్యూట్ పరిధిలో మరో పరీక్ష నిర్వహించి పది మందిని ఎంపిక చేస్తాం. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులు అందించడంలో ఐఐటీ-హెచ్ ముందుంటోంది.

- ప్రొఫెసర్ సి.హెచ్. సుబ్రహ్మణ్యం, డీన్,
అకడమిక్స్, ఐఐటీ-హెచ్.

బులెటిన్ బోర్డ్

ఐఐటీ మండీలో 33 ఖాళీలు

హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ).. వివిధ విభాగాల్లోని 33 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** గ్రూప్ 'ఎ' పోస్టులు.. అసిస్టెంట్ రిజిస్ట్రార్-3; గ్రూప్ 'బి' పోస్టులు.. అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్)-1, జూనియర్ సూపరింటెండెంట్-4; జూనియర్ సూపరింటెండెంట్ (అకౌంట్స్)-1, ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ (పీటీఐ)-1, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-3, సీనియర్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-1; గ్రూప్ 'సి' పోస్టులు.. జూనియర్ అసిస్టెంట్-9, జూనియర్ అకౌంటెంట్-3, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్ (టెక్)-4, ఫార్మసిస్ట్-1, డ్రైవర్-1, జూనియర్ అటెండెంట్ (మల్టీ స్కిల్డ్)-1.
- **వేతనశ్రేణి:** గ్రూప్-ఏ పోస్టులకు రూ.15,600-రూ.39,100; గ్రూప్-బీ పోస్టులకు రూ.9,300-రూ.34,800; గ్రూప్-సీ పోస్టులకు రూ.5,200-రూ.20,200.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి మాస్టర్స్ డిగ్రీ/బ్యాచిలర్స్ డిగ్రీ/ఇంజనీరింగ్ డిప్లొమా/పదోతరగతి/తత్సమాన విద్య. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** గ్రూప్-ఏ పోస్టులకు 40 ఏళ్లు; గ్రూప్-బీ పోస్టులకు 35 ఏళ్లు, గ్రూప్-సీ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ/మహిళా కేటగిరీల అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.iitmandi.ac.in

ఎన్ఐటీటీటీఆర్‌లో 25 ఖాళీలు

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్).. 25 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** ప్రొఫెసర్-5; అసిస్టెంట్ ప్రొఫెసర్-10; రీసెర్చ్ ఫెలో-10.
- **విభాగాలు:** ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్స్, మెకానికల్ ఇంజనీరింగ్.
- **వేతనశ్రేణి:** ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100; రీసెర్చ్ ఫెలోకు స్టైపెండ్ మొదటి ఏడాది-రూ.25,000, రెండో ఏడాది-రూ.28,000, చివరి ఏడాది-రూ.38,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి బీఈ/బీటెక్‌తోపాటు ఎంఈ/ఎంటెక్+పీహెచ్‌డీ/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం, గేట్ క్వాలిఫై (రీసెర్చ్ ఫెలో పోస్టులకు) తదితర అర్హతలుండాలి.
- **వయసు:** ప్రొఫెసర్‌కు 55 ఏళ్లు మించకూడదు; అసిస్టెంట్ ప్రొఫెసర్, రీసెర్చ్ ఫెలో పోస్టులకు 21-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 20, 2018.
- **వెబ్‌సైట్:** www.nitttrbpl.ac.in

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 9 స్పోర్ట్స్‌కోటా ఖాళీలు

న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం.. క్లరికల్ కేడర్‌లోని 9 స్పోర్ట్స్ కోటా ఖాళీల భర్తీకి అర్హులైన హాకీ క్రీడాకారుల (పురుషులు) నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** క్లరికల్ కేడర్.
- **వేతనం:** రూ.11,765-రూ.31,540.
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు జాతీయ/రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొని ఉండాలి.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి 18-26 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** హాకీ క్రీడలో ప్రతిభ/ఫీల్డ్ ట్రయల్స్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు రూ.50 (ఇంటిమేషన్ ఛార్జీలు మాత్రమే).
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 3, 2018.
- **వెబ్‌సైట్:** www.pnbindia.in

బిట్స్ పిలానీలో ఫ్యాకల్టీ పోస్టులు

రాజస్థాన్‌లోని పిలానీలో ఉన్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బీఐటీఎస్:బిట్స్).. పిలానీతోపాటు గోవా, హైదరాబాద్, దుబాయ్‌లోని తన క్యాంపస్‌లతోపాటు బెంగుళూరు, చెన్నై.. తదితర ప్రాంతాల్లోని ఆన్‌క్యాంపస్, ఆఫ్ క్యాంపస్‌ల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** ప్రొఫెసర్/సీనియర్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఈఈఈ, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, బయో సైన్సెస్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఫార్మసీ, ఎకనమిక్స్ అండ్ ఫైనాన్స్, మేనేజ్‌మెంట్, లాంగ్వేజెస్, హ్యుమానిటీస్.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి పీహెచ్‌డీ, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 19, 2018.
- **వెబ్‌సైట్:** www.bits-pilani.ac.in

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
233 ▲	61 ▲
36,283	11,130

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తెల్లవారు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,485	▽	20
డోజోన్స్	26,524	▽	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,670	▲	5
డాక్స్	13,293	▽	47
షాంఘై	3,523	▽	35
నికాయ్	23,629	▽	3

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.35	64.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.22	91.40
€	యూరో	ఎస్‌బీఐ	80.12	80.28
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.39	59.51
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.28	52.39
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.31	49.41
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.39	18.24
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.75	18.41
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.11	11.56

'చమురు' వదులుతుందేమో!!

2017-18లో 6.75 శాతానికి వృద్ధి రేటు

- 2018-19లో 7-7.5 శాతానికి చేరొచ్చు
- డీమో, జీఎస్‌టీ ప్రభావాలు పోతున్నాయి
- కానీ పెరిగే చమురు ధరలతోనే చిక్కంతా
- దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదముంది
- పెరిగిపోయిన షేర్ల ధరలు కూడా పడిపోవచ్చు
- తాజా పరిస్థితిని, భవిష్యత్‌ను ఆవిష్కరించిన ఆర్థిక సర్వే
- పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ తాలూకు ప్రభావాల నుంచి బయటపడి దేశ ఆర్థిక వ్యవస్థ చక్కగా పుంజుకుంటోందని, 2018–19 ఆర్థిక సంవత్సరంలో 7– 7.5 శాతం స్థాయిలో వృద్ధి రేటు నమోదవుతుందని 2017–18 సంవత్సర ఆర్థిక సర్వే స్పష్టంచేసింది. సోమవారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటు ముందుంచిన ఈ సర్వే... ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా మళ్లీ గత స్థానానికి చేరుకుంటామని ఆశాభావాన్ని వ్యక్తంచేసింది. ''ప్రపంచ వృద్ధి రేటు 2018లో ఒక మోస్తరు స్థాయిలోనే పురోగమిస్తుంది. మనకైతే జీఎస్‌టీ పూర్తి స్థాయిలో స్థిర పడటం, పెట్టుబడులు పెరిగే అవకాశాలు, కొనసాగుతున్న సంస్కరణలు అధిక వృద్ధి రేటుకు అనుకూలాంశాలుగా కనిపిస్తున్నాయి. కాకపోతే పెరుగుతున్న చమురు ధరలు, పెరిగిన స్టాక్ ధరల్లో భారీ కరెక్షన్ వంటి సవాళ్లుంటాయి. వీటి కారణంగా విదేశీ నిధుల రాక ఆగిపోతుంది'' అని సర్వే అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు రూపొందించిన ఈ సర్వేను... మరో రెండు రోజుల్లో (ఫిబ్రవరి 1న) బడ్జెట్ సమర్పించనున్న నేపథ్యంలో సోమవారం లోక్‌సభలో జైట్లీ ప్రవేశపెట్టారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ద్రవ్య క్రమశిక్షణ నిలిచిపోయే అవకాశాన్ని సర్వే తోసిపుచ్చలేదు.

అంచనాలను మించే వృద్ధి...

ఈ ఆర్థిక సంవత్సరంలో (2017–18) జీడీపీ వృద్ధి 6.75 శాతంగా నమోదవుతుందని సర్వే పేర్కొంది. కాకపోతే ఇది 6.5 శాతంగా ఉండొచ్చని ఇటీవలే కేంద్ర గణాంకాల విభాగం పేర్కొనడం గమనార్హం. 2016–17లో జీడీపీ వృద్ధి 7.1 శాతం కాగా, 2014–15లో ఇది ఏకంగా 8 శాతంగా ఉంది. 2017–18కు స్థూలంగా జోడించిన విలువ (జీవీఏ) 6.1 శాతంగా సర్వే అంచనా వేసింది. గతేడాది ఇది 6.6 శాతం. ఎగుమతులు, ప్రైవేటు పెట్టుబడులు వచ్చే సంవత్సరంలో తిరిగి పుంజుకుంటాయంటూ... జీఎస్‌టీ సాధారణ స్థితికి చేరడం, రెండు రకాల బ్యాలన్స్ షీటు చర్యలు, ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణతో ఆర్థిక రంగంలో (మాక్రో) స్థిరత్వం నెలకొంటుందని అంచనా వేసింది.

సవాళ్లు పొంచి ఉన్నాయి...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దిగుమతి చేసుకునే చమురు ధరలు సగటున 14 శాతం పెరగ్గా, 2018–19 ఆర్థిక సంవత్సరంలోనూ 10–15 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని సర్వే అంచనా వేసింది. ఈ నేపథ్యంలో విధానాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. ''మధ్య కాలానికి మూడు విభాగాలపై దృష్టి సారించాలి. ఇందులో ఉద్యోగాల కల్పన ఒకటి. యువతకు, ముఖ్యంగా మహిళలకు మంచి ఉద్యోగ అవకాశాలుండాలి. విద్యావంతులైన, ఆరోగ్యవంతులైన కార్మిక శక్తిని సృష్టించడం రెండోది. సాగు ఉత్పాదనను పెంచడం మూడోది. ముఖ్యంగా వచ్చే ఏడాది ఎన్నికలున్నందున ఆర్థిక నిర్వహణ సవాలుగా ఉంటుంది'' అని సర్వే హెచ్చరించింది. వ్యాపార నిర్వహణలో మరింత సులభతర దేశంగా భారత్‌ను మార్చేందుకు అప్పిలేట్, న్యాయ విభాగాల్లో జాప్యం, అపరిష్కృత పరిస్థితులను తొలగించాలని సూచించింది. ఇందుకోసం ప్రభుత్వం, న్యాయ వ్యవస్థల మధ్య సమన్వయంతో కూడిన చర్యల అవసరాన్ని సర్వే గుర్తు చేసింది.



ఆర్థిక సర్వే పుస్తకాన్ని మీడియాకు చూపుతున్న అరవింద్ సుబ్రమణియన్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు

ఆర్థిక వ్యవస్థ చక్కగా, బలంగా ఊపందుకుంటోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ తాలూకు తాత్కాలిక ప్రభావాలు సమసిపోయాయి. ఎగుమతులు పుంజుకుంటే వృద్ధి రేటు 7.5 శాతం కంటే ఎక్కువే నమోదవుతుంది. అయితే పెరుగుతున్న చమురు ధరలు, పెరిగిన స్టాక్ ధరల్లో కరెక్షన్ అన్నవి డౌన్‌సైడ్ రిస్కులు. ద్రవ్యోల్బణం 0.2–0.3 శాతం పెరిగితే జీడీపీ కూడా ఆ మేరకు ప్రభావితం అవుతుంది. చమురు ధరలు బ్యారెల్‌కు 10 డాలర్లు పెరిగితే కరెంటు ఖాతా లోటు మరింత విస్తరిస్తుంది."

– అరవింద్ సుబ్రమణియన్,
కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు



ఇవీ... ముఖ్యాంశాలు

- 2017-18లో జీడీపీ వృద్ధి రేటు 6.75 శాతంగా ఉండొచ్చు.
- 2018-19లో ఇది 7-7.5%కి చేరుతుంది
- చమురు ధరలు పెరిగినా లేక షేర్ల ధరలు పడినా విధానపరమైన చర్యలు అవసరం.
- వ్యవసాయానికి సహకారం పెంచడం, ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ, బ్యాంకుల రీక్యాపిటలైజేషన్ వచ్చే ఏడాదిలో పూర్తి చేయాలి.
- పరోక్ష పన్నులు 50 శాతం పెరిగినట్టు జీఎస్‌టీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులు ఇతర సమాఖ్య దేశాలతో పోల్చి చూస్తే చాలా తక్కువగా ఉన్నాయి.
- పెద్ద నోట్ల రద్దు కారణంగా ఆర్థిక పొదుపునకు ప్రోత్సాహం లభించింది.
- 2017-18లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.3 శాతం. గత 6 ఆర్థిక సంవత్సరాల్లో ఇదే కనిష్ట స్థాయి.
- 2017-18లో సంస్కరణల కారణంగా సేవల రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 15 శాతం పెరిగాయి.
- కార్మిక చట్టాలు మెరుగ్గా అమలు చేసేందుకు టెక్నాలజీని వినియోగించాలి.
- స్వచ్ఛభారత్ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల వసతులు పెరిగాయి. 2014లో 39 శాతమే ఉంటే, 2018 నాటికి 76%కి చేరాయి.
- సమ్మిళిత వృద్ధికి గాను విద్య, ఆరోగ్యం వంటి సామాజిక రంగాలకు ప్రాధాన్యమివ్వాలి.

బాగుంది... కానీ

- వృద్ధిని స్వాగతిస్తూనే కార్పొరేట్ల సూచనలు
- వ్యవసాయం, ఉపాధిపై ఫోకస్ పెరగాలి: సీఐఐ
- ఎన్‌పీఏలపై పర్యవేక్షణ పెరగాలి: అసోచామ్
- తయారీ వృద్ధితో రుణాలకు డిమాండ్: పీడబ్ల్యూసీ
- 2018–19లో వృద్ధి 7 శాతమే ఉండొచ్చు: ఇండియా రేటింగ్స్



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 7–7.5 శాతం మేర ఉండొచ్చన్న ఆర్థిక సర్వే అంచనాలను కార్పొరేట్లు స్వాగతించారు. నిలకడైన ఆర్థిక వృద్ధి సాధనకోసం మానవ వనరుల్ని, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపర్చుకోవడంపై ప్రభుత్వం మరింతగా దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. 'రాబోయే సంవత్సరంలో వృద్ధి వేగం మెరుగుపడటానికి, ఆ తర్వాత నుంచి మరింతగా పుంజుకోవడానికి అవసరమైన కొత్త ఐడియాలను సర్వే ప్రస్తావించింది' అని పరిశ్రమల సమాఖ్య సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. ప్రధానంగా మహిళల ఉపాధితో పాటు విద్యావంతులైన, ఆరోగ్యవంతులైన మానవ వనరులను, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపర్చడంపై మధ్య కాలికంగా మరింత దృష్టి సారించాలని సర్వేలో చేసిన సిఫార్సులు సహేతుకమైనవేనని ఆయన చెప్పారు. వీటిలో కొన్నింటినైనా బడ్జెట్‌లో పరిగణనలోకి తీసుకోగలరని ఆశిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు.

ఎన్‌పీఏల పరిష్కారం కీలకం: అసోచామ్



మొండిబాకీల సమస్య పరిష్కారమయ్యే దాకా అధిక వృద్ధి సాధ్యపడకపోవచ్చని అసోచామ్ ప్రెసిడెంట్ సందీప్ జజోడియా అభిప్రాయపడ్డారు. నిరర్థక ఆస్తులపై పర్యవేక్షణ పెంచడం, బ్యాంకులకు సాధ్యమైనంత త్వరగా అదనపు మూలధనం సమకూర్చడం చేయాలన్నారు. 'ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండిబాకీలు పెరుగుతుండటం వంటి ఆందోళనకర అంశాలను సర్వే ప్రస్తావించింది. ఉపాధి కల్పన, వ్యవసాయం, విద్యపై మరింతగా దృష్టి సారించాల్సిన అవసరాన్ని సూచించింది' అని సందీప్ తెలిపారు. ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ద్రవ్యోల్బణ కట్టడిపై మరింతగా దృష్టి సారించాలని, సంస్కరణల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని చెప్పారాయన.

సేవల రంగంలో ఉద్యోగాలు పెరగాలి: డెలాయిట్



ఆటోమేషన్ పెరిగిపోతున్న నేపథ్యంలో కాయకష్టం అవసరమయ్యే ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతోందని డెలాయిట్ ఇండియా చీఫ్ ఎకనమిస్ట్ అనీస్ చక్రవర్తి చెప్పారు. ఈ నేపథ్యంలో సేవల రంగంలో మరిన్ని ఉద్యోగావకాశాల కల్పన జరగాల్సి ఉంటుందన్నారు. తయారీ రంగం వృద్ధి చెందుతుండటం సానుకూలాంశమని పీడబ్ల్యూసీ ఇండియా లీడర్ (ఇన్‌ఫ్రా విభాగం) మనీష్ అగర్వాల్ పేర్కొన్నారు. రుణాలకు డిమాండ్ పెరగడంతో పాటు సిమెంటు, ఉక్కు మొదలైన వాటి వినియోగం పెరుగుదలతో పారిశ్రామికోత్పత్తి మరింతగా మెరుగుపడగలదన్నారు. 2018–19లో వృద్ధి మెరుగుపడటం ఖాయమే అయినప్పటికీ.. ఇది సర్వేలో అంచనా వేస్తున్న శ్రేణిలో దిగువ స్థాయిలోనే ఉండొచ్చని (7 శాతం) ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ చీఫ్ ఎకానమిస్ట్ దేవేంద్ర కుమార్ పంత్ తెలిపారు. దేశ, విదేశీ పరిస్థితుల కారణంగా వృద్ధి ఎటువైపైనా మొగ్గ చూపవచ్చన్నారు.

ఇన్‌ఫ్రాకు 2040కి 4.5 ట్రిలియన్ డాలర్లు



దేశంలో మౌలిక రంగ అభివృద్ధికి వచ్చే 25 సంవత్సరాల్లో 4.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరం అవుతాయి. అయితే ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే, 3.9 ట్రిలియన్ డాలర్లను మాత్రమే సమీకరించుకోగలిగే అవకాశముంది. ప్రైవేటు పెట్టుబడులతోపాటు, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఎన్ఐఐబీ), ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (బ్రిక్స్ బ్యాంక్) ద్వారా మౌలికానికి పెట్టుబడులను సమీకరించుకోవాలి.

విదేశీయుల పర్యటనలు పెరిగాయి...



పర్యాటక రంగం అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యల వల్ల దేశంలో విదేశీయుల పర్యటనలు గణనీయంగా పెరిగాయి. పర్యాటకం ద్వారా 2017లో విదేశీ మారక ఆదాయం 29 శాతం పెరిగి, 27.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇక పర్యాటకుల సంఖ్య 15.6 శాతం పెరిగి, 1.02 కోట్లుగా నమోదైంది. పర్యాటకం అభివృద్ధి దిశలో ఈ–వీసా, ది హెరిటేజ్ ట్రైల్ వంటి అంశాలతో సహా ప్రభుత్వం ఈ విషయంలో చేపట్టిన ప్రచారం కూడా కలిసివచ్చాయి.

జీఎస్‌టీతో పెరిగిన 'పరోక్ష' పన్ను బేస్



జూలై నుంచీ అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్ను తో పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య 50 శాతంపైగా పెరిగింది. 34 లక్షల వ్యాపార సంస్థలు పన్ను పరిధిలోకి వచ్చాయి. పలు చిన్న పరిశ్రమల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. జీఎస్‌టీ వసూళ్ల పట్ల కొంత అనిశ్చితి ఉన్నప్పటికీ, ఒకసారి వ్యవస్థ స్థిరపడిన తర్వాత, ఆయా పరిస్థితులన్నీ తొలగిపోతాయి. జనవరి 24 వరకూ జీఎస్‌టీ కింద కోటి మంది పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారు.

ఎగుమతులూ పుంజుకుంటాయి..


అంతర్జాతీయ వాణిజ్యం పెరగనున్న నేపథ్యంలో మున్ముందు దేశీ ఎగుమతులు కూడా పుంజుకోగలవని సర్వే అంచనా వేసింది. అయితే, చమురు ధరల పెరుగుదల మాత్రం సమస్యలు సృష్టించే అవకాశాలున్నాయని పేర్కొంది. 2016లో 2.4 శాతంగా ఉన్న ప్రపంచ వాణిజ్యం.. 2017లో 4.2 శాతం, 2018లో 4 శాతం మేర వృద్ధి చెందగలదని అంచనా వేసింది.

డీమోనిటైజేషన్‌తో పెరిగిన గృహ పొదుపు




పెద్ద నోట్ల రద్దు వల్ల బహుళ ప్రయోజనాలు కనిపిస్తున్నాయి. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం ఇందులో ఒకటి. అలాగే గృహ పొదుపు రేట్లూ పెరిగాయి. పెట్టుబడుల పునరుద్ధరణలో పొదుపు రేటు పెంపు కీలకాంశం. అలాగే సాంప్రదాయకంగా బంగారంపై చేసే వ్యయాలను నగదు సంబంధ పొదుపుల వైపు మళ్లించడానికి విధానపరమైన ప్రాధాన్యత ఇవ్వాలి. నగదు వాడకం తగ్గి, ఎలక్ట్రానిక్ విధానాల ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరగడం డీమోనిటైజేషన్ వల్ల ఒనగూరిన ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి.

ఎన్‌పీఏల పరిష్కారంలో ఐబీసీది కీలకపాత్ర



బ్యాంకుల్లో పేరుకున్న రూ.8 లక్షల కోట్ల మొండిబకాయిల (ఎన్‌పీఏ) పరిష్కారానికి కొత్త దివాలా చట్టం (ఐబీసీ) పటిష్టవంతమైన యంత్రాంగాన్ని అందిస్తోంది. పలు వివాదాల పరిష్కారానికి నిర్దిష్టమైన కాలపరిమితులను నిర్దేశిస్తోంది. కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్లను మెరుగుపరచుకోవటానికి తగిన విధివిధానాలను అందిస్తోంది. ట్విన్ బ్యాలెన్స్ షీట్ (టీబీఎస్) చర్యలు దీర్ఘకాలిక సమస్యపరిష్కారంలో ప్రధానమైనవి. ప్రస్తుతం దివాలా ప్రొసీడింగ్స్ కింద 11 కంపెనీలకు చెందిన రూ.3.13 కోట్ల విలువైన క్లెయిమ్స్ ఉన్నాయి.

ఆరేళ్ల కనిష్టానికి సగటు ద్రవ్యోల్బణం



2017–18లో సగటు ద్రవ్యోల్బణం 3.3 శాతం. ఇది ఆరేళ్ల కనిష్ట స్థాయి. ఒక స్థిర ధరల వ్యవస్థవైపు ఆర్థికవ్యవస్థ పురోగమిస్తోంది. ధరల కట్టడి ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటి. హౌసింగ్, ఇంధనం మిగిలిన ప్రధాన కమోడిటీ గ్రూపులన్నింటిలో ద్రవ్యోల్బణం స్థిరంగా ఉంది. సీజనల్ ఇబ్బందుల వల్ల ఇటీవల కూరగాయలు, పండ్ల ధరలు పెరిగాయి. సరఫరాల్లో ఇబ్బందుల తొలగించి ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుంది.

'గులాబీ బాల'ను గౌరవిద్దాం!

మహిళల ప్రాధాన్యాన్ని వివరించిన సర్వే

ఆడవారిని గులాబీలతో పోలుస్తారు. అంతటి సుకుమారులు కనకే వారిని 'గులాబీ బాల' అని సంబోధిస్తుంటారు. బహుశా.. అందుకేనేమో!! ఈ సారి సర్వేలో మహిళల ప్రాధాన్యాన్ని, లింగ వివక్షపై వ్యతిరేకతను చాటడానికి మోదీ ప్రభుత్వం గులాబీ రంగును ఎంచుకుంది. సర్వే కవర్ పేజీ సహా గులాబీ రంగులో మెరిసింది. మహిళలపై హింసకు ముగింపు పలకాలన్న ఉద్యమానికి మద్దతుగానే కవర్ పేజీకి గులాబీ రంగులద్దారన్నది నిపుణుల మాట. ''కనీసం ఒక్క కుమారుడినైనా కలిగి ఉండాలన్న సామాజిక ప్రాధాన్యతను భారత్ వ్యతిరేకించాలి. స్త్రీ, పురుషులను సమానంగా అభివృద్ధి చేయాలి'' అని పేర్కొంది. ''47 శాతం మహిళలు ఎటువంటి గర్భనిరోధకాలూ వాడటం లేదు. వాడే వారిలో కూడా మూడోవంతు కన్నా తక్కువ మంది మాత్రమే పూర్తిగా మహిళలకు సంబంధించిన గర్భ నిరోధకాలు వాడుతున్నారు'' అని సర్వే తెలియజేసింది.



నిర్మాణ రంగంలో కోటిన్నర కొత్త ఉద్యోగాలు

కొన్నాళ్లుగా స్థిరాస్తి.. నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ, ఇందులో వచ్చే అయిదేళ్లలో 1.5 కోట్ల ఉద్యోగాలు వస్తాయని సర్వే అంచనా వేసింది. అత్యధిక జనాభాకు ఉపాధి కల్పించడంలో వ్యవసాయం తర్వాత రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం కలిపి రెండో స్థానంలో ఉన్నట్లు తెలియజేసింది. ''2013లో ఈ రంగంలో 4 కోట్లపైగా సిబ్బంది ఉండగా.. 2017కి ఈ సంఖ్య 5.2 కోట్లకు చేరింది. 2022 నాటికి 6.7 కోట్లకు చేరొచ్చు. ఏటా 30 లక్షల ఉద్యోగాల చొప్పున అయిదేళ్లలో కోటిన్నర ఉద్యోగాల కల్పన జరగవచ్చు' అని సర్వే వివరించింది. రియల్టీ, కన్‌స్ట్రక్షన్ రంగంలో 90% మంది నిర్మాణ కార్యకలాపాల్లో పనిచేస్తుండగా, మిగతా 10% ఫినిషింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల్లో ఉంటున్నారు.



ఫండ్స్‌పై పెరుగుతున్న మక్కువ



గత ఆర్థిక సంవత్సరంలో కుటుంబాల పొదుపు... బ్యాంక్ డిపాజిట్లలో 82%, జీవిత బీమా ఫండ్స్‌లో 66 శాతం, షేర్లు, డిబెంచర్లలో 345% చొప్పున పెరిగాయి. మ్యూచువల్ ఫండ్స్‌పై ఇన్వెస్టర్ల మక్కువ పెరుగుతోంది. ఫండ్స్ పొదుపులు 400 శాతం వృద్ధి చెందాయి. కేవలం రెండేళ్లలోనే ఫండ్స్ పొదుపులు 11 రెట్లు పెరిగాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–అక్టోబర్ నాటికి మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.2.53 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి. దీంతో గత ఏడాది అక్టోబర్ 31 నాటికి మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్వహణ ఆస్తులు రూ.21.43 లక్షల కోట్లకు పెరిగింది.

వనరులు తక్కువైనా విద్య, ఆరోగ్యంపై దృష్టి



పరిమిత వనరులున్నా.. విద్య, ఆరోగ్యాలకు ప్రభుత్వం గణనీయ ప్రాధాన్యమిస్తోందని సర్వే తెలిపింది. 'భారత్ వర్ధమాన దేశం. విద్య, ఆరోగ్యం వంటి కీలకమైన మౌలిక సదుపాయాలపై భారీగా వెచ్చించేందుకు వెసులుబాటుండదు. ప్రభుత్వం మాత్రం వీటిని మెరుగుపర్చేందుకు నిరంతరం ప్రాధాన్యమిస్తూనే ఉంది. సామాజిక సంక్షేమం దృష్ట్యా పథకాలపై వ్యయాలను స్థూల రాష్ట్రీయోత్పత్తిలో (జీఎస్‌డీపీ) 2016–17లో 6.9%కి పెంచినట్లు తెలిపింది. 2014–15లో ఇది 6%. బాలికల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన బేటీ బచావో, బేటీ పఢావో పథకాన్ని దేశవ్యాప్తంగా మొత్తం 640 జిల్లాలకు విస్తరించనున్నారు.

తయారీలో అగ్రగామిగా మారతాం

- టాప్-5లో చోటుదక్కడం గొప్పగా ఉంది
- తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తయారీ రంగంలో అగ్రగామిగా మారతామన్న విశ్వాసం తమకుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. 2017–18 ఎకనమిక్ సర్వే ప్రకారం తయారీలో టాప్–5 రాష్ట్రాల్లో తెలంగాణకు చోటు దక్కటం తెలిసిందే. దేశం నుంచి తయారీ ఎగుమతుల్లో 70 శాతం ఈ అయిదు రాష్ట్రాలే కైవసం చేసుకోవడం మామూలు విషయం కాదన్నారు. టీఎస్–ఐపాస్ మూలంగానే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, తయారీ పెరగడం వల్లే తొలి అయిదు స్థానాల్లో తెలంగాణ చేరిందని గుర్తు చేశారు. మున్ముందు ఇదే ఒరవడి కొనసాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో విద్యుత్ మిగులు స్థాయికి రావడం, పారదర్శక పారిశ్రామిక విధానాలు, అవినీతికి తావులేకుండా అనుమతులివ్వడం వంటి చర్యలతో ఈ స్థాయిలో పురోగతి సాధించామన్నారు.



కేటీఆర్‌తో ఆర్ఈసీ, టి-హబ్‌తోపాటు ఇతర సంస్థల ప్రతినిధులు

పరిష్కారాల వేదిక టి–హబ్..

టి–హబ్‌తో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) చేతులు కలిపింది. ఇందులో భాగంగా పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తారు. సోమవారమిక్కడ కేటీఆర్ సమక్షంలో ఆర్ఈసీ సీఎండీ పి.వి.రమేష్, టి–హబ్ సీఈవో జయ్ కృష్ణ ఒప్పందం చేసుకున్నారు. కార్పొరేట్ కంపెనీల సమస్యలకు పరిష్కారాలను అందించే వేదికగా టి–హబ్ నిలుస్తుందని కేటీఆర్ ఈ సందర్భంగా అన్నారు. 'దావోస్ సదస్సులో బీర్ల తయారీ కంపెనీ కార్ల్స్‌బర్గ్ సీఈవో నన్ను కలిశారు. ఒక లీటరు బీరు తయారీకి 3.8 లీటర్ల మంచి నీరు వాడుతున్నామని, నీటిని మరింత ఆదా చేయగలిగే టెక్నాలజీ అందించేందుకు సాయపడాలని కోరారు. త్వరలోనే ఆ కంపెనీ టి–హబ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోనుంది' అని మంత్రి వివరించారు.

విద్యుత్ వెలుగులు దేశవ్యాప్తం!

మార్చికల్లా అన్ని గ్రామాలకు • ఆర్ఈసీ సీఎండీ పి.వి.రమేశ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మార్చినాటికి దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ విద్యుత్ వెలుగులుంటాయని రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సీఎండీ పి.వి.రమేశ్ వెల్లడించారు. '2015 ఆగస్టు 15 నాటికి విద్యుత్ సరఫరా లేని గ్రామాలు 18,458 ఉన్నాయి. ప్రస్తుతం ఈ సంఖ్య 1,227కు తగ్గింది. 2018 మే 1 కల్లా ప్రతి గ్రామంలో విద్యుత్ వెలుగులుండాలనేది కేంద్రం లక్ష్యం. ఈ లక్ష్యం మార్చి 31కల్లా నెరవేరనుంది. ఇందుకు ప్రభుత్వం రూ.45,000 కోట్లు కేటాయించింది' అని వివరించారు. విద్యుదీకరణ ప్రాజెక్టులకు ఇప్పటికే ఆర్ఈసీ విదేశీ మార్కెట్ల నుంచి రూ.4,220 కోట్ల దాకా సమీకరించింది. మరోమారు నిధులను సమీకరించనున్నట్టు రమేశ్ వెల్లడించారు. ఈ మొత్తం రూ.2,000–3,250 కోట్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 31లోగా రూ.9,750 కోట్ల దాకా సమీకరించేందుకు ఆర్‌బీఐ నుంచి ఆర్ఈసీకి అనుమతి ఉంది.




నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, (వ్యాపారస్తులు))	--	--
మిర్చి (వరంగల్, తేజ)	--	--
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.4,127 (కనిష్టం)	రూ.7,651 (గరిష్టం)
ఉల్లి (కర్నూలు)	రూ.1,000 (కనిష్టం)	రూ.2,350 (గరిష్టం)
చక్కెర (చెన్నై)	రూ.3,500	
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)	
కందిపప్పు (చెన్నై)	రూ.7,200	
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)	
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--	











బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,385
బంగారం (99.5, 10గ్రా)	30,235
వెండి (కిలో)	39,385
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	28,950
వెండి (కిలో)	--
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,400
బంగారం (22 క్యారెట్లు)	28,950
వెండి (కిలో)	42,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	31,070
బంగారం (22 క్యారెట్లు)	28,820
వెండి (కిలో)	40,700
విశాఖపట్నం	
బంగారం(24 క్యారెట్లు)	31,610
బంగారం (22 క్యారెట్లు)	28,980
వెండి (కిలో)	41,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	31,250
బంగారం (22 క్యారెట్లు)	28,900
వెండి(కిలో)	40,800
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,300
బంగారం (22 క్యారెట్లు)	28,950
వెండి (కిలో)	40,600

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 30-1-2018

విశాఖ	382-00
చిత్తూరు	383-00
వరంగల్	372-00
ముంబై	415-00
చెన్నై	390-00
విజయవాడ	372-00
గోదావరి	372-00
నమక్కల్	375-00
29-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	370-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.30
బెంగళూరు	380-00

జోష్‌నిచ్చిన ఆర్థిక సర్వే

- ఇంట్రాడేలో, ముగింపులో సూచీలకొత్త రికార్డులు
- 233 పాయింట్ల లాభంతో 36,283కు సెన్సెక్స్
- 61 పాయింట్లు పెరిగి 11,130కు నిఫ్టీ

సూచీ	ఇంట్రాడే	ముగింపు
సెన్సెక్స్	36,444	36,283
నిఫ్టీ	11,172	11,130

ఆర్థిక సర్వే వృద్ధి అంచనాలు ఆశావహంగా ఉండటంతో స్టాక్ మార్కెట్ రికార్డుల ర్యాలీ ఒక్క రోజు విరామం తర్వాత మళ్లీ కొనసాగింది. విదేశీ నిధులు వరద కొనసాగుతుండడం, కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు.. ఇవన్నీ స్టాక్‌మార్కెట్‌ను లాభాల్లో కొనసాగించాయి. స్టాక్ సూచీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ కొత్త రికార్డులను సృష్టించాయి. జీఎస్‌టీ వసూళ్లు మెరుగుపడడం, వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ ప్రణాళిక ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 233 పాయింట్ల లాభంతో 36,283 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 61 పాయింట్ల లాభంతో 11,130 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 394 పాయింట్ల లాభంతో 36,444 పాయింట్ల, నిఫ్టీ 102 పాయింట్ల లాభంతో 11,172 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి. ఇవి ఆయా సూచీలకు జీవిత కాల గరిష్ట స్థాయిలు. ఆ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. ఆర్థిక సంస్కరణలు వెన్నుదన్నుగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి మరింత పటిష్టమవుతుందని ఆర్థిక సర్వే పేర్కొంది.

అగ్రస్థానంలో టీసీఎస్..

టీసీఎస్ షేర్ 2.4 శాతం లాభంతో రూ.3,195 వద్ద ముగిసింది. టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 6.11 లక్షల కోట్లకు ఎగసింది. దీంతో అత్యధిక మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న భారత కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను తోసిరాజని టీసీఎస్ అగ్రస్థానానికి ఎగబాకింది.



బడ్జెట్‌పై అంచనాలతోనే...

మంచి బడ్జెట్ రాగలదని మార్కెట్ అంచనా వేస్తున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ఇండెక్స్ ప్రధాన కంపెనీలు మంచి ఫలితాలు వెల్లడించడంతో మార్కెట్ కొత్త గరిష్టాలకు చేరుతోందని వివరించారు. వేల్యుయేషన్లు అధికంగా ఉండటంతో ఇన్వెస్టర్లు మిడ్, స్మాల్ క్యాప్ షేర్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

మారుతీ జోరు..

ఇక నుంచి కొత్త మోడళ్లపై తక్కువ రాయల్టీ చెల్లించగలమని ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా మారుతీ సుజుకీ పేర్కొనడంతో ఆ షేర్ 4 శాతం వరకూ పెరిగి రూ.9,634 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా పెరిగిన షేర్ ఇదే.

హెచ్‌డీఎఫ్‌సీ లాభం రెండింతలు



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ నికర లాభం ఈ ఏడాది డిసెంబర్ క్వార్టర్లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రెండు రెట్లు పెరిగింది. గతేడాది క్యూ3లో రూ.2,729 కోట్లుగా ఉన్న నికర లాభం ఇపుడు రూ.6,677 కోట్లకు పెరిగిందని హెచ్‌డీఎఫ్‌సీ సీఈఓ కేకి మిస్త్రీ చెప్పారు.హెచ్‌డీఎఫ్‌సీ మొత్తం ఆదాయం రూ.14,989 కోట్ల నుంచి రూ.16,847 కోట్లకు పెరిగింది.ఆర్థిక ఫలితాలు బాగుడటం, రూ.35,000 కోట్ల నిధుల సమీకరణకు డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలపడం వంటి సానుకూలాంశాల నేపథ్యంలో బీఎస్‌ఈలో హెచ్‌డీఎఫ్‌సీ షేర్ ఇంట్రాడేలో ఆల్ టైమ్ హై, రూ.1,982ను తాకింది. చివరకు 2.6 శాతం లాభంతో రూ.1,953 వద్ద ముగిసింది.

టెక్ మహీంద్రా లాభం రూ.943 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల సంస్థ, టెక్ మహీంద్రా ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.943 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన నికర లాభం రూ.856 కోట్లతో పోలిస్తే 10 శాతం వృద్ధి సాధించామని కంపెనీ తెలియజేసింది. ఆదాయం రూ.7,558 కోట్ల నుంచి 3 శాతం వృద్ధితో రూ.7,776 కోట్లకు పెరిగింది. సీక్వెన్షియల్‌గా చూస్తే నికర లాభం 13 శాతం, ఆదాయం 2 శాతం చొప్పున పెరిగాయి. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో టెక్ మహీంద్రా షేర్ 1.1 శాతం లాభంతో రూ.605 వద్ద ముగిసింది.

కృష్ణపట్నంలో స్నోమాన్ గిడ్డంగి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కోల్డ్ స్టోరేజీ లాజిస్టిక్ సంస్థ స్నోమాన్ లాజిస్టిక్స్... ఆంధ్రప్రదేశ్‌లో కొత్త గిడ్డంగిని ఏర్పాటు చేసింది. సోమవారం కృష్ణపట్నంలోని గేట్‌వే డిస్ట్రిపార్క్స్ లాజిస్టిక్స్ పార్క్ వద్ద ఈ వేర్‌హౌజ్‌ను ప్రారంభించింది. ఇందులో 3,600 ఉష్ణోగ్రత నియంత్రణ పాలెట్లు, 7 లోడింగ్, హ్యాండ్లింగ్ బేస్‌లు, జీ+5 రాకింగ్ సిస్టమ్స్, ఘనీభవన, వివిధ రకాల ఉష్ణోగ్రత నియంత్రణ చాంబర్లుంటాయి. వీటికి తోడు అదనంగా 10 వేల చదరపు టడుగుల డ్రై వేర్‌హౌస్ కూడా ఉన్నట్లు కంపెనీ చైర్మన్ ప్రేమ్ కిషన్ గుప్తా తెలియజేవారు. మత్స్య, మాంస, పాలు, పండ్ల ఉత్పత్తులు, ఫార్మాసూటికల్స్ ఎగుమతి, దిగుమతులకు ఇది ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.

అమర రాజా చైర్మన్‌కు అవార్డు



చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ సీజీ బాబా చేతుల మీదుగా అత్యుత్తమ వ్యాపార నాయకత్వానికి గానూ 2018 గ్రాండ్ మోనొజుకురి అవార్డును అందుకుంటున్న అమర రాజా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ రామచంద్ర ఎన్ గల్లా.

తగ్గిన లారస్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో లారస్ ల్యాబ్స్ నికర లాభం తగ్గింది. స్టాండలోన్ ఫలితాల్లో క్యూ3లో పన్ను తర్వాత లాభం (పీఏటీ) రూ.36 కోట్లను నమోదు చేసింది. నిజానికి గతేడాది ఇదే క్వార్టర్లో కంపెనీ రూ.46 కోట్ల లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆదాయం కూడా రూ.518 కోట్ల నుంచి రూ.483 కోట్లకు తగ్గింది.

బోర్డ్ మీటింగ్స్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, ఎస్‌బీఐ లైఫ్, రిలయన్స్ పవర్, టీవీఎస్ మోటార్ కంపెనీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇంజినీర్స్ ఇండియా, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్

పేటీఎం ఉద్యోగులకు ఈసాప్స్ విక్రయంతో రూ.300 కోట్లు..

న్యూఢిల్లీ: ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ ‘పేటీఎం’... తమ కంపెనీకి చెందిన 200 మందికిపైగా మాజీ, ప్రస్తుత ఉద్యోగులు కంపెనీలో వారికున్న వాటాను (ఈసాప్స్) విక్రయించుకున్నారని తెలిపింది. దీంతో వారికి రూ.300 కోట్లు సమకూరినట్లు పేర్కొంది. ఈ రెండో విడత వాటా విక్రయం తర్వాత కంపెనీ విలువ 10 బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపింది. పేటీఎం గతేడాది మే నెలలో సాఫ్ట్‌బ్యాంక్ నుంచి 1.4 బిలియన్ డాలర్లను సమీకరించింది. అప్పుడు పేటీఎం విలువ 7 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు.

27 నుంచి 28కి ఐఎస్‌బీ ర్యాంకు!

హైదరాబాద్: ప్రీమియర్ బిజినెస్ స్కూళ్లు... ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోల్‌కతాల గ్లోబల్ ర్యాంక్ ఈ ఏడాది మెరుగుపడింది. అయితే ఐఐఎం- అహ్మదాబాద్, ఐఎస్‌బీ హైదరాబాద్ ర్యాంక్ మాత్రం తగ్గింది. ఫైనాన్షియల్ టైమ్స్ లండన్ ‘గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్-2018’లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకోగా... దీని తర్వాతి స్థానంలో ఫ్రెంచ్ స్కూల్ ఇన్‌సీడ్ ఉంది. 2017లో 27వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్న ఐఎస్‌బీ... ఈ సారి 28కి పరిమితమయింది. ఐఐఎం-ఎ ర్యాంక్ 29 నుంచి 31కి తగ్గగా, ఐఐఎం-బెంగళూరు మాత్రం 49 నుంచి 35కి చేరుకోవటం గమనార్హం.

అక్టోబర్ - డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017-18	2016-17	వృ/క్షీ(%)	2017-18	2016-17	వృ/క్షీ(%)
నోవార్టిస్ ఇండియా	19	13	44	171	179	-4
ఐనాక్స్ లీజర్	13	4	225	329	300	10
ఇమామి	147	134	10	762	734	4
మ్యాజిక్ బ్రిక్స్	41	--	11	--	--	--
రిలయన్స్ కమ్యూనికేషన్స్	(130)	(531)	--	1,176	1,698	-30
ఐడీఎఫ్‌సీ	108	101	--	2,795	2,825	-1



నా జీవితం సినీపరిశ్రమకే అంకితం

వేటూరి సాహితీ పురస్కార గ్రహీత చంద్రబోస్

పాయకరావుపేట (విశాఖ జిల్లా)/తుని: ఊపిరి ఉన్నంత వరకు తన జీవితం సినీ పరిశ్రమకే అంకితమని ప్రముఖ సినీగేయ రచయిత చంద్రబోస్ అన్నారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీ ప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా చంద్రబోస్‌కు వేటూరి అష్టమ సాహితీ పురస్కారాన్ని సోమవారం ప్రదానం చేశాయి. తుని చిట్టూరి మెట్రోలో జరిగిన కార్యక్రమంలో సాహితీ పీఠం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, అధ్యక్షుడు సిహెచ్‌వికే.నరసింహారావు, వ్యవస్థాపక కార్యదర్శి కలగా జోగేశ్వరశర్మ, ప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్ విజయ్‌ప్రకాష్‌లు ఈ పురస్కారాన్ని చంద్రబోస్‌కు ప్రధానం చేసారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ..వేటూరి ప్రోత్సాహం వల్లే తాను ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని తనకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

ఫిబ్రవరి 13నే మహాశివరాత్రి

శ్రీశైల దేవస్థానం స్థానాచార్యులు పూర్ణానందస్వామి



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల పుణ్యక్షేత్రంలో ఫిబ్రవరి 13నే మహాశివరాత్రిని నిర్వహించేందుకు ఇదివరకే వైదిక కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు శ్రీశైల దేవస్థానం స్థానాచార్యులు పూర్ణానందస్వామి చెప్పారు. సోమవారం ఆయన శ్రీశైలంలో విలేకరులతో మాట్లాడారు. శివరాత్రి ఎప్పుడన్న విషయంపై ఎవరికీ సందేహాలు అవసరం లేదన్నారు. శ్రీశైల దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి బుట్టే వీరభద్ర దైవజ్ఞ పంచాంగంలోనూ 13నే మహాశివరాత్రిగా పేర్కొన్నారని గుర్తుచేశారు. మిగిలిన అనేక పంచాంగాల్లో కూడా ఇదే ఉందని చెప్పారు. మహాశివరాత్రి ఫిబ్రవరి 14న అని కొందరు అంటున్నప్పటికీ 13నే జరుపుకోవాలని సూచించారు.

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఈశ్వరి

సాక్షి, హైదరాబాద్: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు శాసనసభా నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మద్యానపు ఈశ్వరి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.



'వాక్ విత్ జగనన్న' కార్యక్రమంలో భాగంగా తిరుపతి జీవకోన రోడ్డులో అశేష జనవాహినితో కలసి పాదయాత్ర చేస్తున్న భూమన కరుణాకరరెడ్డి, పార్టీ నేతలు



గుంటూరు లాడ్జి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు. పక్కన రావి వెంకటరమణ, ఎమ్మెల్యే ముస్తఫా, లేళ్ళ అప్పిరెడ్డి తదితరులు



విశాఖ కంచరపాలెంలో పాదయాత్ర చేస్తున్న పార్టీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు తైనాల విజయకుమార్ తదితరులు

వాక్ విత్ జగనన్న



వైఎస్సార్‌సీపీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలులో భారీ ర్యాలీ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



వాక్ విత్ జగనన్న కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం విజయవాడలోని నైజాంగేటు వద్ద సభలో మాట్లాడుతున్న నందమూరి లక్ష్మీపార్వతి

ఉప్పొంగిన 'ప్రజా సంకల్పం'



నెల్లూరులో వాక్ విత్ జగనన్న కార్యక్రమంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కాకాణి గోవర్ధన్‌రెడ్డి

'వాక్ విత్ జగనన్న'కు భారీ స్పందనప్రతిపక్ష నేతపై దేశ విదేశాల్లో వెల్లువెత్తిన అభిమానం

సాక్షి, అమరావతి, సాక్షి నెట్‌వర్క్: ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చేపట్టిన 'ప్రజాసంకల్పం' పాదయాత్ర సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో ఆయనకు మద్దతుగా దేశ విదేశాల్లో 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమం భారీ ఎత్తున జరిగింది. ప్రతిపక్ష నేతకు సంఘీభావంగా పలుచోట్ల పాదయాత్రలు జరిగాయి. మొత్తం 3,000 కిలోమీటర్లకు పైగా సాగే ఈ పాదయాత్రలో మూడో వంతైన వెయ్యి కిలోమీటర్ల నడకను వైఎస్ జగన్ అవలీలగా అధిగమించడంతో పార్టీ శ్రేణులు, అభిమానుల్లో ఉత్సాహం ఉప్పొంగింది.

విదేశాల్లోనూ జోష్

వైఎస్ జగన్‌కు మద్దతుగా ఈ దఫా విదేశాల్లో మునుపటి కంటే ముమ్మరంగా 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమం జరిగింది. జగన్ వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని అధిగమించడానికి ఒక రోజు ముందుగానే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా దేశాల్లో వైఎస్సార్ సీపీ ఎన్నారై విభాగం సభ్యులు, వారి కుటుంబీకులు, అభిమానులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. సిడ్నీ, మెల్‌బోర్న్, మలేసియా, సింగపూర్, ఫ్రాన్స్, అట్లాంటా, ఆస్టిన్, డెట్రాయిట్, డల్లాస్, కనెక్టికట్, వాషింగ్టన్ డీసీ, కువైట్‌లో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలు జరిగాయి. టెక్సాస్‌లోని సిటీ హాస్టల్‌లో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన బల్లాడ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పలువురు పార్టీ అభిమానులు పాల్గొన్నారు. పార్టీ ఎన్నారై విభాగం, సోషల్ మీడియా విభాగాలు సంయుక్తంగా వీటిని సమన్వయం చేశాయి. హైదరాబాద్‌లో వైఎస్సార్ సీపీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి వరకు పాదయాత్ర జరిగింది. ఢిల్లీ, పుణె, చెన్నై, బెంగళూరులోనూ 'వాక్ విత్ జగన్' కార్యక్రమానికి భారీ స్పందన లభించింది.

కలసి కదిలిన 'కృష్ణా'

కృష్ణా జిల్లా విజయవాడలో సామారంగంచౌక్ నుంచి ప్రారంభమైన పాదయాత్రను పార్టీ నేత నందమూరి లక్ష్మీపార్వతి ప్రారంభించారు. చంద్రబాబును ఆదర్శంగా తీసుకొని ఎమ్మెల్యే బొండా ఉమా లాంటి నాయకులు ప్రజల ఆస్తులను దోచుకోవటానికి తెగబడుతున్నారని విమర్శించారు. ప్రజా సంకల్పయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పార్టీ నగర అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. పార్టీ విజయవాడ నగర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లాది విష్ణు ఆధ్వర్యంలో 2 కి.మీ. పాదయాత్ర జరిగింది. గుడివాడలో స్థానిక శరత్ థియేటర్ నుంచి నాగవరప్పాడు వరకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పాల్గొన్నారు. నాగాయలంక నుంచి అవనిగడ్డ వరకూ చేపట్టిన 12 కి.మీ. పాదయాత్రను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి ప్రారంభించారు. మచిలీపట్నం నియోజకవర్గంలో పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గంలో మచిలీపట్నం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కొలుసు పార్థసారధి పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు నూజివీడులో నిర్వహించిన వాక్ విత్ జగనన్నకు విశేష స్పందన లభించింది. మైలవరం నుంచి ఇబ్రహీంపట్నం వరకు జోగి రమేష్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. తిరువూరులో ఎమ్మెల్యే రక్షణనిధి ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు.


ప్రజలకు భరోసానే లక్ష్యం

- ప్రజా సంకల్పయాత్రపై వైఎస్సార్ సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి
- ఢిల్లీలో 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆకళింపు చేసుకొని అధికారంలోకి వచ్చాక ఎలా పరిష్కరిస్తామన్న అంశంపై భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర సాగుతోందని వైఎస్సార్ సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి చెప్పారు. ప్రజాసంకల్ప యాత్ర సోమవారంతో వెయ్యి కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో 'వాక్ విత్ జగనన్న' (జగనన్నతో కలసి నడుద్దాం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. తొలుత ఏపీ భవన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 'వాక్‌విత్ జగనన్న' కార్యక్రమాన్ని వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ప్రారంభించారు. పండిట్ రవిశంకర్ లేన్ వరకు ఈ యాత్ర సాగింది. టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. యాత్ర ఎన్ని కిలోమీటర్లు సాగిం దన్నది కాకుండా ఎన్ని లక్షల మంది ప్రజలకు చేరువై సమస్యల పరిష్కారంపై భరోసా కల్పించామన్నదినే ముఖ్య ఉద్దేశమన్నారు.

వైఎస్సార్ బాటలోనే జగన్: విజయసాయిరెడ్డి

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చేవెళ్ల – ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర ద్వారా గుర్తించిన ప్రజా సమస్యలను అధికారంలోకి వచ్చాక పరిష్కరించి పేదల హృదయాల్లో స్థానం సాధించిన మాదిరిగా జగన్ కూడా అదే బాటలో నడుస్తారని ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తండ్రిని మించిన తనయుడిగా జగన్ ప్రజలకు చేరువవుతారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు. మూడు వేల కి.మీ సాగే ప్రజాసంకల్ప యాత్ర అన్ని వర్గాల ప్రజలకు సమస్యల పరిష్కారంపై భరోసా కల్పించడమే లక్ష్యంగా సాగుతుందన్నారు.



న్యూఢిల్లీలోని ఆంధ్రాభవన్ వద్ద వాక్‌విత్ జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి

ఖజానా నూతన భవనాలకు రూ.80 కోట్లు

ఖజానా శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఏ.శివప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రంలోని ఎనిమిది జిల్లా కేంద్రాల్లో రూ.80 కోట్లతో నూతనంగా ఖజానా శాఖ భవనాలను (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ బిల్డింగ్స్) నిర్మిస్తున్నట్లు ఖజానా శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఏ.శివప్రసాద్ తెలిపారు. సోమవారం చిత్తూరు జిల్లా కేంద్ర ఖజానా శాఖ కార్యాలయంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలోని ఖజానా కార్యాలయాల్లో మూడ్రోజులపాటు తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఖజానా శాఖలో నూతన విధానాలను తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'విభజన హామీలు' అమలుచేసే వరకు పోరాటం


ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీలో నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేసే వరకు పోరాటం చేస్తామని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నేతలు పేర్కొన్నారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో నేతలు సోమవారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మగాంధీకి నివాళులర్పించారు. అనంతరం ఏపీ భవన్ వద్ద నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్న కేంద్రం ప్రత్యేక ప్యాకే జీతో సరిపెట్టిందని విమర్శిం చారు.విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్, ఉత్త రాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



క్వార్టర్ ఫైనల్లో శ్యామ్ కుమార్

ఇండియా ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ బాక్సర్ కాకర శ్యామ్ కుమార్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన పురుషుల 49 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో వైజాగ్ బాక్సర్ శ్యామ్ 5-0తో భారత్‌కే చెందిన నీరజ్ స్వామిని ఓడించాడు. మరో బౌట్‌లో ప్రపంచ యూత్ చాంపియన్ సచిన్ సివాచ్ థాయ్‌లాండ్ బాక్సర్ థాని నరీన్‌రామ్ చేతిలో ఓడిపోయాడు. మహిళల 51 కేజీల విభాగంలో భారత బాక్సర్లు సర్జుబాలా దేవి, పింకీ జాంగ్రా సెమీఫైనల్‌కు చేరి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు.



తాజా తాజా రోజర్...

సాక్షి క్రీడావిభాగం

...**తా**జాగా మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుని తన పయనం అలుపెరగనిదని చాటుతోన్న రోజర్ ఫెడరర్ గురించి ఎంత చెప్పినా అది కొంతే అనిపిస్తుంది. సంప్రదాయ-ఆధునిక టెన్నిస్‌కు వారథిలాంటి ఈ సౌమ్యుడు 36 ఏళ్ల వయసులోనూ, పడిపడి లేచే కెరటంలా కనిపిస్తున్నాడు. విమర్శలు, వివాదాలు, దూకుడు కలగలసిన క్రీడలో జెంటిల్‌మన్ వ్యక్తిత్వంతో సమున్నతంగా నిలుస్తున్నాడీ ఆల్ టైమ్ గ్రేట్. దాదాపు రెండు దశాబ్దాల అతడి ప్రస్థానం చూస్తే... 1 నుంచి 10 వరకు అన్నీ తానే అనే స్థితి నుంచి, ఒక దశలో అసలెక్కడున్నాడో తెలియని పరిస్థితినీ ఎదుర్కొన్నాడు. అయినా సంయమనం, స్థైర్యం కోల్పోలేదు. ఆటనే నమ్ముకున్నాడు. ఎప్పటికి ఏది సాధ్యమో దానినే అనుసరించాడు. దాని ఫలితమే తాజా ఘన పునరాగమనం. ఫిట్‌నెస్ కాపాడుకుంటూ టైటిల్స్‌ను నెగ్గుకురావడం ఎలాగనేది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రోజర్‌ను గమనించిన వారందరికీ ఓ పాఠమే. మొత్తం ఏడు మ్యాచ్‌ల్లో అయిదింటిని రెండు గంటల్లోపే ముగించిన అతడు టోర్నీలో కేవలం రెండే సెట్లు, అదీ ఫైనల్లో మాత్రమే ఓడిపోయాడు.

అది మర్చిపోయా...కానీ మళ్లీ వస్తా!

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయంతో ఫెడరర్ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యాడు. 'గెలిస్తే ఎలా స్వీకరించాలి? ఓడితే ఎలా ఉండాలి? అని మ్యాచ్‌కు ముందే తీవ్రంగా ఆలోచించే రోజర్ ఈ సందర్భంగా తన ఊతపదమైన 'మళ్లీ వస్తా' అని చెప్పడం మర్చిపోయాడు. దీంతో రిటైర్మెంట్ ప్రకటిస్తాడేమో అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే 'పునరాగమనాన్ని ఇష్టపడతా. ఆ సంగతి చెప్పడం మాత్రమే మర్చిపోయా. వచ్చే సంవత్సరం రాగలనని ఆశతో ఉన్నా' అని ప్రకటించి వాటికి తెరదించాడు. 'ఏడాదిలో మూడు గ్రాండ్‌స్లామ్స్ గెలిచానంటే నమ్మలేకున్నా. షెడ్యూల్‌ను చక్కగా ప్లాన్ చేసుకున్నా. ఆటను ఆస్వాదిస్తున్నంత కాలం ఒక ప్రొఫెషనల్‌గా భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని భావిస్తున్నా' అని అంటున్నాడంటే రెండు, మూడేళ్లయినా కొనసాగుతాడని తెలుస్తోంది.

ఆట కంటే దృక్పథం ముఖ్యం...

సహచరులంతా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఎండను నిందిస్తుంటే అతడు మాత్రం అందుకుతగ్గట్లు మనమే సిద్ధమవ్వాలన్నాడు.

ఫామ్ తాత్కాలికం... క్లాస్ శాశ్వతం.

మధ్యలో ఎందరో వచ్చారు. పోటాపోటీగానూ ఆడారు. కానీ, అంతే త్వరగా తెరమరుగయ్యారు. అవుతున్నారు. ఈ విజేత మాత్రం అలసిపోవడం లేదు.

వ్యక్తి ఎదుగుదలకు కుటుంబం అండ ముఖ్యం

అవును! అతడికి వెన్నంటి నిలిచే భార్య, నిత్యం ప్రోత్సహించే అమ్మానాన్న, కనుల పంటలాంటి కవలల జంట పిల్లలతో చక్కటి అనుబంధాల ఇల్లుంది.

వయసు అనేది ఓ అంకె మాత్రమే అనుకుంటే అది మనపై ప్రభావం చూపదు

ఈ స్విస్ యోధుడు సరిగ్గా ఇలానే భావిస్తాడు. చేయదగిన దానిపైనే దృష్టిపెడతాడు.

విజయ గర్వంతో పొంగిపోకూడదు... ఓటమితో కుంగిపోకూడదు...

పదుల గ్రాండ్‌స్లామ్‌లు గెలిచినా పసిపిల్లాడి తరహాలో ఒకే హావభావం. ఓటమినీ అంతే హుందాగా స్వీకరించిన గొప్పదనం.

ఆటపై అనురాగం: 2005-07 ఫెడరర్ రాజ్యమేలిన రోజులవి. ఆ కాలంలో 10 గ్రాండ్‌స్లామ్‌లలో 8 గెలిచాడు. నాదల్, జొకోవిచ్, ముర్రేల వంటి అథ్లెటిక్ నైపుణ్యం ఉన్నవారికి తోడు మధ్యలో వావ్రింకా మెరవడంతో తర్వాత రెండేళ్ల నుంచి అతడి ప్రభ తగ్గడం మొదలైంది. దీంతో నాలుగేళ్ల పాటు టైటిల్ అనేదే గెలవలేకపోయాడు. 2016లో ఆరు నెలలపాటు పోటీ ప్రపంచ టెన్నిస్‌కు దూరంగా ఉన్నాడు. తన పనైపోయిందని, వయసు మీదపడిందని విమర్శలు ఎదుర్కొన్నాడు. ఇంకెవరైనా అయితే ఇంతటితో ఆటపై ఆశలు వదులుకునేవారు. కానీ ఇక్కడ ఉన్నది ఫెడరర్. అందుకే గోడకు కొట్టిన బంతిలా వెనక్కువచ్చాడు. గతేడాది ఏకంగా నాదల్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలుచుకున్నాడు. బహుశా ఇందుకే తాను పునరాగమనాన్ని ఇష్టపడతానని చెబుతుంటాడేమో. ప్రస్తుతం రోజర్ అద్భుతమైన ఆటతీరుతో ఉన్నాడని... నాలుగేళ్ల టైటిళ్ల లోటును తీర్చుకుంటున్నాడని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పరిపూర్ణ మనిషి: సమకాలీన ఆటగాళ్లలో ఎవరికీ లేని చక్కటి కుటుంబం ఫెడరర్ సొంతం. అతడి ఘనతలకు ఈ నేపథ్యమూ ఓ కారణమే. తల్లిదండ్రులు, భార్య, నలుగురు పిల్లల తన కుటుంబానికి రోజర్ ఇచ్చే ప్రాధాన్యం అతడిని సంపూర్ణ వ్యక్తిగా చూపుతోంది. భార్య మిర్కానే మేనేజర్ కావడం ప్రణాళికల పరంగా ఈ స్విస్ స్టార్‌కు చాలా మేలు చేస్తోంది.

అతడిని అందుకోలేరేమో!: సమీప ప్రత్యర్థులైన నాదల్ (16 గ్రాండ్‌స్లామ్స్ టైటిల్స్) తరచూ గాయాలతో సతమతం అవుతున్నాడు. మునుపటి పదునులేదు. జొకోవిచ్ (12 గ్రాండ్‌స్లామ్స్) ఆటతీరుతో పాటు వ్యక్తిగత ఇబ్బందుల్లో ఉన్నాడు. ముర్రే స్థాయిని ఇంతకుమించి ఊహించలేం. పైగా వీరంతా 30 ఏళ్లు దాటినవారే. ఇక వావ్రింకా నిలకడైన ఆటగాడేమీ కాదు. ఈ లెక్కన ఫెడరర్ 20 టైటిళ్ల రికార్డును అందుకోవడం అసాధ్యంగానే కనిపిస్తోంది. దీనిని బలంగా చాటేందుకేనేమో... ఫైనల్ అనంతరం మీడియా సమావేశానికి వచ్చిన ఫెడరర్ ధరించిన టీ షర్ట్‌పై '20' అంకె స్పష్టంగా కనిపించింది.

కుర్రాళ్లూ... కాస్త జాగ్రత్త!

అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టు అసాధారణ ఫామ్‌లో ఉంది. గత రన్నరప్ అయిన యువ భారత్ ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఓటమన్నదే ఎరుగదు. తిరుగులేని విజయాలిచ్చిన ఆత్మవిశ్వాసంతో ఉన్న కుర్రాళ్లు నేడు అసలు సిసలు సవాల్‌కు సిద్ధమయ్యారు. కీలకమైన సెమీస్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఢీకొనేందుకు సై అంటే సై అంటున్నారు.

నేటి సెమీస్‌లో చిరకాల ప్రత్యర్థి పాక్‌తో పోరు

- జోరు మీదున్న భారత్

క్రైస్ట్‌చర్చ్: అసలే యువ భారత్ జోరుమీదుంది. టోర్నీ లో ఎదురులేని విజయాలందుకుంది. వరుసగా రెండో సారి ఫైనల్ చేరేందుకు తహతహలాడుతోంది. దీనికితోడు కుర్రాళ్లకు ఐపీఎల్ వేలం ఇచ్చిన కిక్కు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఈ నేపథ్యంలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను చిత్తుచేసి తమ జైత్రయాత్రను కొనసాగించాలనే లక్ష్యంతో టీమిండియా బరిలోకి దిగుతోంది. మరోవైపు పాకిస్తాన్ కూడా చెప్పుకోదగ్గ విజయాలతో సెమీఫైనల్ చేరింది. దీంతో మంగళవారం అండర్-19 ప్రపంచకప్‌లో ఆసక్తికర పోరు జరగనుంది. ఇరు యువ జట్లు 2014 తర్వాత మళ్లీ ఇప్పుడే తలపడుతున్నాయి.

ద్రవిడ్ మార్గదర్శనంలో...

కోచ్ రాహుల్ ద్రవిడ్ మార్గదర్శనంలో యువ జట్టు అద్భుత విజయాలను సాధిస్తూ సెమీస్ చేరింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో నిలకడను కనబరుస్తోంది. బ్యాటింగ్‌లో శుభ్‌మాన్ గిల్, కెప్టెన్ పృథ్వీ షా, మన్‌జ్యోత్ కల్రా చక్కని ఫామ్‌లో ఉన్నారు. ఆస్ట్రేలియాతో భారీ స్కోరుకు, భారీ విజయానికి ఈ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెనే కారణం. ఈ ముగ్గురితో పాటు విశేషంగా రాణిస్తోన్న బౌలర్లు నాగర్‌కోటి, శివమ్ మావిని ఐపీఎల్ ఫ్రాంచైజీలు సొంతం చేసుకున్నాయి. వీరిద్దరూ స్పిన్నర్ అనుకూల్ రాయ్‌తో కలిసి ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను ముప్పతిప్పలు పెడుతున్నారు. అర్షదీప్ కూడా అడపాదడపా రాణిస్తున్నాడు. పాక్ జట్టులో జైద్ అలమ్, అలీ జరియాబ్, కెప్టెన్ హసన్ ఖాన్ ఫామ్‌లో ఉన్నారు. పేసర్ షహీన్ ఆఫ్రిది నిప్పులు చెరిగే బౌలింగ్‌తో జట్టును గెలిపిస్తున్నాడు. సులేమాన్‌తో పాటు హసన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు.

భారత్: పృథ్వీ షా (కెప్టెన్), శుభ్‌మాన్ గిల్, ఆర్యన్ జుయల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్, హార్విక్ దేశాయ్, మన్‌జ్యోత్ కల్రా, కమలేశ్ నాగర్‌కోటి, పంకజ్ యాదవ్, ఇషాన్ పోరెల్, హిమాన్షు రాణా, అనుకూల్ రాయ్, శివమ్ మావి, శివ సింగ్.

పాకిస్తాన్: హసన్ ఖాన్ (కెప్టెన్), రొహైల్ నజీర్, మొహమ్మద్ అలీఖాన్, అలీ జరియాబ్, అమద్ ఆలమ్, ఇక్బాల్, ఇమ్రాన్ షా, తాహా, మోసిన్ ఖాన్, మూసా, జైద్, రియాజ్, సాద్ ఖాన్, షహీన్ ఆఫ్రిది, సులేమాన్ షఫ్‌ఖత్.



తెల్లవారుజామున 3 గంటల నుంచి 11 గంటల వరకు స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

ఫేవరెట్స్ సింధు, సైనా



న్యూఢిల్లీలో సోమవారం భారత బ్యాడ్మింటన్ సంఘం నుంచి జీవిత సాఫల్య పురస్కారం పొందిన దిగ్గజ ప్లేయర్ ప్రకాశ్ పదుకొనేతో సింధు సెల్ఫీ

నేటి నుంచి ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత టాప్ స్టార్స్ పీవీ సింధు, సైనా నెహ్వాల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. నేటి నుంచి జరిగే ఈ టోర్నీలో మాజీ చాంపియన్లయిన వీరిద్దరితో పాటు భారత అగ్రశ్రేణి క్రీడాకారులంతా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. తొలి రోజు మంగళవారం క్వాలిఫయింగ్ పోటీలు, బుధవారం నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించిన 2015 చాంపియన్ సైనా ఇండోనేసియా మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. నాలుగో సీడ్ సైనా తొలి మ్యాచ్‌లో సోఫీ డాల్ (డెన్మార్క్)తో తలపడుతుంది.

రియో ఒలింపిక్స్ నుంచి అదరగొడుతున్న సింధు గత సీజన్‌లో మూడు టైటిల్స్ గెలిచింది. మరో మూడింటిలో రన్నరప్‌గా నిలిచింది. ఇండోనేసియా టోర్నీ క్వార్టర్స్‌లో సైనా చేతిలో ఓడిన సింధు ఇండియా ఓపెన్ ద్వారా తన ఫామ్ చాటుకోవాలని భావిస్తోంది. తొలిరౌండ్లో నటాలియా రోడ్ (డెన్మార్క్)తో సింధు పోటీపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ శ్రీకాంత్ తొలి రౌండ్లో లీ చుక్ యి (హాంకాంగ్)తో తలపడతాడు.



టీడీపీ నేత దాడి.. యువకుడి అనుమానాస్పద మృతి

శ్రీకాకుళం జిల్లా పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఘటన

కాశీబుగ్గ: తెలుగుదేశం పార్టీ నేత దాడి చేసిన 24 గంటల్లోనే ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం సాయంత్రం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కేటీరోడ్డులో ఉన్న లక్ష్మీ స్వీట్ దుకాణంలో డోకి హరీష్ (25) అనే యువకుడు పని చేస్తున్నాడు. ఈ దుకాణంలోకి టీడీపీకి చెందిన పట్టణ 14వ వార్డు కౌన్సిలర్ పైల చక్రధర్ ఆదివారం సాయంత్రం వెళ్లి.. ఎడమ చేతితో మిఠాయిని తీసి తినే ప్రయత్నం చేశాడు. అయితే దీనికి హరీష్‌తో పాటు దుకాణంలో పని చేస్తున్నవారు అభ్యంతరం చెప్పారు. దీనికి ఆగ్రహించిన కౌన్సిలర్ చక్రధర్.. హరీష్‌ను బయటకు ఈడ్చుకొని వచ్చి చితకబాదాడు. ఈ ఘటనపై హరీష్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కాశీబుగ్గ సీఐ కె.అశోక్‌కుమార్ ఇరువురి మధ్య రాజీ కుదిర్చి పంపారు. అయితే అక్కడి నుంచి హరీష్ ఇంటికి చేరలేదు. అయితే వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు సమీపంలో రైలు పట్టాలపై హరీష్ శవమై ఉండటాన్ని జీఆర్‌పీ సిబ్బంది సోమవారం సాయంత్రం గుర్తించారు. కుమారుడి మృతిపై తండ్రి వెంకటరావు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, ఈ ఘటనలో టీడీపీ కౌన్సిలర్ చక్రధర్‌పై కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

'ట్రిబ్యూన్ విలేకరిపై ఎఫ్ఐఆర్ శోచనీయం'

న్యూఢిల్లీ: ఆధార్‌కు సంబంధించిన కీలక డేటా లీకేజీ ఉదంతాన్ని సాహసోపేతంగా వెలుగులోకి తెచ్చిన ట్రిబ్యూన్ విలేకరిని వేధింపులకు గురి చేయడం శోచనీయమని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) అధ్యక్షురాలు అఖిలా ఉర్నేకర్ అన్నారు. దీన్ని పత్రికా స్వేచ్ఛపై దాడిగా ఆమె అభివర్ణించారు. సదరు విలేకరిపై యూఐడీఏఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణం ఉపసంహరించాలని ఆమె డిమాండ్ చేశారు.

వస్తు, సేవల్లో ఏపీకి 9వ స్థానం

ఎకనమిక్ సర్వేలో వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: వస్తు, సేవల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తొమ్మిదో స్థానం దక్కింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2017–18 రాష్ట్రాల స్థానాలు వెల్లడయ్యాయి. వస్తు, సేవల విదేశీ



ఎగుమతుల్లో రాష్ట్రాల వాటాను తొలిసారిగా ఆర్థిక సర్వేలో పొందుపరిచారు. జీఎస్టీ గణాంకాల ద్వారా ఇది సాధ్యమైంది. విదేశీ ఎగుమతుల్లో 70 శాతం వాటా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలదే. అయితే ఈ గణాంకాల్లో జీఎస్టీయేతర (పెట్రోలియం తదితర) వస్తు, సేవలు లేవు. వస్తు, సేవల విదేశీ ఎగుమతుల్లో మహారాష్ట్ర వాటా 22.3 శాతం, గుజరాత్ వాటా 17.2 శాతం, కర్ణాటక వాటా 12.7 శాతం, తమిళనాడు వాటా 11.5 శాతం, తెలంగాణ వాటా 6.4 శాతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ 2.8 శాతం వాటా కలిగి ఉంది.

అంతర్రాష్ట్ర వాటాలు ఇలా..

వివిధ రాష్ట్రాలకు ఎగుమతుల్లో తొలి ఐదు స్థానాలు మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక నిలిచాయి. 10వ స్థానంలో ఏపీ, 12వ స్థానంలో తెలంగాణ ఉన్నాయి. అంతర్రాష్ట్ర దిగుమతుల్లో మహారాష్ట్ర, తమిళనాడు, యూపీ, కర్ణాటక, గుజరాత్‌లు తొలి ఐదు స్థానాల్లో నిలవగా, పదో స్థానంలో తెలంగాణ, పదకొండో స్థానంలో ఏపీ ఉన్నాయి.

జెండర్ స్కోర్‌లో ఏపీది చివరి రెండో స్థానం

ఆర్థిక సర్వే ప్రకటించిన జెండర్ స్కోర్‌లో ఆంధ్రప్రదేశ్ చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. లింగ వివక్ష కొనసాగుతోందని పరోక్షంగా పేర్కొంది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.